నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 1-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 96 | పేజీలు:6 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

భ్రమలో జనం
తోడికోడళ్ల పోరు
నేతల తీరు.

సంచారజాతులు
మారని జీవితాలు
కన్నీటి గోస.

నందన వనం
రెండుమాయమయ్యాయ
కొత్తవెంచర్లు.

వేసంగిపంట
రైతుల ఇంట మంట
నేతలతంట.

దున్నపైవాన
మేకపోతు గాంభీర్యం
మనిషి లోనూ

- రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

ఎవరు కొంటారో కొనరా
అయ్యయ్యో 'అన్న దాత' !
ప్రభుత్వాలు పెట్టుచుండె
'వెన్నెముకకు' వెన్నువాత!

కారు లోన కైలాసం
చూపుతారు వీళ్ళు!
కమలంలో వైకుంఠం
చూపుతారు వాళ్ళు.

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

సిరివెన్నెల సీతారామశాస్త్రి కన్నుమూత

హైదరాబాద్, నవంబర్ 30:టాలీవుడ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ కొరియోగ్రాఫర్ శివశంకర్ మాస్టర్ మరణవార్త నుంచి సినీ ప్రేక్షకులు కోలుకునేలోపే మరో విషాదం అలుముకుంది. ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి కన్నుమూశారు. న్యుమోనియాతో బాధపడుతున్న ఆయన.. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు.

సిరివెన్నెల సీతారామశాస్త్రి అసలు పేరు చంబోలు సీతారామశాస్త్రి. 20 మే, 1955న ఆంధ్ర ప్రదేశ్ లోని అనకాపల్లిలో జన్మించారు. తండ్రి సీవీ యోగి వేదపండితుడు, తల్లి అమ్మాజి గృహిణి. సీతారామశాస్త్రికి ఇద్దరు అక్కలు, ఇద్దరు సోదరులు. అనకాపల్లిలోని మున్సిపల్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరారు. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే ఆపేశారు. అనంతరం అనకాపల్లిలోని బీఎస్ఎన్ఎల్ శాఖలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో ఆర్ఎస్ఎస్‌లో చురుకైన పాత్ర పోషించారు. చిన్నతనం నుంచి సందేశాత్మక, దేశభక్తి గీతాలు రాయడం సీతారామశాస్త్రికి అలవాటు. అనేక కార్యక్రమాల్లో సైతం సొంతంగా పాటలు రాసి అలపించేవారు.

ఆ మీటింగ్ సీతారామశాస్త్రిని సిరివెన్నెల సీతారామశాస్త్రిని చేసింది..

1983లో కాకినాడలో జరిగిన ఒక కార్యక్రమంలో సినీ దర్శకుడు కె.విశ్వనాథ్‌ను కలిసే అవకాశం సీతారామశాస్త్రికి దక్కింది. ఆ సమయంలో సీతారామశాస్త్రిని ప్రతిభను కె.విశ్వనాథ్ గుర్తించారు. ఆయన చిత్రంలో పాటలు రాసే అవకాశం ఇచ్చారు. అలా తొలిసారి సిరివెన్నెల సినిమాలో పాటలు రాసే అవకాశాన్ని సీతారామశాస్త్రి దక్కించుకున్నారు. ఆ సినిమాలో ఆయన రాసిన పాటలు ఎంతగానో పాపులర్ అయ్యాయి. దీంతో ఆ సినిమా పేరే సీతారామశాస్త్రి ఇంటి పేరుగా మారింది. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో సిరివెన్నెల మూడు వేలకు పైగా పాటలు రాశారు. విధాత తలపున ప్రభవించినది.. సిరివెన్నెల రాసిన తొలి పాట. చివరిసారిగా.. అఖిల్ నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ చిత్రంలో చిట్టు అడుగు అనే పాట రాశారు.

అవార్డులు

సినీ సాహిత్యరంగంలో చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం సిరివెన్నెల సీతారామశాస్త్రిని పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన సినీ కెరీర్‌లో మొత్తం 11 నంది అవార్డులు, నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు.

వెల్‌లోనే టీఆర్ఎస్ ఎంపీలు.. లోక్‌సభ మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ, నవంబర్ 30: ధాన్యం సేకరణపై కేంద్రం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీలు మరోసారి లోక్‌సభలో డిమాండ్ చేశారు. ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు సభ ప్రారంభమైన తర్వాత.. టీఆర్ఎస్ ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. మార్కెట్ యార్డుల్లో ఉన్న ధాన్యాన్ని సేకరించాలని కోరారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ.. ధాన్య సేకరణపై జాతీయ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ చైర్‌లో కూర్చున్న ఏ రాజా.. టీఆర్ఎస్ ఎంపీలను శాంతింపచేసేందుకు ప్రయత్నించారు. రాజా ఎంత కోరినా తెలంగాణ ఎంపీలు వెనుదిరగలేదు. దీంతో 3 గంటల వరకు సభను వాయిదా వేశారు. ఇవాళ ఉదయం కూడా టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకువెళ్లి కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.

ఒమిక్రాన్‌పై అసత్య ప్రచారాలను నమ్మొద్దు : డీహెచ్ శ్రీనివాసరావు

హైదరాబాద్, నవంబర్ 30: ఇప్పటి వరకు దేశంలో, రాష్ట్రంలో కొత్త కరోనా వేరియంట్ ఒమిక్రాన్ ప్రవేశించలేదని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి, అసత్య ప్రచారాలను నమ్మొద్దని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎప్పుడైనా వేరియంట్ కేసు వచ్చినా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మీడియా ద్వారానే తెలియజేస్తుందన్నారు. ఇందులో ఎలాంటి దాపరికం కానీ, దాచాల్సిన అవసరం లేదన్నారు. ఎయిర్‌పోర్టుల్లో నిఘాను బలోపేతం చేశామన్నారు.

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 12 దేశాలను ఎట్ రిస్క్ కంట్రీస్‌గా గుర్తించిందని, ఆయా దేశాల నుంచి ప్రయాణికులందరికీ కూడా ఇవాళ అర్ధరాత్రి నుంచి ప్రతి ఒక్కరికీ ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేస్తామన్నారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తులను గచ్చిబౌలిలోని టిమ్స్ ఐసోలేషన్ సెంటర్‌కు తరలించి, చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 12 రిస్క్ దేశాల నుంచి 41 మంది ప్రయాణికులు వచ్చారన్నారు. ఇందులో యూరప్ 22 మంది, యూకే నుంచి 17 మంది, సింగపూర్ నుంచి ఇద్దరు రాగా.. వీరందరికీ ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేశామని, ఇందులో ఎవరికీ పాజిటివ్ రాలేదన్నారు.

ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు వారిని హోం క్వారంటైన్‌కు తరలించామన్నారు. రాబోయే 14 రోజులు వారి ఆరోగ్యాన్ని హెల్త్ కేర్ సిబ్బంది పరిశీలిస్తారని, ఎవరికైనా లక్షణాలు ఉంటే వారితో పాటు కాంటాక్టులకు పరీక్షలు చేస్తామన్నారు. నాన్ రిస్క్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల నమూనాలను ర్యాండమ్‌గా సేకరించి, జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఒమిక్రాన్ వేరియంట్‌కు సంబంధించి పూర్తిగా సమాచారం లేదన్నారు. ప్రాథమికంగా చాలా అత్యంత వేగంగా వ్యాపించే గుణం ఉన్నదన్నారు.

డెల్టా వేరియంట్ కంటే సుమారు ఆరు రెట్లు ఉధృతంగా వ్యాపించే గుణం సమాచారం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో స్వల్ప లక్షణాలతో కేసులు నమోదయ్యాయని, హాస్పిటల్‌లో చేరే కేసులు తక్కువగా ఉన్నాయన్నారు. కరోనా నుంచి ఇప్పటి వరకు ప్రపంచంలో ఎన్నో వేరియంట్లు అల్ఫా, బీటా, గామా వేరియంట్, డెల్టా వేరియంటట్లు చూశామన్నారు. ఇందులో ప్రపంచాన్ని వణికించింది డెల్టా వేరియంటేనన్నారు. వైరస్‌లో మ్యుటేషన్లు జరుగుతుంటాయని, ఇప్పటి వరకు మూడు లక్షలకుపైగా మ్యుటేషన్లు కరోనా వైరస్‌లో జరిగాయన్నారు.రాబోయే రోజుల్లో కూడా జరుగుతుంటాయని, అప్రమత్తంగా ఉంటూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ కొత్త వేరియంట్‌పై దిశానిర్దేశం చేశారని, సీఎం చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటైందని పేర్కొన్నారు.

ఒమిక్రాన్‌తో బాధపడుతున్న ఆఫ్రికా దేశాలకు సాయం చేస్తాం: భారత విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 30:ఒమిక్రాన్ కరోనా వేరియంట్‌తో ఇబ్బందులు పడుతున్న ఆఫ్రికా దేశాలకు తాము అండగా ఉంటామని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఒమిక్రాన్ (రాఎతిఇతీనీని)తో పోరులో ఆ దేశాలకు అవసరమైన వ్యాక్సిన్లు, తదితర వస్తువులన్నింటినీ పంపుతామని చెప్పింది. భారత్‌లో తయారు చేసిన వ్యాక్సిన్లు, అవసరమైన మెడిసిన్స్ పంపుతామని భారత్ తెలిపింది. కరోనా టెస్ట్ కిట్లు, గ్లవ్స్, పీపీఈ కిట్లు, మెడికల్ ఎక్విప్‌మెంట్.. ఇలా ఆ దేశాలకు అవసరమైన సామగ్రి మొత్తం పంపేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

ఆ దేశాల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపింది. ఇప్పటికే బోత్సువానాకు కోవాగ్జిన్ వ్యాక్సిన్ సరఫరా చేశామని, ఈ దేశాలకు మరింత సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తమ సంసిద్ధతను బయటపెట్టింది. కాగా, కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్.. దక్షిణాఫ్రికాలో బయటపడిన సంగతి తెలిసిందే. ఇది చాలా వేగంగా వ్యాపిస్తుండటంతో ప్రపంచ దేశాలన్నీ ఆందోళన చెందుతున్నాయి.

మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసిన రామకృష్ణ మఠం సభ్యులు

హైదరాబాద్, నవంబర్ 30: పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠంకు చెందిన స్వచ్ఛంద సేవకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద 13. 02.1893లో హైదరాబాద్ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలో నిర్వహించిన ఆధ్యాత్మిక సమావేశం'ఓఎ ఓతిబబతినీని బినీ బిష్టవ చివబబి' ను గుర్తించి 'వివేకానంద దినోత్సవం' గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించటంతో పాటు ప్రతియేటా ఫిబ్రవరి 10 నుంచి 17 వరకు వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని మంత్రిని కోరారు.

హరిత ఇంధన భాగస్వామ్యం కోసం ఎంఒయుపై సంతకాలు చేసిన ఐఆర్‌ఇడిఎ- బివిఎఫ్‌సిఎల్

న్యూఢిల్లీ, నవంబర్ 30: పునరావృత ఇంధన ప్రాజెక్టులు, నిధుల సేకరణను అభివృద్ధి చేయడంలో సాంకేతిక- ఆర్థిక నైపుణ్యాలను అందించేందుకు భారత పునరావృత ఇంధన అభివృద్ధి ఏజెన్సీ (ఐఆర్‌ఇడీఎ) మంగళవారం బ్రహ్మపుత్ర వాలీ ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ (బివిఎఫ్‌సిఎల్)తో అవగాహన పత్రంపై సంతకాలు చేసింది. ఈ రెండు కంపెనీలూ కూడా నూతనడ పునరావృత ఇంధనం, రసాయినాలుడ ఫర్టిలైజర్ల మంత్రిత్వ శాఖ ఆధీనంలోని ప్రభుత్వ రంగ సంస్థలు. అవగాహనా పత్రంపై ఏఐఆర్‌ఇడిఎ చైర్మన్‌డ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ప్రదీప్ కుమార్ దాస్, బివిఎఫ్‌సిఎల్ సిఎండి డాక్టర్ శిబప్రసాద్ మొహంతీ ఐఆర్?డిఎ డైరెక్టర్ (టెక్నికల్) చింతన్ షా, ఐఆర్‌ఇడిఎ సిఎఫ్ఒ డాక్టర్ ఆర్. సి. శర్మ, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో సంతకాలు చేశారు. ఈ అవగాహనా పత్రం ప్రకారం, బివిఎఫ్‌సిఎల్ పునరావృత ఇంధన, హరిత ఉదజని, హరిత అమ్మోనియా, ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాజెక్టుల సాంకేతిక- ఆర్థిక అంశాలను శ్రద్ధతో చేపట్టనుంది. రానున్న ఐదేళ్ళకు పునరావృత ఇంధన ప్రాజెక్టులను సృష్టించేందుకు, పొందేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంలో బివిఎఫ్‌సిఎల్‌కు ఐఆర్‌ఇడిఎ తోడ్పడనుంది. రసాయినాలు, ఎరువుల రంగంలో బివిఎఫ్‌సిఎల్ వంటి ఇతర కంపెనీలు కార్బన్ ఉద్గారాలను తగ్గించుకొని, పర్యావరణకు అనుకూలంగా ఉండేలా ఈ భాగస్వామ్యం స్ఫూర్తినిస్తుందని ఐఆర్‌ఇడిఎ విశ్వసిస్తోందని అవగాహన పత్రంపై సంతకాలు చేస్తున్న సమయంలో ఐఆర్‌ఇడిఎ సిఎండి అభిప్రాయపడ్డారు.

హరిత ఇంధనం ద్వారా ఈశాన్య భారత అభివృద్ధిలో ఐఆర్‌ఇడిఎ కీలక పాత్రను పోషించేందుకు ఇది పురోగమన మార్గమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సిఒపి 26లో 2030 నాటికి కర్బన ఉద్గారాలను తగ్గించుకుంటామని చేసిన వాగ్దానానికి అనుగుణంగా భారత ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించడంలో ఈ ఎంఒయు తోడ్పడి దోహదం చేస్తుందని దాస్ నొక్కి చెప్పారు. ఇటీవల, నూతన ఒ పునరావృత ఇంధన మంత్రిత్వ శాఖ జల విద్యుత్ సహా దేశంలో మొత్తం పునరావృత ఇంధన మొత్తం వ్యవస్థాపిత సామర్థ్యం 150 గిగావాట్లు దాటిందని ప్రకటించింది. ఇందులో 19 గిగావాట్ల పునరావృత ఇంధన వ్యవస్థాపకతకు ఐఆర్‌ఇడిఎ తోడ్పడింది.

ఇన్ఫినిటీ ఫోరమ్‌ను ప్రారంభించనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 30:ఫిన్‌టెక్‌పై థాట్ లీడర్‌షిప్ ఫోరమ్ అయిన ఇన్ఫినిటీ ఫోరమ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించనున్నారు. ఉఎఈఖ సిటీ, బ్లూమ్‌బర్గ్ భాగస్వామ్యంతో 2021, డిసెంబర్ 3, 4 తేదీల్లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఎఈఖాఅం) ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. ఈ ఇన్ఫినిటీ ఫోరమ్ మొదటి ఎడిషన్‌లో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, ఐఐ భాగస్వామ్య దేశాలుగా ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా విధానాలు, వ్యాపారం, సాంకేతికతలో ప్రముఖులైన వ్యక్తులను ఈ ఇన్ఫినిటీ ఫోరమ్ ఒక్కచోట చేరుస్తుంది. సమ్మిళిత వృద్ధికి, మానవాళి సేవకు ఫిన్‌టెక్ పరిశ్రమ ద్వారా సాంకేతికత, ఆవిష్కరణలను ఎలా ఉపయోగించవచ్చనే అంశంపై ఆ ప్రముఖుల చర్చకు, కార్యాచరణకు ఈ ఇన్ఫినిటీ ఫోరమ్ తోడ్పడుతుంది.

జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి : మంత్రి కొప్పుల

హైదరాబాద్, నవంబర్ 30:చారిత్రాత్మక జహంగీర్ పీర్ దర్గా విస్తరణ, అభివృద్ధి, మక్కా మసీదు మరమ్మతులు, పునరుద్ధరణ పనుల్ని మరింత వేగవంతం చేయాలని సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. జె.పి,మౌలాలీ, పహాడీ షరీఫ్ దర్గాలు, మక్కా మసీదు, అనీసుల్ గుర్భాలలో కొనసాగుతున్న పనులు..కోకాపేటలో క్రిస్టియన్ భవన్ నిర్మాణం విషయంలో నెలకొన్న అడ్డంకులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వీటికి సంబంధించి మంగళవారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో సుమారు రెండు గంటల పాటు ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. సీఎం కేసీఆర్ జెపి దర్గాను సందర్శించి, దాని విస్తరణ, అభివృద్ధికి హామీనిచ్చి నిధులు మంజూరు చేశారన్నారు. ముఖ్యమంత్రి ప్రాధాన్యత అంశాలలో ఇది ఒకటన్న విషయాన్ని మంత్రి కొప్పుల అధికారులకు మరోమారు గుర్తు చేశారు.

దీని విస్తరణకు సంబంధించిన భూసేకరణ పనులను మైనారిటీ సంక్షేమ శాఖాధికారులతో సమన్వయం చేసుకుంటూ తక్షణమే పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయకుమార్‌ను ఆదేశించారు.
నగరంలో వక్ఫ్ బోర్డు కు చెందిన 11విలువైన ఆస్తులను ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఈ-టెండర్ ప్రక్రియ ద్వారా లీజుకు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కొప్పుల అధికారులను ఆదేశించారు.

అనంతరం త క్రిస్టియన్ భవన్ నిర్మాణం విషయంలో నెలకొన్న అడ్డంకులను తొలగించడానికి మంత్రి గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఇద్దరు మంత్రులు అధికారులతో సమీక్ష జరిపారు. కోకాపేటలో క్రిస్టియన్ భవన్ కోసం కేటాయించిన స్థలం విషయంలో ఉప్పెర (సగర) సంఘం నాయకులు కోర్టులో కేసు వేసిన విషయాన్ని అధికారులు మంత్రులకు వివరించారు.

సంఘం నాయకులతో మాట్లాడి కేసును వెనక్కి తీసుకునేలా వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి గంగుల బిసి సంక్షేమ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశానికి పలు సూచనలు చేశారు.

ఎవుసదారున్ని నేను !!

పొలం దున్నుకొని
పొతంజేసుడే గాని
పొక్కిలి జేసుడు
తెల్వనోన్ని నేను
కాయకష్టంజేసు కొని
బతుకెల్లదీసుడే గాని ,
కడప ఎత్తుజేసి
కత్తి పాతేటోన్ని గాదునేను
ఎవుసదారున్ని నేను !
ఏమిదెల్వనోన్ని నేను !!.

నడుమొంచి నడిజాముదాక
పనిజేసేటోన్నే గాని
నమ్మించి మోసం
చేసేటోన్ని గాదునేను !
నాదినేను జూసుకొని
నాదానుగుండేటోన్నే గాని
నోరుతో మాట్లాడి నొసలుతో
ఎక్కిరిచ్చేటోన్ని గాదునేను
ఎవుసదారున్ని నేను !
ఏమిదెల్వనోన్ని నేను !!.
మట్టిని నమ్మి మానవత్వాన్ని
పండించేటోన్నే నేను
నారువోసిన పంటతో
బ్రతుకు దిద్దుకునేటోన్నినేను !

పండించిన పంటగొనమంటే
బైరూపుల మాటలెందుకు ?
లేనోన్నే గావచ్చుగాని నేను
లేకోన్నిమాత్రం గాదునేను !
ఎవుసదారున్ని నేను !
ఏమిదెల్వనోన్ని నేను !!

అన్నం,ఆరోగ్యం ,ఆయుస్సును
అందరికి అందించేటోన్నేగాని
కపటం , కావురం కన్నేరుతనాలు
తెల్వనోన్ని నేను !
ఎద్దు,ఎవుసం , పంటా,పెంట
ఎరిగినోన్ని నేను
పచ్చనిపైరుని జూసి
పరవశించేటోన్ని నేను
ఎవుసదారున్ని నేను !
ఏమిదెల్వనోన్ని నేను !!

ఏరాజ్యం భయపెట్టినా
భయపడేటోన్ని కాను నేను
కాయకష్టం చేసి కాళ్ళమీద
నిలబడేటోన్ని నేను !
నీళ్ళందియ్యమంటే మమ్ముల
కన్నీళ్ళ పాల్జేస్తారెందుకు ?
యదార్థం మాట్లాడేటోన్ని నేను
యాడికైనా వచ్చేటోన్ని నేను
ఎవుసదారున్ని నేను !
ఏమిదెల్వనోన్ని నేను !!

-రాజేశ్
9440460490

సస్పెన్షన్‌పై పునరాలోచన చేయండి.. రాజ్యసభ ఛైర్మన్‌కు విపక్ష ఎంపీల వినతి

న్యూఢిల్లీ, నవంబర్ 30:పార్లమెంట్ శీతాకాల సమావేశాల మొదటి రోజైన సోమవారం రాజ్యసభలో 12 మంది విపక్ష పార్టీల సభ్యులను సస్పెండ్ చేయడంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ ఉదయం విపక్ష పార్టీలకు చెందిన 8 మంది రాజ్యసభ సభ్యులు.. కాంగ్రెస్ రాజ్యసభాపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే నేతృత్వంలో ఛైర్మన్ వెంకయ్యానాయుడును కలిశారు.

విపక్ష పార్టీలకు చెందిన 12 మంది ఎంపీలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసే విషయమై పునరాలోచన చేయాలని వెంకయ్యానాయుడును కోరారు. అయితే, సస్పెండ్ అయిన సభ్యులు క్షమాపణలు చెప్పకుండా వారిపై సస్పెన్షన్ ఎత్తివేయడం సాధ్యం కాదని వెంకయ్యానాయుడు తేల్చిచెప్పారు. ఇదిలావుంటే తాము ఏ తప్పు చేయలేదని, సభలో క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని సస్పెండైన ఎంపీలు తెగేసి చెబుతున్నారు.

ధాన్యం సేకరణపై కేంద్రం ప్రకటన చేయాలి: ఎంపీ నామా

న్యూఢిల్లీ, నవంబర్ 30: లోక్‌సభలో ఇవాళ మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ టీఆర్ఎస్ నేతలు దుమారం సృష్టించారు. ధాన్యం సేకరణపై కేంద్రం తమ విధానాన్ని ప్రకటించాలని గులాబీ ఎంపీలు డిమాండ్ చేశారు. బచావో బచావో కిసానోంకు బచావో అంటూ వెల్‌లో నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ఆందోళన చేస్తున్న టీఆర్ఎస్ సభ్యులకు స్పీకర్ ఓం బిర్లా ఓ అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంలో ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడారు. గడిచిన 60 రోజుల నుంచి తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రం సేకరించడంలేదన్నారు. అందుకే మేం సభలో ఇలా వ్యవహరించాల్సి వస్తోందన్నారు. ధాన్యం సేకరణపై ప్రభుత్వం ప్రకటన చేయాలని, అప్పుడే తాము చర్చలకు సిద్ధమన్నారు.తెలంగాణ రైతుల ధాన్యాన్ని కేంద్రం ప్రొక్యూర్ చేయడం లేదని నామా అన్నారు. కేంద్రం ఢిల్లీలో ఒక విషయాన్ని చెబుతోందని, తెలంగాణలో ఉన్న బీజేపీ నేతలు మరో మాట మాట్లాడుతున్నట్లు నామా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వంద వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. ధాన్యం సేకరణపై ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే, అప్పుడు తాము ఆందోళన విరమిస్తామని ఎంపీ నామా తెలిపారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ పోచంపల్లి

హైదరాబాద్, నవంబర్ 30:ఇటీవల వరంగల్ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డితో కలిసి ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను మంగళవారం కలిశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ పోచంపల్లిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవం కావడానికి కృషి చేసిన మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డిలను కేటీఆర్ అభినందించారు.

జంటనగరాల్లో 15న బంద్‌కు పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల జేఏసీ

హైదరాబాద్, నవంబర్ 30:తెలంగాణ డ్రైవర్ల జేఏసీ బంద్‌కు పిలుపునిచ్చింది. అక్రమంగా తిరుగుతున్న ఇతర జిల్లాల ఆటోలను అడ్డుకోవడంలో పోలీసులు, ఆర్‌టీఏ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (ంఆఏంఅ) డిసెంబర్ 15న జంటనగరాల్లో ఆటోల బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ మాట్లాడుతూ.. ఓలా, ఉబర్ క్యాబ్ యాజమాన్యాలు తమ నియంత్రణలో ఉన్న నాన్ లోకల్ ఆటోలను జంట నగరాల్లో అక్రమంగా నడుపుతున్నాయని ఆరోపించారు. వాటిని సీజ్ చేయాలని చేయాలన్నారు.

ఒమిక్రాన్ ఎఫెక్ట్.. 15 వరకు పాఠశాలలు మూసివేత!

పుణె, నవంబర్ 30:: ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ కొత్త వేరియంట్ 'ఒమిక్రాన్' వేరియంట్ భయాందోళనలకు గురి చేస్తున్నది. ఈ క్రమంలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు పాఠశాలలను తిరిగి ప్రారంభించాలన్న నిర్ణయాన్ని డిసెంబర్ 15 వరకు పుణె మున్సిపల్ కార్పొరేషన్ వాయిదా వేసింది. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించిన అనంతరం పాఠశాలల పునః ప్రారంభంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఇంతకు ముందు డిసెంబర్ 1 నుంచి పాఠశాలలను పునః ప్రారంభించాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా.. ఒమిక్రాన్ వేరియంట్ (ః.1.1.529), కరోనావైరస్ కొత్త రూపాంతరాన్ని తొలిసారిగా ఈ నెల 11న బోట్స్‌వానాలో నివేదించగా.. 14న కనిపించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 'వేరియంట్ ఆఫ్ కన్సర్న్'గా ప్రకటించింది.

చరిత్రలో నేటినిజం

కం॥ వేదమ్ముల నాదమ్మై
మోదము కలిగించె ప్రజకు మూర్ఛనుండై
ఆదరగము గాను ధునియై
దేదీప్యముగా వెలుగు ఉదిత నారాయణ్ !!

(డిసెంబర్ 1 ఉదిత్ నారాయణ్ పుట్టిన రోజు..)



-రాధశ్రీ
సెల్: 9494481210

నిప్పురవ్వలు



దహింపబడే
"ఒత్తి"వి నువ్వయితే
ద్రవీభవించే
"మైనాన్ని" నేను–
ఆవిష్కరింపబడిన ప్రేమ నువ్వైతే
సాక్షాత్కారంగా ప్రేమికుణ్ణి నేను!
సంధించిన తుపాకి నువ్వైతే
నీ గుండెలో మందుగుండును
నేను!

క్షణాలకు
రెక్కలున్నాయి–
ప్రాణాలు గువ్వల్లా
ఎగిరిపోతాయి–
అనుభవాలు
అక్షరాలై మిగిలిపోతాయి!



చుక్కల్ని కోయడానికి
నాతో రమ్మనను–
ఆకాశంలో ఎగరడానికి
నీ రెక్కల్ని అప్పు అడగను
అగాదంలో ఈదడానికి
నీ మొప్పలు వాడను–
చిరు జీ"వనం"లో
కొన్ని క్షణాలు నాతో
గడపమంటాను!

మధుర క్షణాలు
అక్షరాలైతే–
అనుభవాలు
కవితలే మరీ!



నీ బాధలకు
రెండు కన్నీటి చుక్కల్ని
గాల్చవచ్చు
కాని
అవి పెనుతుఫాను
నీటిమట్టం పెంచవచ్చు!
అందుకే–
ఆత్మ విశ్వాసాన్ని
నావగా మార్చి నీకిస్తున్నా!

- డా॥ విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 బుధవారం 1-12-2021

ఘంటారావం

మనిషిని పరామర్శించేవారు
పరిచయస్థులు
మనసును స్పర్శించేవారు
ప్రాణమిత్రులు.

అనుభవాలకు మించిన
చదువులేమున్నాయి?
అభిమానాలకు మించిన
పదవులేమున్నాయి?

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

నేటికవితలో ఈ వారం: 'అక్షరతూణీరం'
అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ

అక్షర(అక్షయ)పాత్ర

నా హృదయమొక అక్షరతూణీరాలను
పొదువుకున్న అక్షయపాత్ర
భావాల వెల్లువ ఉప్పెనలా
ఉప్పొంగుతుంటే
కలం అమ్ముల పొదలో చేరి
సిరాక్షరాలై దూసుకొచ్చి అక్షరశరాలై
సమాజంలో అబలలపై జరుగుతున్న
అత్యాచారాలని గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తాయి.
అన్యాయాలకు బలై తలెత్తుకుని తిరగలేక
కుమిలిపోయే
అభాగ్యుల వ్యథను రూపుమాపి
అక్కున చేర్చుకుని ఓ దారిచూపించే
సానుభూతిపరులపై
అక్షరసుమాల జల్లులు కురిపిస్తాయి.
నాఅక్షర శరాలకు
ప్రశించడమూ తెలుసు..
ప్రశంసించడమూ తెలుసు
నా అక్షరతూణీరం
అలసిపోదు..క్షయమైపోదు
క్షరం లేని నా అక్షరం శాశ్వతం
నా హృదయతూణీరంలో
కొత్తకొత్త భావాల శరాల్ని
నిలుపుకుంటాను



-కొలచన విజయభారతి,
హైదరాబాదు

హైదరాబాదుకు చెందిన కవయిత్రి కొలచన విజయభారతి గారు అక్షరతూణీరం అంశంపై అక్షయపాత్ర శీర్షికతో రాసిన కవితలోనా అక్షరశరాలకు ప్రశ్నించడమూ తెలుసు..ప్రశంసించడమూ తెలుసూ అంటూ తీర్చిదిద్దారు. నా హృదయమొక అక్షరతూణీరాలను పొదువుకున్న అక్షయపాత్ర అంటూ విజయభారతి గారు తమ కవితను ప్రారంభించారు. భావాల వెల్లువ ఉప్పెనలా ఉప్పొంగుతుంటే కలం అమ్ములపొదిలో చేరి సిరాక్షరాలై దూసుకొస్తాయని కొనసాగిస్తూ.. కవయిత్రి అక్షరాలతో చేస్తున్న దోస్తీని వివరించారు.

సమాజంలోని అక్రమాలపై, రుగ్మతలపై నా అమ్ములపొదలో ఉన్న అక్షరాలు నిలదీస్తాయన్న అర్థం ధ్వనించేలా కొనసాగించారు. సిరాక్షరాలుగా దూసుకొచ్చి అక్షరశరాలుగా మారి అబలలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిలదీస్తాయని పేర్కొన్నారు. అన్యాయాలకు బలై తలెత్తుకు తిరగలేక కుమిలిపోయే అభాగ్యులకు నా అక్షరాలు అండగా నిలుస్తాయని వివరించారు. అభాగ్యుల వ్యథలను రూపుమాపి అక్కున చేర్చుకుని దారిచూపే సానుభూతి పరులపై అక్షరసుమాల జల్లులు కురిపిస్తాయని కొనసాగించారు.

హృదయాంతరాలలో కదలాడే భావాలకు నా అక్షరాలు సముచిత సొబగులద్ది సందర్భోచితంగా స్పందిస్తాయని వివరించారు.

క్షరం లేని నా అక్షరాలు మంచి చెడులను ఆవిష్కరిస్తాయని కవయిత్రి ప్రకటించుకున్నారు. నా అక్షరశరాలకు ప్రశ్నించడమూ తెలుసు .. ప్రశంసించడమూ తెలుసంటూ పేర్కొన్న తీరు బాగుంది. నా అక్షర తూణీరం అలసిపోదు.. క్షయమైపోదు.. క్షరం లేని నా అక్షరం శాశ్వతమై..నా హృదయతూణీరాన్నుంచి కొత్త కొత్త భావాలు శరాలుగా పెట్టుకున్నానంటూ మంచి ముగింపునిచ్చారు.

తమ అక్షర తూణీరంలోని అక్షరశరాలను సమాజంలోని మంచి చెడులపై సంధిస్తానంటూ కవయిత్రి తమ సామాజిక చింతనను ప్రకటించుకున్నారు. ముగింపులో స్పష్టత కొరవడకుండా జాగ్రత్తపడితే బాగుండేది.

ఆశాకిరణం

మానవ జీవితానికి ఆశాకిరణం
మదిలోని భావాలకు మధురరూపం
దేశప్రగతికి శుభతరుణం
అభ్యుదయభావాల అక్షరతూణీరం
ఉదయించే ఆశలకు
ఇదియే ఉషోదయం.
మహేశ్వర వరప్రసాదాలు
ఈ అక్షరకుసుమాలు
ఇవియే భావానికి చక్కని భాష్యాలు
చదువులమ్మను పూజించే పారిజాతపుష్పాలు
గురువుల మదిలో మెరిసే కాంతికిరణాలు
శిష్యుల భావిజీవితానికి
వెలుగుబాట చూపు జ్ఞానదీపాలు..
ఎదలోతుల్లో నిక్షిప్తమైన వ్యథలను తొలగించే
ఓదార్పుల ఓషధులు
అలసిసొలసిన మనసులకు సేదదీర్చే నేస్తాలు..
మసకబారిన ఊహలకివియే చైతన్యదీపాలు..
అక్షరతూణీరమే
అన్యాయాన్నెదిరించే ఆయుధం
ఉద్యమాన్ని నడిపించే ఊతం
అజ్ఞానాంధకారాన్ని చీల్చివేసే విజ్ఞానకిరణం..
హృదయాలను పరవశింపజేసే
పరిమళ సోయగం

-కె.లలిత,
కరీంనగర్

కరీంనగర్ కు చెందిన కవయిత్రి కె.లలిత గారు అక్షరతూణీరం అంశంపై ఆశాకిరణం శీర్షికతో రాసిన కవితలో అక్షరతూణీరమే అన్యాయాన్నెదిరించే ఆయుధం.. అంటూ తమ భావాలను మనతో పంచుకున్నారు. అక్షరాన్ని ఆశాకిరణంగా పేర్కొంటూ తమ కవితను కొనసాగించారు.

మానవజీవితానికి ఆశాకిరణం మదిలోని భావాలకు మధురరూపం అంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. దేశప్రగతికి శుభతరుణం.. అభ్యుదయ భావాల అక్షరతూణీరం.. ఉదయించే ఆశలకు ఇదియే ఉషోదయమని పేర్కొన్నారు. కవయిత్రి తమ అక్షరాల అమ్ములపొదలో కొలువుదీరిన అక్షరశరాలు.. పరమేశ్వర వరప్రసాదాలనీ..అక్షర కుసుమాలు ఇవియే భావానికి చక్కని భాష్యాలని వ్యాఖ్యానించారు. అంతేకాక చదువులమ్మను పూజించే పారిజాత పుష్పాలుగా.. గురువుల మదిలో మెరిసే కాంతి కిరణాలుగా అభివర్ణించారు. అవే శిష్యుల భావిజీవితానికి వెలుగును చూపే జ్ఞానదీపాలని అభిప్రాయపడ్డారు. అక్షరాలకున్న ప్రాశస్త్యాన్ని కవయిత్రి తమదైన శైలిలో ఆవిష్కరింపయత్నించారు.

ఇంకా అక్షరాలను .. ఎదలోతుల్లో నిక్షిప్తమైన వ్యథలను తొలగించే ఓదార్పుల ఓషధులుగా, అలసి సొలసిన మనసులకు సేదదీర్చే నేస్తాలుగా వర్ణించారు. మసకబారిన ఊహలకివే చైతన్యదీపాలని ప్రకటించుకున్నారు. తమ అక్షర ఆయుధాలు అన్యాయాలను ఎండగడతాయనీ.. ఉద్యమాన్ని నడిపించేందుకు ఊతంగా నిలుస్తాయనీ.. అజ్ఞానాంధకారాన్ని చీల్చివేసే విజ్ఞానకిరణమని పేర్కొన్నారు. అక్షరం హృదయాలను పరవశింపజేసే పరిమళసోయగం అంటూ అక్షరం యొక్క గొప్పతనాన్ని చాటుతూ చక్కని ముగింపునిచ్చారు.

కవయిత్రి లలిత గారు తమ అక్షర తూణీరం లోని అక్షరాలు ఉదయించే ఆశలకు ఉషోదయంగా.. భావాలకు చక్కని భాష్యాలుగా.. చదువులమ్మను పూజించే పారిజాత పుష్పాలుగా వర్ణిస్తూ అక్షరంపై తమకున్న మక్కువను చాటుకున్నారు. వస్తు విశ్లేషణలో మరింత సమన్వయం..స్పష్టత ఉంటే బాగుండేదని అనిపించినా..కొంతవేరకైనా అంశం వెలుగులో తమ భావాలకు అక్షరాకృతినివ్వడంలో కవయిత్రి సఫలీకృతులైనారు.

బతుకుబాట

తప్పటడుగుల అడుగులతో
అక్షరలక్షలు నేర్చుకుంటూ
మదిబాషకు మందహాసమందిస్తూ
హృదినుండి వెలువడే అక్షరతూణీరాలు
బతుకుబాటకు బంగారు వెలుగులు.
సాధన,శోధనలతో చీకట్లను తొలగించి
జ్ఞానదీపమందించే గురూపదేశాలు
గురుతరబాధ్యతలతో వెలువడే అక్షర తోరణాలు
మార్గాన్ని నిర్దేశించే లక్ష్య తూణీరాలు.
ఎన్నో పొత్తముల సారం కాచి వడబోచి
కర్తవ్యనిష్టతో కలుగులను
వెతికి కాసారమందించి
ఉన్నతులుగా ఎదగనిచ్చి
ఎదసంబరాలనందించే అక్షరలక్షలు
బతుకు బాటను దిద్దే బంగారు మార్గాలు.
బంగారు బాల్యాన్ని
బహుముఖాలుగా తీర్చిదిద్ది
మది కాంక్షలతో ఎదగనిస్తూ
బతుకు బండిని నడిపే అక్షరమాలలు
కుక్షిని నింపి ముదమైన ప్రవర్తనతలతో
జగతిలో స్థాయిని పెంచే
సమ్మోహనాస్త్రాలు అక్షరతూణీరాలు

-డా. బండారి సుజాత,
హన్మకొండ

హన్మకొండకు చెందిన కవయిత్రి డా.బండారి సుజాత గారు బతుకుబాట శీర్షికతో అక్షరతూణీరం అంశంపై తమ భావాలను అక్షరాల్లో బంధించారు. బతుకుకు బంగారుబాట చూపేవి అక్షరాలేనన్న సందేశంతో సుజాత గారు తమ కవితను రూపుదిద్దారు.

తప్పటడుగుల అడుగులతో అక్షరలక్షలు నేర్చుకుంటూ ..మది భాషకు మందహాసమందిస్తూ హృదినుండి వెలువడే అక్షరతూణీరాలు బతుకుబాటకు బంగారు వెలుగులు పంచుతాయని పేర్కొన్నారు.

కవయిత్రి అత్యంత శ్రద్ధాభక్తులతో అక్షరం పట్ల తమకున్న గౌరవ భావాన్ని ప్రకటించే విధంగా కవితనుకొనసాగించి పాఠకులను మెప్పించారు. సాధన, శోధనలతో చీకట్లను తొలగించి జ్ఞానదీపమందించే గురూపదేశాలు.. గురుతర బాధ్యతలతో వెలువడే అక్షర తోరణాలు.. మార్గాన్ని నిర్దేశించే లక్ష్య తూణీరాలు అంటూ కొనసాగించారు. బతుకు బాటను మార్చేందుకు అక్షరాలు ఇంకా ఎలా ఉపయోగపడతాయో కవితలోని తర్వాతి పంక్తుల్లో తమ భావాలను ఆవిష్కరించారు. ఎన్నెన్ని పొత్తముల సారం కాచి వడబోసి కర్తవ్య నిష్టతో కలుగులను వెతికి కాసారమందించి ఉన్నతులుగా ఎదగనిచ్చి ఎదసంబరాలనందించే అక్షరలక్షలు బంగారు బాటను దిద్దే బంగారు మార్గాలు అంటూ కొనసాగించి.. అక్షరాల ప్రాశస్త్యాన్ని వివరించారు. బంగారు బాల్యాన్ని బహుముఖాలుగా తీర్చిదిద్ది మదికాంక్షలతో ఎదగనిస్తూ బతుకుబండిని నడిపే అక్షరమాలలు.. కుక్షిని నింపి.. ముదమైన ప్రవర్తనలతో జగతిలో స్థాయిని పెంచే సమ్మోహనాస్త్రాలు అక్షరతూణీరాలు అంటూ ముగించారు. కవితలో వచనం డామినేట్ చేయకుండా జాగ్రత్తపడితే బాగుండేది. వస్తువిశ్లేషణలో కవయిత్రి చూపిన శ్రద్ధ అభినందనీయంగా ఉన్నప్పటికీ మరింత కవితాత్మకంగా రాయడానికి శిల్పం విషయంలో మరింత శ్రద్ధ చూపితే బాగుండేది. అధ్యయనం ద్వారా తమ కలానికి మరింత పదును పెట్టుకుని ముందు గాఢమైన కవిత్వాన్ని అందిస్తారని ఆశిద్దాం.

భల్లం భాష్యం
కవులారా.. మరోసారి ఆలోచిస్తారా..!!

నిజమైన కవి ఎప్పుడు- పరులు ప్రాపుడు ప్రాపకానికో, సంతోషానికో, సంతృప్తికో, మెప్పుకో- గొప్పకో రాయడు. తనను తాను చీల్చుకుంటూ- కాల్చుకుంటూ పుటం పెట్టి పరీక్షించుకుంటూ అదొక పవిత్ర ధర్మంలానే రాస్తాడు.

మనసును తొలిచేస్తున్న లేదా జీర్ణించుకోలేకపోతున్న జీవన సందర్భా లను కొందరు కవులు కవిత్వంగా అద్భుతంగా అక్షరీకరిస్తుంటారు. కవిత్వంలో భావ చిత్రాలు మన ముందే ఉన్నట్లు, ఆపద బంధాలన్నీ మనకళ్ల ముందు నుంచి సాగిపోతున్నట్లు- అత్యంత వాస్తవికంగా కవిత్వం రాయడమంటే సమాజంలోని సౌందర్యాన్నీ- సంతోషాన్నీ, దుఃఖాన్నీ తనదే అన్నంత స్థాయిలో అనుభూతిస్తే కానీ సాధ్యంకాదు.

కవికి కవి హృదయం వున్నట్లు, కవిత్వంలో దార్శనికత, తాత్త్వికతలు ఉండాలి. అప్పుడే ఎన్నెన్నో కవితా ప్రక్రియల నుండి వస్తున్న ఆటుపోట్లను విజయ సాధకంగా ఎదుర్కోగలడు. ఏ సాహిత్య ప్రక్రియలోనైనా పొల్లు, తాలు కవిత్వాలు వుంటాయి. అది కొంత శాతం వరకు ఎప్పటికినీ వుంటూనే వుంటుంది. అట్లాంటి అంశాలను తేలికగా విడిచి పెట్టాల్సిందే.

ఏక కాలంలో జీవితాన్నీ, కవిత్వాన్నీ అత్యంత ప్రేమతోనూ, జాగరూకతతోనూ అనునిత్యం దర్శించే కవులు లేకపోలేదు. నిలువెత్తు ఊపిరితో శిరసు ఎంచక బతుకుతున్న కవిత్వంలా, దేనికీ లొంగని తత్త్వంలా-అడుగడుగున అద్భుత భావ చిత్రమయంగా కనిపించి పాఠకుల గుండెల్లో నిరంతరం వినిపిస్తుంటారు.

నిజమైనకవి- నికార్సైన విమర్శని, లోతైన విమర్శని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయడు. అరకొరి విమర్శలూ ఊహాజనిత విమర్శలూ, ఆత్మాశ్రయ విమర్శలూ- జడాత్మక విమర్శలు, పాక్షిక పక్షపాత విమర్శలూ ఒంటెద్దు పోకడలు లెక్కలోకి తీసుకోడు.

బతుకు బాటలో తారసపడే అన్ని బంధాలను అర్థం చేసుకోవడానికి ఎంతో అధ్యయనం చేస్తూ, తపస పడుతూ, కవిత్వాంశాన్ని మానవీయ కోణంలో ఆవిష్కరించే ప్రయత్నంలో పరిష్కారం కనిపెట్టేసరికి కవితల ప్రాణం తోకకొస్తుందేమో.

కవిత్వం బలమైన అయస్కాంతం వంటిది. ఎక్కడా ఒదగని- దేనికీ లొంగని సాహిత్యాభిమానుల్ని చటుక్కున ఆకట్టుకుంటుంది. గానుగలో చెరుకులా కవి నలిగిపోతున్నా అక్షరాల్ని నలగనీయడు. అభివ్యక్తిలో సంక్షిప్తత రానీయుడు.

కవి ఎప్పుడూ వర్తమాన సమాజిక స్థితినీ, సహజ సంక్లిష్టతలనూ, మనిషి అంతరంగ వేదనలనూ, ఎప్పటికప్పుడూ తన కవిత్వంలో శక్తివంతంగా పరిశుద్ధంగా పాఠకులకు నివేదించాలి. పతనమైపోతున్న నైతిక విలువలూ అసలు స్పృహకే రాని పౌర విధులు, లుప్తమైపోతున్న దేశభక్తితో పోటు వేగంగా విచ్ఛిన్నమైపోతున్న మానవ సంబంధాలు, ఇవన్నీ సమాజాభివృద్ధి ని స్వప్నించే కవికి ఎంతో ఆందోళన కలిగించే అంశాలు. కవి కవిత్వంలో తన అనుభవపు ఇంటెన్సిటీని పాఠకుడిలో కూడా కలిగించాలనుకున్నప్పుడు తన భాషలో భౌతిక స్పర్శకి భాగం చేయడానికి ప్రయత్నిస్తూనే వుంటాడు.

చిన్నచిన్న మాటల్ని ప్రయోగించి లోతైన ఆలోచనలు వెల్లడించడం కవి శైలీ రహస్యం. నిజానికి కవిత్వాన్ని రాయడం, ఎక్కువగా రాయడం తేలికైన పద్ధతి. కానీ గూఢంగా, గుప్తంగా, క్లుప్తంగా చెప్పడం కష్టం. మరో కవి పాఠకుల అవగాహనకి వదిలిపెట్టి, కవితల్ని పజిల్స్ లాగా పేర్చి, గళ్ళనుంచి తప్పుకోవడమూ అలవాటే.

కవి-నేలను ప్రేమించి, ఆ తల్లి నుదుట అక్షరాల్ని అచ్చొత్తుతాడు. ఆకాశాన్ని ఆలింగనం చేసుకొని సూర్యచంద్రుల సాక్షిగా నక్షత్రాల మీద రక్తాక్షరాలు దిద్దుతాడు. మనిషి చేరదీసి ఉత్సాహపు ఉగ్గుపాలు పడతాడు. దేశాన్ని దేహంగా ధరించి, సామాజిక మార్పులను ప్రతిబింబిస్తాడు. ప్రతి ధ్వనిస్తాడు.

కవిత్వానికి ప్రేరణ అవసరం. సమాజంలోని సమస్యలకి స్పందించి కవి రచనలు చేస్తూంటాడు. కొన్ని సందర్భాల్లో పోటీ కూడా ప్రేరణే. పోటీ వుంటేనే ఒక్కోసారి కవి వ్యక్తీకరణ శక్తి నిగ్గుతేలుతుంది. కొందరు ఆపాద మస్తక కవి స్వరూపులు- సుఖాన్ని దుఃఖాన్ని పడుగు పేకలుగా నేసిన పచ్చని శాలువాని కప్పుకుం టారు. నిన్నా, నేడు-రేపు సరిహద్దులు వారికి ఉండవు.

> కవిత్వం బలమైన అయస్కాంతం వంటిది. ఎక్కడా ఒదగని- దేనికీ లొంగని సాహిత్యాభిమానుల్ని చటుక్కున ఆకట్టుకుంటుంది. గానుగలో చెరుకులా కవి నలిగిపోతున్నా అక్షరాల్ని నలగనీయడు.

జీవితం ఎంత పరిణామాత్మకమైందో కవిత్వం కూడా అంతే. పరిణామం హఠాత్తుగా జరిగే ప్రక్రియ కాదు. అది విస్తార, వికాస, ప్రయోగ, పరిణత దశల్లోంచి- కవి హృదయాంతర్గతంలో రూపొంది ఒక కొత్త సంప్రదాయంగా పరిఢవిల్లుతుంది.

ఏ కవి అయినా నిగ్రహావధులను అధిగమించి, ఉద్విగ్నావేశంలో మాత్రమే నిజమైన కవిత్వ సృజన చేయగలడు. అయితే నేటి కవుల్లో చాలా మంది కవిత్వాన్ని ఒక సీరియస్ వ్యాపకంగా భావించకుండా అలవోకగా రాస్తున్నారు. చాలా సందర్భాల్లో మంచి కవిత్వాన్ని రాయగల కవులు కూడా కవిత్వాన్ని వాసిలేని రాశిని సృష్టించడం దురదృష్టకరం.

కవికి ఉద్యమాల పట్ల సహజమైన సానుభూతి ఉంటుంది. సామాజిక వ్యధకు పరిష్కారం బాటలో కలిసి నడిచేది ఉద్యమ కార్యకర్తలే తప్ప పాలక యంత్రాంగం కాదనే నమ్మకంలో నిజాన్ని నిర్భయంగానే కవిత్వీకరిస్తుంటాడు.

కవిత్వానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉందని, సమాజం నుంచే చైతన్యంపొంది, ఆ సమాజాన్నే చైతన్య పరిచే కవిత్వం ఉత్తమమైందని భావించే వాస్తవిక సంఘటనలు స్వీకరించి, ఆధునిక దృక్పథంతో కవిత్వం రాసిన కవులెందరో వున్నారు.

కవిత్వాన్ని కన్నబిడ్డ కన్నా ఎక్కువగా ప్రేమించేవాడు కవికాక మరెవరౌతారు? జీవితాన్ని కవిత్వంగా- కవిత్వాన్ని జీవితంగా అందంగా- అమూల్యంగా అబ్బురంగా కవే చూసుకుం టాడు.

కొత్తగా కవిత్వం రాస్తున్నవారు తగిన కవిత్వ అధ్యయనం, కృషి పరిశీలన పరిశోధన చేయకుండానే "కవి" అని పంచుకోవాలని ఉబలాట పడ్తున్నాడు. చాలామంది కవులు పత్రికల్లో పేరు చూసుకోవాలనే కోరికతో తప్ప కవితా రచనను ఒక సామాజిక, పౌర బాధ్యతగా స్వీకరించడం లేదు.

-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

ప్రవాహస్వరం

అవును....
నేను ప్రవహించాలనుకుంటున్నాను
ఇరుకు గదుల ఆంక్షల్ని ధిక్కరిస్తూ
కరకు స్వరాల ఎరువును ఎదిరిస్తూ
ఇసుక మైదానాల విశాలత్వాన్ని హృదయానికి హత్తుకుంటూ
కొండల పాదాల చుట్టూ
తీగనై అల్లుకుంటూ
ఆకుపచ్చని అడవి రంగుల్ని
వళ్ళంతా పులిమేసుకుంటూ
స్వేచ్ఛగా ...చిన్నపిల్లలా
పంజరానికి దొరకని పాటల పిట్టలా
ప్రవహించాలనుకుంటున్నాను!

నా వాకిలి ఎవరు మూశారు
మైదానానికి ఈ కంచె ఎవరేశారు
నా కనుపాపల్లో నిద్రించే కొండల్నెవరు పొడి చేస్తున్నారు

నా ప్రాణాలకు హరితాన్ని అద్దుతున్న
అడవి అందాలన్నీ ఆవిరయిందెప్పుడు?
అంతా ఓ కలలా..కంటిచెమ్మలా
ఎడారి జీవితంలో ఇసుక తుఫాను
అణచివేత దిబ్బలా మారుతున్నా
నేను ప్రవహించాలనే అనుకుంటున్నాను!

తుఫాన్లను మింగేస్తూ
గ్రీష్మాలను పరిహసిస్తూ
మోడవుతున్న అడవుల చివుళ్ళకోసం
కూలిపోతున్న కొండల కౌగలింతలకోసం
దిగులుపడే లోయల్ని ఒడి చేర్చుకుంటూ
మనిషి క్రౌర్యం కనపడనంత దూరానికి
ప్రవహించాలనుకుంటున్నాను
మానవత్వపు కెరటాలను
విస్తరించాలనుకుంటున్నాను
అవును
నేను ప్రవహిస్తూనే ఉంటాను
నేనుగానే ప్రవహిస్తుంటాను!

-డా.సి.భవానీదేవి
9866847000

భవిష్యత్తుకు వాచకం

ముమ్మాటికి గోడవతలి చెట్టు నాది
నా చెట్టు విత్తనాలే అవతలపడి
మహావృక్షాలవుతున్నయి
విత్తనాలు నావైనా
వినియోగంలో అలసత్వం నన్ను వెక్కిరిస్తుంది.
విత్తం మీదున్న శ్రద్ధ
విత్తనం మీద లేదు.
అమ్ముకోవడానికి అలవాటుపడ్డవాణ్ణి
నమ్ముకుందామంటే నామీద నాకే నమ్మకం లేదు
ఇవతల నా చెట్టు పూస్తే
పూలు పుణ్యానికి తెంపుకుపోతారని భయం
కాయలు కాస్తే కోసుకుపోతారని అనుమానం
ఇక్కడ విత్తుకేగాని
చెట్టుకు విలువలేదు
చెట్టుతల్లిలాంటిదంటారు.
నిజానికది చల్లదనమే కాదు
లోకాన్ని చల్లగా చూస్తుంది.

అవతలి వాడికి మన విత్తనం కావాలి
ఇవతలి వాడికి చెట్టెక్కడున్నా ఫరవాలేదు
ఇదేమీ చోద్యం?
లేదా దీనికి వైద్యం?
విత్తు మేధోశక్తికి సూచకం
చెట్టు భవిష్యత్తుకు వాచకం..

- ఆచార్య మసన చెన్నప్ప
సెల్:9885654381

పుస్తక సమీక్ష
వాస్తవితకు అద్దం పట్టిన కవిత్వం

తెలుగు ఉపాధ్యాయురాలైన వాసరచెట్ల జయంతి తన తొలి ప్రయత్నంగా 'నేల విమానం' పేరిట 64 కవితలతో ఓ సంపుటిని వెలువరించారు.

శ్రీమంతుల కందుబాటలో వుండే ప్రయాణ సాధనం గాలిలో ఎగిరే విమానం అని అందరికీ తెలుసు. మరి 'నేల విమానం' అంటే.. నేల మీద నడిచే సామాన్యుడి వాహనం. అదే సైకిల్.

'గంటకు పదిపైసలిచ్చి
కిరాయి సైకిల్ మీద
తర్ఫీదు పొందిన జ్ఞాపకం' యిది ఒక్క కవయిత్రిదే కాదు. చాలా మంది బాల్యానందం.

'పైసా పైసా కూడబెట్టి
మా నాన్న మా కోసం తెచ్చిన
నేల విమానం అది" సైకిల్ కొనడం కూడా సామాన్యుడికి గగనమే మరి!
'కైంచి తొక్క నేర్వనింకె
నేను పడిన తిప్పలు అంతా ఇంతా కాదు"

కైంచి తొక్కడం, క్రిందబడి మోకాళ్ళు పగలడం ప్రతి ఒక్కరి అనుభవం. సైకిల్‌ని 'నేల విమానం'గా అభివర్ణించడం గొప్ప ఊహ. శీర్షికతోనే సిక్సర్ కొట్టేశారు జయంతి.

యిలా.. తన చిన్ననాటి జ్ఞాపకాలను 'మా ఇంటి అరుగులు', 'యాదికొస్తున్నాయ్' 'ఒడువని ముచ్చట', 'మా ఊరి పోదముద్రలు' పేరిట కవితలుగా మలిచి మనకందిస్తున్నారు.

జయంతికి శ్రమజీవులంటే గౌరవం. బ్రతుకు తెరువు కోసం శ్రమశక్తిని ధారపోసే అభాగ్యులు ఆమె కవితా వస్తువులు.

'భూ మండలాన్ని వారి కాలికింద పెట్టి
భూగోళాన్ని అదుపు చేస్తున్నట్లు
రెండు కాళ్ళతో తొక్కుతూ
ఒక చేత్తో చక్రం తిప్పుతూ



మరో చేత్తో ఒంటికి
సంస్కృతి తయారు
చేస్తున్నరు" ఒంటికి సంస్కృతిని తయారుజేస్తున్న ఈ సృష్టికర్తలు ఎవరు? దర్జీలే అంటున్నారు కవయిత్రి.

"రెండు కట్టెలకు మధ్య తీగ కట్టి
కాలి వేళ్ళతో విన్యాసాలు చేస్తూ
ఎండ సముద్రం నడుమ నిలబడి నిప్పులు చెరిగే
భానుడికి ఎదురు చెప్తరు" రోడ్ల మీద అక్కడక్కడా కనబడే దృశ్యం యిది. కేవలం తన కోసమే కాదు... తన వారి ఆకలి మంటను ఆర్పడం కోసం **"ప్రమాదమే ప్రపంచంగా ప్రమాదాలే జీవితంగా బతుకుతున్న" అభాగ్యులు ఈ సమాజంలో చాలామందే వున్నారు.**

నా జీవితమంతా దుఃఖమయమే" అంటున్న ఈ కవయిత్రి కొన్ని కవితల్లో వేదన అంతర్లీనంగా ప్రవహిస్తుంది. ఉమ్మడి కుటుంబం, అత్తగారింట్లో అవమానాలు.. యిలా స్వానుభవంతో బాటు యితరుల అనుభవాన్ని కూడా తన కలానికొంపుకుని హృద్యమైన అభివ్యక్తి వెదజల్లారు.

"ఇంటిపేరు మారాక
మెట్టింటి వాళ్ళ ప్రేమ సరేసరి
సంపాదన లేని పని దానిలా
చీదరింపులూ చీవాట్లు
కన్న కలలన్నీ కనాలనే
ఆశలన్నీ ఆవిరవుతున్న వేళ
మౌనం రోదిస్తునే వుంది" ఎన్నో కోరికలతో, ఆశలతో బంగారు భవిష్యత్తును కలగంటు మెట్టినింట అడుగుపెట్టిన పడతికి చేదు అనుభవాలు ఎదురైతే? గుండెలవిసేలా ఏడవాలనిపిస్తుంది.. కానీ..

"కన్నీళ్లలో సలసలా కాగుతున్న నీళ్ళుంటాయని
కళ్ళల్లో నిప్పుల గుండాలుంటాయని తెలిసినాక"
ఏం చేస్తుంది ఆ నిర్భాగ్యురాలు?

"కష్టాలను చిరునవ్వుతో దాచుకుని
పోరాట మొక్కటే మార్గమని
అశ్రుముద్ర
ఆయుధంగా మలుచుకుంటుంది" నిస్సహాయ స్థితిలో 'అశ్రుముద్రే' ఆమెకు ఆసరా అవుతుంది. ఊరటనిస్తుంది.

ఈ దుస్థితికి తానే కారణమా? ఒక్కసారి ఆలోచించుకోవాలి. అంతర్ముఖంలోకి తొంగి చూసు కొమ్మని హితవు పలుకుతారు జయంతి. పెళ్ళయిన కూతుళ్ళకు తమ తప్పుడు సలహాలతో, అనవసరపు జోక్యంతో వారి సంసారాలను దుఃఖమయం చేస్తున్న కన్నతల్లులూ లేకపోలేదు అంటున్నారు కవయిత్రి.

"నేటి అమ్మలకు.. ఎలా పెంచాలో తెలియక
అంతర్యుద్ధాలు చేయడం నేర్పించి పంపిస్తారు
నిజమైన ప్రేమను ఎప్పుడు గుర్తిస్తారో
వారి కాపురాలు ఎప్పుడు చక్కదిద్దుకుంటారో?"
యిదీ వాసరచెట్ల జయంతి ఆవేదన.

'మోడు వారిన తీగ', 'పురిటి గీతం', 'రెండవ ముఖం', 'చిదిమి మొగ్గలు', 'శిధిల దేహం' యిత్యాదులు దుఃఖ కవితలు. యితరుల కష్టాల పట్ల స్పందిస్తు రాసిన 'లేడీ కండక్టర్' వంటి కవితలు పాఠకుల గుండెల్ని తడి, తడిగా తడుముతై. ఈ తరహా కవిత్వంతో స్వాంతన పొందుతున్న కవయిత్రి జయంతి.

ఘంటసాల, దాశరథి గారలపై రాసిన కవితలు కూడా చోటు చేసుకున్నై.

కవిత్వ నిర్మాణ పద్ధతుల్ని చక్కగా ఆకళింపు చేసుకున్న జయంతి వస్తువు ఎంపికలోను, కవితలకు శీర్షికలను పెట్టడంలోను, సరళమైన భాషలో వ్యక్తీకరించడంలోను ప్రతిభావంతురాలు.

సీనియర్ కవి కందుకూరి శ్రీరాములు మార్గదర్శనంలో అడుగులేస్తున్న ఈ కవయిత్రి ముందు, ముందు మరింత మంచి కవిత్వంతో కవన ప్రియుల్ని అలరిస్తారనడంలో సందేహం లేదు.

ప్రతులకు: వాసరచెట్ల మనోహర్
ఫ్లాట్ నెం.504,
5వ అంతస్తు, దత్తశ్రీ అవెన్యూ
అన్నపూర్ణ ఎన్‌క్లేవ్,
బియస్ఎన్ఎల్ ఆఫీసు దగ్గర
సెల్: 9985608077

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

నవంబర్ 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీమతి ఇందిర వెల్ది రాసిన "ఇంద్ర ధనుస్సు" కవిత్వం, 'ఆనంద లోకం' కథల సంపుటి ఆవిష్కరణలో రచయిత్రి శ్రీమతి ఇందిర, గోపి శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న అతిథులు బైస దేవదాసు, డా॥నాళేశ్వరం శంకరం , ఎసిపి.ఎస్. హరినాథ్, మెట్రో ఛానల్ ఎండి జయప్రసాద్, బిక్కి కృష్ణ, మెడిది సుబ్బయ్య ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మెడిది వెంకటేశ్వరరావు, డా॥పి. విజయలక్ష్మి, ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమీషనర్ జీవన్‌లాల్.

ఎన్‌జీవోస్ నెట్‌వర్క్ సౌజన్యంతో మేడిది సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో ప్రముఖ కవి, సినీ గేయ రచయిత డా॥ వడ్డేపల్లి కృష్ణకు 'జీవన సాఫల్య పురస్కారం'తో సత్కరిస్తున్న ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమీషనర్ జీవన్‌లాల్. వేదికపై బైస దేవదాసు, డా॥నాళేశ్వరం శంకరం, ఎసిపి.ఎస్. హరినాథ్, మెట్రో ఛానల్ ఎండి జయప్రసాద్, బిక్కి కృష్ణ రచయిత్రి ఇందిర వెల్ది,

జాలిగా ఓ రోజు

కడుపులో నిజం రహస్యాలను
ముఖంలో లోతు కవళికల్ని
చూపు అంచుపు చురుకుల్ని,
చూస్తూ ఓర్చుకోలేని ఓ రోజు
దాచుకోలేని బాధతో
మనిషిని జాలితో గురిచూసి వదిలిన
ఓ మాటకు చీల్చుకొచ్చిన అర్థాలు
పెద్ద పెద్ద అంగలతో
దగ్గరకొచ్చి సిగ్గుపడుతూ
ఏమని తెలపాలో? ఎలా పలకాలో?
దిక్కులను సవరించుకునే లోపలే
రాత్రి పగటి తలుపు కొడుతుంటే
బదులు పలికిన ఎండ చప్పుడుకు
నీడలు కమిలిపోతూ
మంచుకళ్లు ఎర్రపడి
ఒళ్ళు విరుచుకున్న మగత
మెలుకువ హృదయంపై
నులువెచ్చని ఓ స్పర్శ ఒడిలో
తలను వాల్చి ముడుచుకుంది.

నిదురపోని నిజం
మెలుకువ లేని ప్రేమతో
అంతులేనన్ని మాటల్ని
మనసు మాలికలో దాచి దాచి
పాచిపెట్టిన రహస్యంలోకి
అడుగుపెట్టిన ఆలోచన
ప్రతిసారి జారి
జ్ఞాపకాల మడుగులో
తేలియాడుతూ తిరుగుతుంటే
ఏదో ఒక ఒడ్డున చూపుతునక
మనసుకందకపోవునా?

-చందలూరి
నారాయణరావు
9704437247

విశ్వ జీవన రాగాలు

విశ్వ వినువీధుల్లో....ఓ విస్ఫోటనం
గిరగిరా తిరిగేటి గోళాలై,గ్రహాలై
జీవ అంకురార్పణకు మూలమాయే...!

పరిణామ క్రమం బుద్ధి జీవులకు ప్రాణంపోసే...
కొండల్లో, కోనల్లో మమేకమై
సమస్త జీవజాలంలో తానొకడై
ఏ చీకూచింతా లేకుండా
సహజీవనం చేసిన మనిషి...

ఒక్కొక్కటే నేర్చుకుంటూ
ప్రకృతిలో తానో ప్రత్యేకమవుతూ
చివరికి ప్రకృతి నుండి వేరుపడుతూ...

కులమూ-మతమూ, రంగూ - రూపు...
అంటూ పలు బేధభావాలతో
మనసులను కలుషిత పరుచుకుంటూ
పగా... ప్రతీకార కాంక్షలతో
తన వినాశనమునకు తానే కారకుడవుతూ...

అభివృద్ధి పేరుతో అనేక అగడాలకు పాల్పడుతూ
జన్మభూమి విఘాత కారకుడవుతున్నాడు...!

అంతూపొంతు, తీరూతెన్నూ లేని
విశృంఖల పోకడలనొదిలి

మితిలేని ఆశ, రగిలే విద్వేషంలను విడనాడి...

మనిషి మనిషితో సహృద్భావన పెంచుకుంటూ
సకల ప్రాణుల పట్ల సహానుభూతి పెంచుకుంటేనే...
విశ్వ శాంతికి పూల దారులు ఏర్పడుతాయి!
శాంతికపోతాలు ఎల్లలు లేకుండా
ఆనంద విహారం చేయగలుగుతాయి!!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

మనం మనుషులం!

చిన్ననాడు
ఎత్తుకెళ్లి వీధిబడిలో...
మొన్న కాలేజీలో...
నిన్న అమెరికాలో
పేరున్న విశ్వవిద్యాలయంలో
తమ కష్టార్జితంతో చేర్పించి...
మిమ్మును ఎవరెస్టు
శిఖరమంత ఎత్తుకు ఎదిగేలా చేసి...

సమాజంలో గొప్ప గౌరవం
ఉన్నతమైన స్థానం కల్పించి
మీకై తమ ప్రేమను పంచి
మీకై తరగని ఆస్తులను ఆర్జించి
మీ బంగారుభవిష్యత్తు కోసం
ఎన్నో కమ్మని కలలు కని
తమ సర్వస్వాన్ని దారబోసి
చివరికి తమజీవితాన్నే త్యాగం చేసి...

ప్రేమను తప్ప మీనుండి
ఏమీ ఆశించని నిస్వార్థపరులైన
ప్రత్యక్ష దైవాలైన అమ్మానాన్నలను
నేడు అనాథాశ్రమంలో చేర్పిస్తారా?
దిక్కులేని అనాథలను చేస్తారా ?
ఒంటరివాళ్ళను చేస్తారా !
కంటనీరు పెట్టిస్తారా !

ఆకలికి అలమటించే
అస్థిపంజరాలుగా మారుస్తారా?..

మీకన్నా ఆ వీధిలో కుక్కలే నయం...
విశ్వాసంతో బ్రతుకుతాయి...
వేళకింత తిండిపెడితే చాలు
రాత్రంతా మేల్కొని యజమానికి
ఏ ఆపద రాకుండా కాపాడుతాయి
ఆ శునకాలకన్నా హీనమా ? మీరు...

ఆలోచించండి మానవ మృగాలుగామారకండి !
కన్నవారే కనిపించే
దైవాలని మరువకండి !
ఇకనైనా మనుషులుగా బ్రతకడం నేర్చుకోండి !
అమ్మా నాన్నలను ఆదుకోండి !
నోరారా మనసారా పలకరించండి!
ప్రేమను చిలకరించండి !
ప్రశాంతంగా బ్రతికనివ్వండి !
చిరునవ్వులతో చితికి చేరేలా చూడండి !...

ఆఖరిదశలో వారి ముఖాలలోని
ఆ చిరునవ్వులే
రేపటి మీ బ్రతుకు బాటలో...కురిసే విరిజల్లులు !
వారు కార్చిన ఆగని ఆరని ఆ కన్నీటిధారలే
రేపటి మీ బ్రతుకు బాటలో...ముళ్ళురాళ్ళు !
మరువకండి నిత్యం ! కలనైనా ఈ నగ్నసత్యం !

- పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

నిరుపేద బాలలు

మాసిన మోముతోడ..
ముద్దుగుండె బాలుడు..
మైలైన బట్టలతోడ..
మాటునుండె చిన్నోడు..
అయ్యో బుడ్డోడు..
ఆపదలున్నట్టున్నడు..

బుడ్డోని చూపులలో..
ఆకలి కనిపిస్తుండెను..
ఆదుకునే వారులేక..
అలమటిస్తుండెను..

అయ్యో వీధి బాలుడా..
విధిరాతలు మారకున్నవా..

భారతాన బాలలు..
భయం తోడ ఉండెను..
పూట తిండి దొరుకకా..
తిప్పలెన్నొ పడుతుండెను..
నిరుపేద బాలలు..
మోస్తున్నరు నేరాలు..

చిన్నోడి బతుకులో
కల్గిన బాధలెన్నొ.
చెదిరిన జీవితములో.
చెరగని జ్ఞాపకాలెన్నొ.
అయ్యో బాలకా..
ఆయెనా బతుకాగమికా..

అనాథపు పిల్లలు..
అగమైన బతుకులు..
నిరుపేద బాలలు..
తిండిలేని జీవులు..
అయ్యో అమాయకులు..
ఆకలికై చేయు పోరాటాలు..

అందమైన జీవితాన..
సంతోషము లేకున్నరు..
సుందరమైన భవితన..
భారంగా ఉంటున్నరు..
అయ్యో బాలలారా..
భవిష్యత్తు బందాయెనా..

-పసుల.శంకర్
9542181301

మహావృక్షమే మహిళ..!

నవజాత శిశువు చిరునవ్వులు
ఇంటికే వేయి దివ్వెల వెలుగులు
సున్నిత చిట్టితల్లుల భావోద్వేగాలు..
కుటుంబ అస్వస్థతలకే లేపనాలు !.

బడికెల్లే అమ్మాయిల ఆత్మీయతలు
అందరి నోట్లో నిండైన నాలుకలు
చిన్నారి కాళ్ళ గజ్జల సుస్వర సంగీతాలు
ఒల్లంతా నిత్య పులకింతల సింగిడులు !

పరికిణీలో లేత ఛాయల సౌందర్యాలు
గృహ గడపలకే పసుపు పారాణులు
చీర కట్టులో రేపటి గృహిణి బాధ్యతలు
ఇంటి ఆరోగ్యమే ఆమె చేతి భాగ్యాలు !

పెళ్లి చూపులతోనే కళ్ళల్లో ప్రేమ సిగ్గులు
పసుపుతాడుతోనే ఇంటి పేరే మార్పులు
తొలి అడుగుతోనే మెట్టింట్లో సవ్వడులు
కుటుంబంలో ఆనంద భాష్ప పంటలు !

అత్తింట్లో అరిగి తరిగి అలసిన అతివలు
పొయ్యి పొగతో పడతి కండ్లల్లో మంటలు
వంటింట్లో కాల్చుకున్న ఆమని చేతులు
అన్నం వండించి, ఖాళీ పేగులతో నిద్రలు !

కల్లాపి వాకిల్లు, గిన్నెల ధగధగల శోభలు
గృహ లక్ష్మిగా సెలవెరుగని దాన చేతులు
అందరి ఆకలి ఎరిగిన అమృత భాషలు
ఒళ్లు పుండైనా ఇంటి గౌరవమే శ్వాసలు !

ఆమె మనసు వెన్నంత మెత్తన
ఆమె స్పర్శ వెన్నెలంత చల్లన
ఆమె సహనం అంతరిక్షమంత
ఆమె ఆవేశం దుర్గమ్మ శూలమే !

మహిళ జీవితం మహోన్నత వృక్షం
బెరడులా తను అరిగి తరిగినా?
ఆకులా అలసి సొలసి ఎండినా..
ఎండలో నిలిచి నీడనిచ్చే నిస్వార్థజీవి స్త్రీ !

ఆమె ఒడి సమస్త లోక తొలి బడి
అక్షయపాత్రలు ఆమె హస్తాలు
అమృత తుల్యం వనిత వంటలు
స్త్రీల గర్భాలు రేపటి తరపు పుట్టిల్లు !

-మధుపాళీ
9949700037

నేను బుగ్గౌతున్న మీ సేవకు!

కను రెప్పల మాటున దాగిన చీకటి
కను రెప్పలు మూస్తే పోతుందా!
సెగలలో కాలిన బంగారం
సిగలలోనే మెరుస్తుంది!
తన సెగల్లో కాలిన నల్ల బంగారం
జగానికి వెలుగు ఇస్తుంది
బొగ్గు బొగ్గు అని ఎగతాళి చేయకు!
నేను బుగ్గౌతున్న మీ సేవకు!
నా మేను నల్లన వెలుగు తెల్లన
గని నుండి నా దేహాన్ని వొలిచి
మీ బ్రతుకుల్లోవెలుగు నింపుతున్న
చాయ్ వాలా నుండి రైళ్ళ వరకు
అన్నీ నాతోనే పరుగు!
కాలుష్యమని కల్లబొల్లి జాలి!
కళ్ళు తెరవకుంటే నేనే ఖాళీ!
కావద్దు పూరించలేని ప్రశ్నావళి?
ప్రత్యామ్నాయలకు పట్టం కట్టండి
జగానికి కొత్త వెలుగులు నింపండి!

- పి.బక్కారెడ్డి
9705315350

ఊపిరి పోసుకొని గింజలు

భూమి
పంట పండలేని నిస్సహాయిత...
నేల తల్లి కడుపులో
గింజ మొలకత్తలేని దుస్థితి...
రైతు కాళ్ల కు పగుళ్ళు
దుక్కి దున్నిన భూమికి
పగుళ్ళు....
రైతు గుండెల్లో గాయం
ఇంటి గుమ్మానికి
పచ్చ తోరణం ఎండిపోయి
వాకిట్లో ముగ్గు లేని గడప కింద
నల్ల చీమలు తోడుతున్నాయి..
మట్టి గోడలు మొండి గోడలై
రైతు కళ్ళలో ఆశ చచ్చి
పంటనివ్వని
ఎండు భూమిని చూస్తూ
రైతు పత్తి మందు తో
గొంతులో అమృతం లా పోస్తూ
గింజలు పెట్టిన భూమి లో
రైతు దేహం బొక్కలై
ఊపిరి సెలవు తీసుకుంది...

-ఎలగొండ రవి
9848770345

నాన్న నేను ఏ పాపం చేసాను

నేనే నీ చిట్టితల్లి ని
నీ వాకిట చిరు పువ్వును
నా నవ్వులతో నీ లోగిలి నిండింది
నా అల్లరితో ఆటపాటలతో
నీ వాకిలి మురిసింది
నా ఉరుకులు పరుగులతో
నీ ఇల్లు కళకళలాడింది
ఇంతలోనే ఏమైందని నన్ను కట్టడి చేసావు
నేను ఏ పాపం చేసానని ఈ బాల్యవివాహం
నాన్న అంతలోనే నన్ను
నీ హృదయం నుంచి చేసావు దూరం.
అందమైన నా బాల్యాన్ని
అంతలోనే తుంచేసావు
నా ఆటపాటలను మధ్యలోనే
రోదనగా మార్చేసావు
నా కలల ప్రపంచంలో నుంచి
నిర్దాక్షిణ్యంగా తోసేసావు
నీ రాజకుమార్తెను రాక్షసులకు అప్పగించేసావు
నాన్న నేను నీకు
బరువయ్యానా వదిలించుకున్నావు .
నా స్నేహితులకు దూరం చేసావు
నా చదువులకు దూరం చేసావు
నా కుటుంబ సభ్యులకు దూరం చేసావు
నా ఇంటికి నా ఊరికి దూరం చేసావు
నాన్న ఆడపిల్ల ఈడపిల్ల కాదని
వదిలించుకున్నావా?.
ఏడుపు వస్తే ఎవరు ఓదారుస్తారు
ఆకలి వేస్తే ఎవరు అన్నం పెడతారు
నిద్ర వస్తే ఎవరు లాలి పాడతారు
చిన్న వయసులో ఈ భాధ్యత
ఎలా మోయగలను
మనసు ఒకచోట మనువు ఒకచోట
నన్ను నాకే దూరం చేసావు
నాన్న సాంప్రదాయం పేరుతో పంపించేసావా

-అరుణ డేనియల్
9000606889

నేటి ఇ(ని)జం

నేటి ప్రేమలు నీటిపై బుడగలే
నరుల నవ్వులు ప్లాస్టిక్ పువ్వులే
ఆత్మీయతలన్నీ అవసర అస్త్రాలే
మాటలు తేనె పూసిన కత్తులే కదా !

ధన, అధికారాల చుట్టు..
రక్షణ కవచాలే కదా చట్టాలు
అక్రమార్కుల క్రీడా మైదానాలే..
నవ్య రాజకీయ కుళ్లు కుతంత్ర క్షేత్రాలు !

రెక్కలు తొడిగిన అయ్యవ్వలే..
రెక్కలుడిగినాక అక్కరకురాని అనాథలై..
వాడి నలిపి పడేసిన విస్తరాకులైన..
డిజిటల్ యుగపు డేంజరస్ పోకడలు !

వ్యాపార వాణిజ్యాల్లో కల్తీల లీలలు
ఉద్యోగాల్లో అమ్యామ్యాల లాలూచీలు
నిన్నటి పునాదుల్ని మరిచి నేటి జగత్తులో..
ఈ క్షణం జీవించడమే నవ్య ఇజమైంది !

పగలే పడకేసే నిశాచర నవ యువత..
పిజ్జా, బర్గర్లే నమిలే నడవంత్రపు నడత..
ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్లలో మునిగే నేత్రాలు
స్మార్ట్ ఫోనే మరో శాశ్వత అంగమైన అకాలాలు !

విలువల వలువలు వివస్త్రలై..
మానవీయతలు ఇంకిన బావులై..
సంబంధాలన్నీ లాభనష్టాల లెక్కలై..
బతక నేర్చుకోవడమే నేటి ఇ(ని)జమైంది !

- మధుపాళీ
9949700037

నా ఇంటిని నందనం చేసింది

శిశిరంలా నేనుంటే
తాను వసంతమై వచ్చింది
ఎండిన ఎడారి లా నేనుంటే
తాను వర్షపు చినుకై రాలింది
నా జిందగీని చీకట్ల తెరలు కమ్ముకుంటే
తాను సూర్య కిరణమై చీల్చింది.

నా నిరాశల బీడు భూములో
ఆమె ఆశల విత్తనం నాటి
భవితపై భరోసా ను కల్పించింది
వడలిన జీవితపు చెట్టు కు
సంకల్పపు ఎరువును వేసి
లక్ష్యాల విల్లును విసిరింది.

మాటల మధుర బంతులను విసిరి
మనసు పొరల్లో పెనవేసుకుంది
ఎదపై గువ్వ లా వాలి
సప్తపదులు నడిచింది
నాలో సగం భాగమై నిలిచి
నా ఇంటిని నందనం చేసింది

-తాటిపాముల రమేష్
7981566031

మానవ సహజ వేదనను ప్రతిబింబింపచేసే 'పాలకోడేటి' అనువాద కథలు

పుస్తక సమీక్ష



శ్రీ పాలకోడేటి కృష్ణమూర్తి, బహుభాషల కథా కదంబంగా ఒరియా, హిందీ, ఇటలీ, బ్రిటన్, అస్సామీ, పర్షియన్, గుజరాత్, పోలెండ్, రష్యన్, అరబిక్, అర్జంటీనా, అమెరికన్ సాహిత్యంలోని మంచి కథలను ఎన్నుకొని తెలుగు చదువరులకు అందించటం ఆ అనువాద కతలను చినుకు ప్రచురణ సంస్థ, సంపుటిగా ప్రచురించటం అభినందించ తగ్గ విషయం. డ్రగ్స్, బ్లూ ఫిలిమ్‌లు యువతరం పెడారి పతనానికి కారణాలు విశ్లేషించిన తొలి కథ 'పరాజిత సమ్రాట్'తో ఆరంభమై ఈ సంపుటిలో యిరవై కథలు వైవిధ్యభరిత ఇతివృత్తాలతో చదివింప చేస్తున్నాయి. డా॥మంజుసిన్హా హిందీ కథ, 'స్త్రీ', జర్మనీ నియంత హిట్లర్, జీవితంలో భార్యస్థానం పొందాలనుకొన్న ప్రియురాలు 'ఇవా' త్యాగ విషాద మరణం ఆమె హృదయాన్ని స్త్రీగా ప్రతిబింబింప చేస్తోంది. హిందీ, అస్సామీ, గుజరాతీ, ఒడిశా దేశ బాషలలోని 9 కథలు, విదేశీ రచయితల కథలతో పోలిస్తే, ఇతివృత్తాల ఆలోచనా భావ గాఢత స్పష్టంగా విభిన్నంగా వృద్ధాప్యంలోని చలయ్య, మనుమడు యిద్దరి అప్పన్ జీవన వేదన, 'అమ్మకానికి ఆడపిల్ల' కథలో ఆడపిల్లల పట్ల క్రూరత్వం, 'సమాధి', కథలో ఉపకారికి అపకారం, అస్సామీ కథ 'పాపం'లో వంశా భివృద్ధి కోసం క్షోభ, ఒడిశా కథ 'విందు'లో పేదల ఆకలి తీర్చే ఎంగిలాకుల కథనం, భారతీయ కథా రచయితలను ఆకట్టుకొన్న సామాజిక వేదనాయుత జీవనాంశాలకు, కల్పనా ప్రతిభా వైచిత్రికి అద్దం పడుతున్నాయి. జస్టిస్ బి.చంద్రకుమార్, తొలి పలుకులలో పేర్కొన్నట్టుగా, సమకాలీన సమాజంలోని వైరుధ్యాలను, సంఘర్షణలను, మానవీయ విలువలను, త్యాగాల్ని, ప్రేమను, స్వార్థపూరిత కుట్రలను ఎన్నింటినో ఈ కథలు ప్రతిబింబింప చేస్తున్నాయి. బహుభాషా కథల ప్రతిభా వైభవాన్ని ప్రదర్శిస్తున్న ఈ సంపుటిలో, అనువాదం కాకపోయినా, ఒక్క అత్యుత్తమ తెలుగు కథకు కూడా చోటు కల్పిస్తే, బావుండేదేమో అనిపించింది. పాలకోడేటి గార్కి హృదయపూర్వక అభినందనలు.

ప్రతులకు: పలకోడేటి కృష్ణమూర్తి
5-9-1/65, కల్యాణపురి కాలనీ
సైనిక్‌పురి, సికింద్రాబాద్-500 094
సెల్: 9908828313



-జయసూర్య
సెల్: 9440664610

పొద్దు వాలిపోయాక

పొద్దు వాలిపోయాక
చుట్టూ చీకటిని వెలిగించుకుని
నిశబ్ద ఆకాశాన్ని వొంపుకొంటూ
వేళ్ళ మధ్య నున్న సిగరెట్ పీకను ఊదుతూ
రింగు రింగుల పొగల పాటను పాడుతున్నాడు.

సరిగమపదనిసల మెట్లు
ఎక్కుతూ, దిగుతూ
రాత్రంతా విరహాన్ని నింపుకుంటూ
పగలు ఖాళీ చేసుకుంటూ...
గతుల, జతుల,శృతుల, జ్ఞాపకాల
గుండె వీణను మీటుతున్నాడు .
తాళపు సవ్వడితో సంగమిస్తూ
విషాద పాట పిల్లలకు పురుడు పోస్తున్నాడు.

ఏకాంత గూడు కట్టి
పక్షొకటి కన్నీటి రెక్కలు తొడిగి
ఎగిరిపోయిన తర్వాత
ప్రపంచ బాధనంతా మోస్తున్న
కృష్ణశాస్త్రిలా కవిత్వంతో రమిస్తూ
నిత్యం కావ్య కన్నెలను రచిస్తున్నాడు.

సప్తస్వర బద్ధమైన జీవన గీతాన్ని
ప్రేమ రుచి ఎండిన గొంతుతో
ఒక్కడే ఒంటరి పాటను పాడుకుంటున్నాడు
తన్మయత్వంతో ఊయల ఊగుతూ.

-శ్రీతరం
7893613015

నా బాట కవిత్వం

నా బాట
నా వింతపు
చీకటి
నా వెలుగుకు
ఈ రేగటి...

ఈ కాలమానికి
కదిలించిన
ఈ జగత్:జ్యోతిలో
పలువురికి తెలిసిన
ఈ జగతిలో
నేను ఒక్కడిని
నేను బాటసారిని.....

ఈ రాత్రివేళ
కనుమరుగైన
చీకటి నక్షత్రాలలో
నేను ఒక్కడిని
నేనో మనస్సున్నవాడిని...

కంటిరెప్పల
కనుపాప
చేరువలో ముఖ సౌదర్యంలో
చిరునవ్వు చిగురించిన
రోజూ అక్కడ
నేనో ఒక్కడినే
నేనో పిపాసిని...

శరీరాన్ని మలుచుట
తరుచుట
పరిగెత్తుట
బుద్ధి,సహనం
మానవత్వంతో
ఆత్మను కోరుకునేవాడ్ని
నేనో బాటసారి
నేనో పిపాసిని....

-సాయికిషోర్
గిద్దలూరు
ద్వితీయ సంవత్సరం
ఒఖఖీఏఅ
కొడిగేనహల్లి

వేదన

ప్రకృతి పరిహాసం
పాలకుల వికృత చేష్టలు
కర్షకుని ఆయుష్షు తీస్తున్నాయి.

కుప్పల్లోని ధాన్యం
మొలకెత్తూతు ఉంటే
ఆరు నెలల కష్టం
కళ్లముందే మట్టిలో కలుస్తుంటే!

కన్నుల్లో దయనీయత
గుండెల్లో గుబులు
మాటల్లో తడబాటు
ఆకలి తీర్చే అన్నదాత
హరిగోస పడుతుంటే
పాలించే పాలకుల మనసు
శిలకన్నా కఠినంగా ఉంది
రైతుల బాధ దేశానికే అరిష్టం.

అన్నదాతకు అండగా నిలుద్దాం
పాలకులను ప్రశ్నిద్దాం
దేశానికి రైతును వెన్నెముకగా
నిలుపుదాం.

-చాపలమహేందర్
9949864152

మత్తు

మత్తు మనిషికి
ఆవహించిన జబ్బు
మనిషిని వదలని నల్లమబ్బు "మత్తు"
కొందరికి పదవిని పొందటం మత్తు
కొందరికి డబ్బు సంపాదించడమే మత్తు
మరి కొందరికి "ప్రేమ "ఒక మత్తు
ఇంకొందరికి మాదకద్రవ్యాలు
సేవించడము మత్తు
కొందరికి పుస్తకాలను చదవడం మత్తు
మత్తుకు అలవడిన మనిషి
మత్తులోపల పడిన మనిషి
ఎదుగుదలతో ఎదగవచ్చు,
దిగుడుతనముతో దిగజారనూవచ్చు
ఎంచుకున్న దారినిబట్టి,
వెళ్లే వేరునుబట్టి మత్తు మజా చేస్తుంది
కానీ.. మ త్తు.. మందు
అది వైద్యుని చేతిలో నుండే సంజీవిని
మత్తు రోగికి బాధను తెలీకుండా చేస్తుంది
ప్రమాదపు అంచున వున్నవారికి
నెత్తురుకాల్వలబారిని పడ్డవారికి
మత్తువైద్యులిచ్చే మత్తు రోగిని నిలపెడుతుంది
మాములు మత్తు మనిషి
పాతాళానికిగాని,పురోగమనానికి గాని
తీసుకెళ్తే,
మత్తువైద్యులిచ్చే మత్తు రోగాన్నిబట్టి,
రోగి మానిసిక పరిస్థితినిబట్టి..,
తగినమోతాదులో సమంగా,ఉన్నతంగా
ఇవ్వబడిన మత్తు,ఇచ్చే మత్తువైద్యులు
రెండూ శ్రేష్టమే
మత్తు మత్తు కాదు..
ప్రాణాలు నిలబెట్టే వాయువు
మత్తునిచ్చే వైద్యులు ,
రోగి ప్రాణాలు కాపాడే శక్తీశ్వరులు.

- విశ్వనాథ నరసింహం
సెల్: 9490971589

పాతరేసిన అంతరాత్మ...!

అల్లరి చేస్తోంటే...
మనమ్మాయి కాదుగా అంటూ..
బిజీగా..టైమ్ చూసుకుంటూ
పిల్లిలా పరుగులు తీస్తుంటాం!

కులం-మతం కుమ్ములాటల్లో
మనిషిని మనిషే వేటాడే
భీతావహ ఘటనలో
సాక్షిగా నిలబడటానికి భయపడి
గుండె దడతో .. కళ్లు మూసుకుంటాం!

కట్నం వేధింపుల్లో
పక్కింటమ్మాయి బలైతే
ఏమీ పట్టనట్టు...
అలసత్వ రెక్కలు కట్టుకొని
కరెన్సీ చెట్టుపై
వాలి పోతుంటాం!

శత్రు సైనికులతో పోరాడి
అసువులు బాసిన వీర జవాన్ల
ధీరత్వాన్ని గుర్తించకుండా
స్వంత వ్యవహారాలలో
సతమతమవుతుంటాం!

ధరల పెరుగుదలకు
ఎవరో నిరసనలు చేస్తుంటే
ధర్నాలో పాలుపంచుకోకుండా
పెదవి విరచి పక్కకు తప్పుకుంటాం!

ఎవరో చేసిన
చీకటి పాపానికి
కుప్పతొట్లో గుక్కపెట్టే
పసిపాప ఏడుపు
నీ గుండెను కరిగించకుండా
చెవులు మూసికొని
ఛీ.. ఛీ..పాడు బుద్ధులంటూ
ఇతరుల పాపాన్ని కడిగిపారేస్తూ
నిష్క్రమిస్తుంటాం!

ఇచ్చట మూత్రం పోయరాదు,
ఇక్కడ చెత్త వేయరాదన్న
తాటికాయంత అక్షరాలు
కళ్లెదుట కనపడుతున్నా..
పోస్తూనే వుంటారు...!
వేస్తూనే వుంటారు...!!
అయినా.. మనం నోరు తెరిచి
తప్పుని గట్టిగా చెప్పం!

వేలకు వేలు జీతాలు తీసుకుంటూ
బల్ల కింద చేతులు చాచే
చీడపురుగుల ఆశపోతుతనాన్ని
ఖండించే సాహసం చేయలేక
నీళ్ల నములుతూ
చేతులు తడిపేస్తుంటాం!

సంపాదనా వెంపర్లాటలో
అనుక్షణం తలమునకలయ్యే
నీకూ-నాకూ..అంతా..
తెలిసే జరుగుతూనే ఉంటుంది
అయినా.. మనం
అస్సలు నోరు విప్పం!

నోరు విప్పడమంటే
అన్యాయాన్ని ఎదిరించడం!
మనలోని గుండె ధైర్యాన్ని
బ్రతికించుకోవడం!
వజ్ర ఖచిత వ్యక్తిత్వంతో
రాబోయే భావితరాలకు
మహత్తర సందేశాన్ని
మన భుజాలపై మోస్తూ...
వారసత్వ సంపదగా అందించడం!

ప్రశ్నించడమంటే...
మనిషి మనిషిగా నిలబడడం!
కొత్తపొద్దు గవాక్షాన
జ్వాజ్వల్యమాన
చండప్రచండ మార్తాండ తేజో రూపంతో
వెలుగు దారులు పరుస్తూ
మానవత్వంతో ప్రభవించడం!

నోరు విప్పడమంటే
నీలో దాగున్న మహత్తర శక్తిని
సమాజానికి ధారబోయడం!
దేశానికి పట్టిన మకిలిని కడిగి
కళ్లు మెరిసేటట్లుగా
క్రాంతి తోరణాలు కట్టడం!

-వంగర పరమేశ్వరరావు
సెల్: 9491400534

తెలుగు గజల్

పరిపాలన గతితప్పితే..అరాచకం తెలుసుకో
సుపరిపాలన సాగితే.అభ్యుదయం తెలుసుకో

జనమంతా మెచ్చేలా..పరిపాలన సాగాలి
తోచిందే చేయకూ..జనహృదయం తెలుసుకో

పాలన ప్రజలందరికి..సమన్యాయం చేయాలి
అన్నివర్గాల అభివృద్ధే..సర్వోదయం తెలుసుకో

శ్రమతోనాస్తి దుర్భిక్షం.. కృషితోనే సుభిక్షం
మాటలతో అభివృద్ధి.. అసాధ్యం తెలుసుకో

ఏ ఫలితం ఆశించి..చెట్టుఫలాలను ఇస్తుంది
పదుగురికి మేలుచేస్తే..జన్మధన్యం తెలుసుకో

-బూర దేవానందం
9494996143.

నిశ్శబ్దాన్ని ఛేదించే దెవ్వరు?

రాబంధుల నీలి నీడల్లో
అన్నెం పున్నెం ఎరుగని
పసిమొగ్గల జీవితాలు చితికిపోతే
బరువెక్కిన తల్లి మనసుకు
ఓదార్పు నిచ్చే దెవ్వరు..?

సృష్టి కార్యక్రమానికి మూలమై
సమాజాభివృద్ధికి దిక్సూచియై
కుటుంబవ్యవస్థకు ఇరుసుయై
బతుకు బండిని ఓర్మితో లాగు
స్త్రీజాతికి స్వాంతన చేకూర్చేదెవ్వరు..?

పవిత్రతకు చిహ్నమై
పుణ్యభూమిలో కొలవబడే
ఆడపడుచులు మొగ్గలా రాలుతుంటే
అమానవీయ హత్యలను ఆపేదెవ్వరు..?

నాటిన పైరు పంటను ఇవ్వకుండా
కలుపుమొక్కల కబంధహస్తాలకు బందీయైతే
ఆకలిని తీర్చేదెవ్వరు..?

కామంధుల రాక్షస క్రీడలను ఆపాలంటే
నిశ్శబ్ద గోడలను బద్దలు గొట్టే
చైతన్య గంటలను మ్రోగించాల్సిందే..!

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

పరుగు... పరుగు

పరుగెడుతున్న నీకు
ఏ మనుషులు కనపడరు, ఏ సమాజం కనపడదు!
వాట్సాప్ లు, ఫేస్బుక్ లూ నిన్ను ఊపిరాడనీయవు,
అన్నదాతల నడ్డి విరగ కొడుతున్నా ,
కార్పొరేట్ కంపెనీలు నీ బట్టలూడ దీసినా ,
నీ పయనం ఆగదు, ఆ పరుగు ఆగదు!
అది అర్థం లేని పరుగు! అవసరం లేని పరుగు!!

పరుగెడుతున్న నీ దారిలో
పండ్లున్నాయ్-కాయలున్నాయ్ ,
ఆకులున్నాయ్ - అలములున్నాయ్-
ముళ్ళున్నాయ్ రాళ్లున్నాయ్ -
కొండలున్నాయ్ - కొనలున్నాయ్ ..
నవ్వులున్నాయ్ , పువ్వులున్నాయ్
పరుగు మాయలో సోయి తప్పిన నీకు
కరోనా పేషెంట్ లా ఏ పరిమళాన్ని
నీవు ఆస్వాదించ లేవు.
పళ్ళు కాయల రుచి చూసే దిక్కే లేదు,
నవ్వులు , పువ్వులకు అర్థమే తెలియదు!
రాళ్లు రప్పలు పక్కకు జరిపి దారి చేసే తీరికే లేదు,
ముళ్ళు కుచ్చుకుంటే తీసి పక్కకు విసరడమే ,
రాళ్ళు , గోతుల మాటే నీకు వినబడదు
వెనక వచ్చే వారి గురించి ఆలోచించే తీరికా లేదు.
వాడు చస్తే ఏంటీ ,,,బ్రతుకితే ఏంటి?
నువ్వు మాత్రమే పరుగెత్తాలి!
నువ్వు మాత్రమే ఆ గమ్యాన్ని చేరుకోవాలి .
అసలు ఆ గమ్యమేమిటో తెలిస్తే కదా నీకు?
ఎందుకో ఆ పరుగు? ఎక్కడికో పరుగు?

quarantinలో వున్న పేషంట్‌లా
కన్న పిల్లల్తో కడుపారా మాట్లాడింది లేదు,
కంటి నిండా వారిని చూసుకుంది లేదు
వెనక్కి తిరిగి ఎంత దూరం పరుగెత్తావో చూసే
సమయమూ లేదు.
ముందు అద్దం ఉన్నప్పుడు
జీవిత ముఖాన్ని చూసుకోవడానికి
తీరికే లేదు.
నీ పరుగు ఆగదు, నీ పయనం ఆగదు !

పరుగెత్తీ పరుగెత్తీ ఆగిపోయిన నీకు
ఇప్పుడు ముందు దారి లేదు, శరీరంలో ఓపికా లేదు.
వెనక్కి తిరిగి చూస్తే పరుగెత్తి సాధించింది ఏదీ లేదు.
నీ కోసం ఎదురు చూస్తున్న వాళ్ళు ఎవ్వరూ లేరు ,
నిన్ను పట్టించుకునే నాధుడే లేడు.
అయినా నువ్వు ఇంతకాలం
ఎవర్ని పట్టించుకున్నావ్ కనుక?

పరుగు ఆగింది, పయనం ఆగింది ..
ఆగిన నీ శరీరం ముందు పెద్ద అద్దం
నిన్ను చూస్తూ వికారంగా నవ్వుతుంది ..
నిన్ను నువ్వు అద్దం లో చూసుకోవాలనుకున్న
నీకు ఇప్పుడు, ముఖమే లేదు!



-వేణు నక్షత్రం
+1(703)861-8368

సమాంతర దృశ్యాలు

ఏమయితేనేం వారి హృదయవేదన తగ్గదు
ఏదయితేనేం వారి బతుకుబండి నడవదు
నవ్విపోయే వాళ్ళు ఎప్పుడూ ఉంటారు
ఇలాంటి దృశ్యాలు చూడటమే
పాపంగా భావించేవారే గునపమై
గుచ్చుకుంటారు వారికి
ఇంతకీ వారంతా సంచారజీవులు
వారిదో నిరంతర అన్వేషణ.

వెతలజీవుల ప్రపంచమే అంత
పలకరించేవారుండరు
కానీ పోట్లాటలుంటాయి
జీవికే యుద్ధం
యుద్ధమే జీవిక
నిజంగానే అద్దం లాంటి బతుకులు
అబద్ధాన్ని దాచవు
నిజాన్ని చూపక ఆపవు.

వేర్వేరు ప్రపంచాల సమాజం
అందరి వేర్లూ ఒకటేనని టముకేస్తుంటుంది
ఇది అనాదిగా వేళ్ళూనికొనిపోయిన వారసత్వం
దేనికీ ఆసక్తిలేని ఆకలిప్రపంచం
పెదవివిరుస్తుంటే ప్రవచనమై
సభ్యప్రపంచం హితబోధ
తోరణాలు కడతానంటుంది
ఇప్పుడు సమాంతరరేఖలై ప్రపంచాలన్నీ
ఎవరి ప్రపంచం వారిదే
అంటున్న ఎరుకను మరచి

-సి.యస్.రాంబాబు
8374818961

బుద్ధిజీవి

అదంతే..
కాలనీనేర్ప పాఠాలు
ఒక్కోసారి చూసినవి
విన్నవి భద్రతని భ్రమించే కాలం
గుండెను గాయం చేస్తాయని
రక్షించే గాలులు దునియా నిండా మెండని
ఆత్మ విశ్వాసంతో కలియతిరిగిన మనసు
ఆపన్నహస్తాలు మబ్బులచాటు
అమావాస్య సూర్యుల్లౌతారని నమ్మిన క్షణాలు....
పొదుపు తాలూకు పునాదులు
ఆవశ్యకతగుర్తుచేస్తాయి..
ఆలి మాటలు అగ్నికి నైవేద్యం
అమ్మ మాటలు వినని కర్ణాలు
కలగలసి రోడ్డున అరువుకై
ఎండమావి అప్పుకై తిరుగుతున్న..
ఆలోచనలు. ఒక్కక్షణం
పరువును తాకట్టు పెట్టాల్సిరావడం ..దుర్భరం .
రెండు చేతుల సంపాదన ఉన్నోల్లు
కొంత ఎనుకటి వాటిని రెట్టింపు చేసినోల్లు
పరపతి ఆభరణాన్ని సమాజ చేతికి
కంకణంలా ధరించినోల్లు
మేమున్నమని వెన్నుతట్టి వెన్నెముక ఐనోల్లు
సాయం కంపును భరించలేక
హరిచంద్ర విరుద్ధ మాటల్ని
విశ్వప్రయత్నాలలో వల్లేవేయడంలో
రాటుతేలిను..
ఎంతైనా..
ఎవని భరువు వాడే మోయాలే.
మంది కాళ్ళమీద బరువేసుడు
ఇప్పుడు అసలే వీలుకాదు..
ఎవని ఆపద నుప్పి వాడే గట్టెక్కాలే
అందని సాయాన్ని నిందిస్తూ
కాలం గడపడం...
బుద్ధి జీవికి
అంతక్షేమం కాదు....

-నాగరాజు మద్దెల
6301993211

మహిళ కైతికాలు

కడుపులోని బిడ్డను
ఆదిలోనే హతం చేస్తూ
పైపైన మాయమాటల
గారడీలు చేస్తూ
వారెవ్వా... నేరగాళ్లు
కనిపించని కేటుగాళ్ళు ..!

తేడాలను చూపిస్తూ
అవకాశాలు ఇవ్వక
భవిష్యత్తుకొరకు
బాటలు వేయలేక
వారెవ్వా ..బాలిక
నీ సత్తా చాటు ఇక..!

ఊహించలేముగా
నీవు లేని జగతి
అది తెలుసుకోలేని
పరిస్థితి అధోగతి
వారెవ్వా ..మహిళా
చైతన్య ప్రభంజనం ..!

అలుపంటే తెలియక
ఓటమిని ఓడించు
నీవనుకున్నటువంటి
లక్ష్యాన్ని ఛేదించు
వారెవ్వా ...మహిళా
చేరుకో నీ ప్రస్థానం..!

కావ్యకన్యకవై
నీవు అలరించేవు
కుటుంబంలో నీ
సామ్రాజ్యం చూపేవు
వారెవ్వా ...మహిళ
అనితరసాధ్యం ..!

ఆత్మస్థైర్యంతో
ముందుకు సాగేవు
మానసిక ఒత్తిళ్లను
అధిగమించేవు
వారెవ్వా ..మహిళ
సమూల మార్పుకు నాంది ..!

అనుభవం సైతం
ఆయుధాలుగా మలిచి
దగా చేసిన వారికి
అస్త్రాలుగా సంధించి
వారెవ్వా ..మహిళ
ఆత్మవిశ్వాసమే ఆది..!

క్షమించమనేవారికి
ఓర్పుతో భూమాతగా
దాడి చేయడానికొస్తే
అపర చండికగా
వారెవ్వా..మహిళా
మార్పుకు నీవే మూలం..!

- సునీత బండారు
9440671530

ఈ పుడమిపై!....

ఆత్మ నిచ్చావు ఆత్మకు తృప్తినిచ్చావు
ఆత్మ శక్తినిచ్చావు
ఆత్మీయతనూ పంచిచ్చావు
ఆత్మీయతనూ నేర్పించావు
ఆపదల్లో ఆప్తుడవయ్యావు
అణువణువునా బ్రతుకు
చిరునామాగా మారావు
ఆలంబనగా నిలిచావు
అనురాగాన్ని పంచావు
మానవతనూ పంచావు
మంచి నడతను ఇచ్చావు
సుఖదుఃఖాలు జీవితానికి
అనివార్య మన్నావు
బంధుత్వాలు,రక్తస్పర్శలు జీవితానికి
శాశ్వతం కాదన్నావు
కలిమిలేములు జీవితానికి
జనన మరణాల లాంటివి అన్నావు
పరోపకారం,దైవచింతన,మంచితనం
మాత్రమే ఈ జగాన
కలకాలం నిలిచేవి అన్నావు
మానవ జీవితానికి
సదా ఇవే మూల ధన మంటూ
జీవన వేదాన్ని చక్కగా వివరించావు
అందుకే!...నువ్వు
నన్ను ఈ పుడమి పై
ఓ కారణ జన్ముడిగా చేసావు!

-దోస పాటి.
సత్యనారాయణ మూర్తి.
9866631877

ఘంటసాల శతకం

ఈనెల 4న ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా...



-హెచ్. ఆర్. చంద్రం
9493248053

శతక మెదియు ఘంటసాలవారి గురించి
వచ్చినట్లు కానబడదు, గాన
వ్రాయ బూనుకొంటి ప్రస్తుత మది నేను,
ఘంటసాల మేటి! కలరె సాటి?

శతక మేమి? ఘంటసాలపై 'సాహస్ర'
మైన చెప్పవచ్చు, నైన నిపుడు
శతక రచనతోనె సరిపెట్టుకొందము!
ఘంటసాల మేటి! కలరె సాటి?

సులభ శైలి, నాటవెలదులలో ఘంట
సాల పేర పద్యశతక మొకటి
వ్రాసి నేను తెలుగు పఠితల కందింతు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల మధుర గాన విశేషాలు
శతకమున నిముడ్చ సాధ్యపడున?
క్లుప్త రీతి చెప్పుకొందము కొన్నింటి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వీరి పేరు జూడ 'వేంకటేశ్వరరావు,'
'ఘంటసాల' వీరి యింటి పేరు;
'చౌటపల్లి' వీరి స్వగ్రామ నామము,
ఘంటసాల మేటి! కలరె సాటి?

వీరి తండ్రిగారు సూరయ్య, రత్నమ్మ
తల్లి పేరు, చౌటపల్లి ఊరు;
ఆస్తిపాస్తు లెరుగనట్టి సంసారము!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పల్లెటూరు చౌటపల్లి, జిల్లా కృష్ణ,
అతి సమీప పట్టమై రహిం
చుండిన 'గుడివాడ' మండల కేంద్రము,
ఘంటసాల మేటి! కలరె సాటి?

'ఘంటసాల' యనెడు గ్రామ ముండె నొకటి,
అదియు కృష్ణజిల్ల యందె గలదు;
వీరి పూర్వు లచటి వారె కావచ్చును!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చిన్న వయసులోనె కన్నుమూసెను తండ్రి,
మేనమామ యింట తాను పెరిగె;
చదువు సక్రమముగ సాగలే, దాగెను!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చదువు నడచె కొంత చౌటపల్లిని, 'గుడి
వాడ' లోన కొంతవరకు సాగె;
ఆపైన నదియు నర్థాంతరమాయెగా!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల' వారి యింటి పేరే యైన,
ప్రజలలోన వారి కదియె దక్కె;
ఒంటి పేరు కన్న యింటి పేరె ప్రసిద్ధి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

తండ్రి, బాల్యమున మృదంగము వాయించ,
వీరు నాట్యమాడువారె లంట;
నాటకాలలోను నటియించి యున్నారు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

విజయనగరమందు, వీధులలో మధు
కరము చేసుకొనుచు, కష్టపడుచు,
నేర్చినట్టి విద్య నిలబెట్టె బ్రతుకును!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కడు శ్రమించి పూర్తిగావించె నతడు రెం
డేళ్లలోనె నాల్గేళ్ల (కోర్సు) విద్య;
లక్ష్యశుద్ధి శ్రమను లక్ష్యపెట్టదు కదా!
ఘంటసాల మేటి! కలరె సాటి?

గానము విని మెచ్చి, ఘంటసాలను 'సము
ద్రాలవారు' చిత్రరంగమునకు
మొదట పిలిచి సాయమును జేసి రట వారు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఇంట బెట్టుకొని ఘంటసాలను సము
ద్రాలవారు సాయమొసగిరంత;
దారి దొరకు వరకు వారి యింటనె బస!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఆదరించెనంత ఆదితో 'ఆకాశ
వాణి' పాట లిచ్చి, పాత్ర లిచ్చి;
పాటతోపాటుగా వారి కొత్త రాక కొంత!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వీరి మొదటి పాట వినిపించె నాకాశ
వాణి ద్వార తెలుగు ప్రజలు; కింక
వీరి గొంతు వినని వా రెవ్వ రుండిరి?
ఘంటసాల మేటి! కలరె సాటి?

కాల గమనమందు గానగంధర్వుని
గా ప్రసిద్ధి గను ఘంటసాల
స్వరము 'మైకు' కపుడు పనికిరా దని రంట!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల తొలి రికార్డింగుకై పట్టు
పట్టి, దాని వదిలిపెట్టకుండ,
విజయు డయ్యెనంట పేకేటి శివరాము!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఎదురుదెబ్బ లుండు నే రంగమందైన,
తప్ప దెవరికైన తట్టుకొనక;
తట్టుకొన్న వాడె తరువాత రాణించు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పూలబాట లుండు, ముళ్లబాటలు నుండు,
వాటనన్నిటను సాగవలయు;
ఓర్పు నేర్పు గలిగియున్న వాడె విజేత!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల చాల కష్టించె నిలద్రొక్కు
కొనగ మొదట, నేర్చుకొన్న విద్య
ధైర్య మిచ్చి వెన్నుదట్టి యెల్లవేళ!
ఘంటసాల మేటి! కలరె సాటి?

తెలుగు చలనచిత్రముల తొలి నేపథ్య
గాయకుల నొకండు ఘంటసాల;
యెవరి కందనంత యెత్తుల కెగబ్రాకె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చలనచిత్ర రంగ సంగీత దర్శక
దిగ్గజముల నొక్క దిగ్గజముగ
మెలగి పేరుపొంది, మెప్పులు పొందెను!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ప్రజల మెప్పుగొన్న వారి పాటలు పెక్కు
గలవు; అసలు మెప్పు గనని దేది?
అన్ని గీతములును ఆపాత మధురాలె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కొత్త కొత్తవైన కొన్ని ప్రయోగాలు
సాహసించి చేసె, సత్ఫలముల
నంది గానమందు నందర మెప్పించి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పద్య పఠనమందు పాత పద్ధతులను
వదలి, సొంత బాణి మొదలుపెట్టి,
అందు మార్గదర్శి యై ప్రశంసల నందె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

సరస మధుర ఫణితి 'జంధ్యాల' పద్యాల
నాలపించె ఘంటసాల; వాని
వినని వారు, మెచ్చుకొనని వా రుండిరా?
ఘంటసాల మేటి! కలరె సాటి?

మాట యైన, వారి నోట వెల్వడినచో
పాట యేమొ యన్న భ్రాంతి కలుగు;
పాటతోడె వారి బాంధవ్య మట్టిది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చలనచిత్ర గీతముల మాత్రమే కాదు,
లలిత-భక్తి గీతములను కొన్ని
పాడియుండి, రవియు ప్రాచుర్యమును పొందె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాడె నితడు దేశభక్తి గీతము, లవ్వి
ప్రజల మన్ననలకు పాత్ర మయ్యె;
మహిమయైన కంఠమాధుర్య మతనిది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వీరు పాడినారు వేలాది యుగళ గీ
తములు, లెక్కలెన్న తరము గాదు;
వినిరి ప్రజలు, పాడుకొనిరి ఆ నా డవ్వి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల మధుర గానామృతము గ్రోలి
పరవశించనట్టి వారు గలరె?
జడులు, వివేకివారె స్పందించకుందురు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారు గాన గంధర్వులు,
మధురగాన వారి మధుర వాణి;
విన్న పాట లెల్ల వీనుల విందులే!
ఘంటసాల మేటి! కలరె సాటి?

సంగ్రహించి 'గీత' శ్రావ్యస్వరమున తా
త్పర్య సహితముగను పాడి, తెలుగు
వారి కిచ్చి, ధన్యులైరి గదా వారు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఐక్యరాజ్యసమితి యందు సంగీత క
చేరి చేసె వీరు, వారి నుండి
'శాంతి పతక' సహిత సత్కార మందిరి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారు కారణజన్ములు,
తరగుణమ్ముగాను బ్రతికినారు;
శ్వాస పాట యగుచు సాగె జీవిత మెల్ల!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చాల చిత్రములకు సంగీత దర్శక
త్వము వహించి, మెప్పు వడసినారు;
పట్టుకొన్న దెల్ల బంగారమే కదా!
ఘంటసాల మేటి! కలరె సాటి?

రాళ్లు కరగు నంద్రు, మ్రోళ్లను చిగురించు
నంద్రు గానమునకు; నది యెరుంగ
గాని, మనసు కరగు గానామృతము సోక!
ఘంటసాల మేటి! కలరె సాటి?

అగ్ర నటులకైన, హాస్య నటులకైన
పాడి యితడు మెప్పువడసె చాల;
నటుల కనుగుణముగ నప్పె నీయన గొంతు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

మాకు ఘంటసాల 'మాస్టారి' పాటలే
ఉండవలయు ననుచు ఖండితముగ
చెప్పు నటులు కొంద రప్పుడు కల రంట!
ఘంటసాల మేటి! కలరె సాటి?

సాంఘికమ్ములందు, చారిత్రకముల, పౌ
రాణికములలోను, జానపదము
లందు-వదల కెదియు, నన్నింట పాడిరి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఏ రసమ్ము నైన నింపుగా గళమున
జాలువార్చె ఘంటసాలవారు;
అంత చాకచక్య మనితర సాధ్యమౌ!
ఘంటసాల మేటి! కలరె సాటి?

భావ మెట్టిదైన, పలికించె నలవోక
గా గళమ్మునందు ఘంటసాల;
అతడు చేసినట్టి అభ్యాస మట్టిది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

దేశమందు, నితర దేశాలలో కచే
రీలు చేసి, జనుల తృప్తిపరచె;
విన్నవారి కెల్ల వీనుల విందులే!
ఘంటసాల మేటి! కలరె సాటి?

మాతృభాష గాక, మరి యైదు భాషల
లోన పాడి, వారి వీనులకును
విందు చేసినారు, విఖ్యాతులైనారు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

మెచ్చి ప్రభుత వారి కిచ్చె 'పద్మశ్రీ'ని,
గౌరవించె మేటి గాయకునిగ;
గొప్పతనము నాడు గుర్తింపబడె నట్లు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాటలోన హావభావాలు పలికించి,
శ్రోతృ మానసముల చూరగొనుట
అల్ప విద్య యౌనె? అభ్యాసఫల మది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

సాటి గాయకులును, సంగీత దర్శకుల్
వీరి గానసరళి వేయి నోళ్ల
ప్రస్తుతించుచుండు వారంట తరచుగా!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కలదు దేశభక్తి, కలసి పెద్దలతోడ
పాలుగొనుట నుద్యమాలలోన,
నతడు జైలుశిక్ష ననుభవించ వలసె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

జన్మసిద్ధమైన స్వరము, శుశ్రూషచే
గురు ముఖమున నేర్చుకొన్న విద్య
అతని జీవితమున కయ్యె గట్టి పునాది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఎంత కాలమైన, నెందరు గాయకుల్
వచ్చి, పాట లెన్ని పాడుచున్న,
వీరి నధిగమించు వా రెందు గనరారు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాటయైన గాని, పద్యమైనను గాని,
శ్రోతృమానసముల చూరగొనుట
వెన్నతోడ తనకు పెట్టిన విద్యయౌ!
ఘంటసాల మేటి! కలరె సాటి?

స్వార్థపరుడు గాక, సహగాయకుల వెన్ను
దట్టి ప్రోత్సహించి, దాతృగుణము
చాటుకొన్న యితడు సత్పురుషుడు గాడె?
ఘంటసాల మేటి! కలరె సాటి?

వారి పాటలు విని పారవశ్యము జెంది
రపుడు, మెచ్చుచుండి రిపుడు గూడ;
వారి గాత్ర మహిమ వర్ణనాతీతము!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వారు పాడినట్టి పాట లేనాటికి
పాతబడవు, నిత్యనూతనములె;
ఆలకించవచ్చు, ఆనందపడవచ్చు!
ఘంటసాల మేటి! కలరె సాటి?
ఘంటసాలవారి గానామృతము గ్రోల
నట్టి వారు, తనియనట్టి వారు
కానవత్తు రరుదుగా నీ తరమునైన!
ఘంటసాల మేటి! కలరె సాటి?

బహు విధాల మెచ్చబడిన గీతము లెన్నొ
ఒక్కమారె (సింగిల్ టేక్) పాడియుండిన వట!
ప్రతిభ యున్న సాధ్యపడు నిట్టి ఘనతలు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పట్టుదలయు, కృషియు ప్రతిభకు తోడైన,
సాధ్యమౌను సు మ్మసాధ్యములును;
సాక్ష్య మిచ్చు ఘంటసాల జీవన గతి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

విజయ కేతనమును వినువీథుల నెగుర
వేయు వ్యక్తి అనుభవించినట్టి
కష్ట తతుల లెక్కగట్టుట కష్టమే!
ఘంటసాల మేటి! కలరె సాటి?

గొప్పకాదె వరుస ముప్పదేం డ్లుత్తమ
గాయక బహుమతిని కైవసమ్ము
చేసుకొనుట! ఇది విశిష్ట 'రికార్డె' యౌ!
ఘంటసాల మేటి! కలరె సాటి?

మధుర గానమునకు మారు పేరౌ ఘంట
సాల, వారి కెవరు సాటికారు;
పాట కతని పేరు పర్యాయపద మాయె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారు గణనీయ గాయకుల్
బతుకు మీదుకట్టి పాట కొరకు,
పాట ప్రజకు వదలి, పయనమై వెడలిరి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కొన్ని మంచి పాట లెన్ని చూపెదమన్న,
నుండుపాట లన్ని ఒక్కలాగె;
వంక పెట్టదగిన పా టొక్క టుండునా?
ఘంటసాల మేటి! కలరె సాటి?

యుగళగీత మైన, ఒంటరి పాటైన,
వంక లెంచి చూప వలనుపడదు;
దేని ఘనత దానిదే, పోల్కి యింకెట్లు?
ఘంటసాల మేటి! కలరె సాటి?

చిన్న వయసులోనె కన్నుమూసిరి వారు,
మిగిలియుండె నింక సగము వయసు;
చాల నష్టపడెను సంగీత రంగము!
ఘంటసాల మేటి! కలరె సాటి?

విస్తృతముగ వెలసె విగ్రహమ్ములు, 'పోస్టు
స్టాంపు' వచ్చె ఘంటసాల పేర;
వారి పేరు పెట్టబడిన సంస్థలు నుండె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

మరవ గలరె జనులు-మధుర గానాకృతి
యైన ఘంటసాల? ననవరతము
గుర్తుచేసుకొనుచు కీర్తింతురే గాని!
ఘంటసాల మేటి! కలరె సాటి?

లలిత కళలలోన రాణించి, చన్నట్టి
వారు త్వరగ మరపురారు; గాన
మలరజేయ గలుగు నాబాలవృద్ధము!
ఘంటసాల మేటి! కలరె సాటి?

అనుభవించినాడు చిననాట లేమి, గా
యకునిగా ప్రసిద్ధుడైన పిదప
కలిమి వలని సౌఖ్యముల నందుకొనె తాను!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారు గానగంధర్వులై,
శ్రోతృజనుల మెప్పు చూరగొనిరి;
మరుగుపడని పేరు, చిరయశఃకాయులు!

ఘంటసాల మేటి! కలరె సాటి?
మధుర గానమునకు మంత్రముగ్ధులు గాక
తప్ప దెవరికైన; దాని మహిమ
శిశువుపైన నుండు, పశువుపై నుండును!
ఘంటసాల మేటి! కలరె సాటి?

గొప్ప పాట యనుచు చెప్పుకోవలె నన్న,
ఏది చెప్పవలయు? నేది కాదు?
అన్ని గొప్పగానె అనిపించుచుండవా?
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఎంతగానొ కవులు సంతసించిరి వారి
పాట ఘంటసాలవారి నోట
ఆలపింప బడుట, నది అదృష్ట మనుచు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చేయి కాల్చుకొనిరి చిత్రాలు నిర్మించి,
ఆర్థికముగ నష్టమయ్యె నందు;
తనకుగాని పనుల తలదూర్చ తగదంద్రు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వినబడుటయె కాని, కనరారు నేపథ్య
గాయకులు తెరపయి; ఘంటసాల
మురియ జేసినారు ముమ్మారు తెరపైన!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వారు పాడినన్ని వైవిధ్యభరిత గీ
తాలు పాడలేదు చాలమంది;
జన్మసిద్ధమైన సామర్థ్యమౌ నది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వివిధ భాషలందు వేల పాటలు పాడి
నారు ఘంటసాలవారు; చిత్ర
నామములను జెప్ప నా తరమా? కాదు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారు కమ్మని సంగీత
మందజేసినారు వందపైనె
చిత్రములకు! పేర్లు చెప్ప వీల్పడ దిట!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాత పద్ధతులను పట్టి వేలాడిన,
వినగ వినగ ప్రజకు విసుగు పుట్టు;
కొత్తదనము కోరుకొనును రసజ్ఞుడు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చలనచిత్ర ప్రేక్షకులకు, రసజ్ఞుల
కెల్లరకును మిగుల నింపుగూర్చు
రీతి ఘంటసాల సృష్టించె బాణీలు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

విస్మరించకుండ విహిత లక్షణముల,
కొత్త 'రుచుల'ను సమకూర్చుచున్న
మెచ్చకుండ టెట్లు మేటి విద్వాంసుని?
ఘంటసాల మేటి! కలరె సాటి?

చూపరుల కతండు చులుకనగా పాట
పాడినట్లు కానబడును గాని,
పాట పాట కతడు పడు కష్ట మెంతేని!
ఘంటసాల మేటి! కలరె సాటి?

రంగ మేదియైన రాణించవలె నన్న,
నెవ్వరైన తగ శ్రమించ వలయు;
కోరుకొన్న మాత్ర తీర వాశయములు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాతదనము గలదె బంగారమునకు? సం
గీతమునకు లేదు పాతదనము;
ఘంటసాల పాట కాలావధుల మించె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కొంతమంది గాయకులు కొన్ని తరహాల
పాటలకునె పనికివత్తు రనుట
యుండె, వీరు మాత్ర ముత్తీర్ణు లన్నింట!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వీరి పాట లెల్ల పేరుపేరున జెప్పి
మెచ్చవచ్చు, నెదియు లొచ్చు కాదు;
తర తమమ్ము లుండు, తప్ప దెందున నది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాత చింతకాయ పచ్చడి పథ్యమై
నట్లు, పాతపాట లందు కొన్ని
అద్యతనులకు నగు నాస్వాదనీయాలు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల మధుర గానామృతము రుచి
మరగినట్టి రసిక వరుడు, మరల
మరల కోరుచుండు మరవ కద్దానిని!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కలసి యుగళ గీతములు వీరితో పాడి,
పైకి వచ్చినట్టి వారు గలరు;
ప్రోత్సహించు గుణము పుష్కలమ్ముగ నుండె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చిన్న వయసులోనె కన్నుమూసిరి ఘంట
సాల; మరియు కొంత కాల మున్న,
ఇంక నెంత యెత్తు కెదిగి యుండెడివారొ!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కలరు చాలమంది గాయకు లానాడు,
వారు మధుర గతుల పాడగలరు;
కాని, ఘంటసాల గళ మధురిమ వేరు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాడగలుగు వారు పదుగు రుందురు గాక,
తారతమ్య ముండు వారి మధ్య;
శ్రోతృజనుల మెప్పు లాతీరుననె దక్కు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చలనచిత్ర గీతముల యథేచ్ఛగ పాడ
జనదు పాటకునకు; సన్నివేశ
మెరిగి పలుకవలయు, నిది కొంత కష్టమే!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వృత్తి వేరు, మరి ప్రవృత్తి వేరైనచో
పనులు చేయలేరు మనసుపెట్టి;
వీ రదృష్టవంతులైరి, రెం డొక్కటే!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వలచి కీర్తికాంత వచ్చి వరించునా
సోమరులను? వలచు శ్రామికులనె;
శ్రమ ఫలముగ ఘంటసాల కీర్తి గడించె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వాడుచున్న విద్య వర్ధిల్లుచుండును,
వాడకున్న యెడల వ్యర్థమగును;
విజ్ఞు లిది యెరింగి వృద్ధిగాంతురు గదా!
ఘంటసాల మేటి! కలరె సాటి?

చదువు తక్కువైన, సంస్కారవంతులు;
మాట మెత్తదనము, మంచితనము,
వినయవర్తనమ్ము వీరి కాభరణాలు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల నివురు గప్పియుండిన నిప్పు,
ప్రజ్వరిల్లె నవసరమ్ములందు;
ప్రతిభ కలదుగాన పైపైకి యెగసెను!
ఘంటసాల మేటి! కలరె సాటి?
గౌరవమ్ము పొందె గాయకునిగను, సం
గీత దర్శకునిగ కీర్తి వడసె;
సవ్యసాచి ఘంటసాల, రెంటను దిట్ట!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వేల సంఖ్యలోనె వీరు పాడిరి గీత
ములను చలనచిత్రములకు, నందు
నచ్చి ప్రేక్షకాళి మెచ్చినట్టివె హెచ్చు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

లోకమున నొకండు పైకి వచ్చెనటన్న,
అది ప్రయత్న ఫలిత మగుట ధ్రువము;
ఫలిత మెపుడు నూడిపడ దాకసమునుండి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారి గాన విధానము
ననుస(క)రించ బూని, అంతొ యింతొ
ఫలిత మందినట్టి వా రుండి రందందు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఏకలవ్య శిష్యు లెందరో! లెక్కించ
వీలుపడునె? ఘంటసాల గాన
సంప్రదాయము కొనసాగు నీలాగునే!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల మధుర గాత్ర మాహాత్మ్యము
వలన 'గీత' నగర పట్టణముల,
నూళ్ల, దేవళముల హోరెత్తుచుండెను!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వారి గానమునకు వంకలు పెట్టెడు
వారు లేరు, మెచ్చువారె గాని;
శాస్త్రశుద్ధమైన సంగీత మది కదా!
ఘంటసాల మేటి! కలరె సాటి?

సాగె 'ఘంటసాల శకము' కొన్నా ళ్లట్లు,
ముగిసె వారు కన్నుమూయగానె;
చలనచిత్ర గాన శకకర్త యగు వారు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారు కన్నుమూసిరి, యశః
కాయ మక్షరమ్ము గాన చిరము
వారి పేరు మరుగుపడక నిలిచి యుండు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

సంఖ్యలోన ఘంటసాల పాటల మించి
నట్టివార లుందు, రంతమాత్ర
వీరి పెద్దరికము వీగిపోదు, స్థిరమ్ము!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారి గాత్ర మాధుర్యము
గూర్చి యెంత చెప్పుకొన్న, నది స
శేష కథలవోలె శేషించియే యుండు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

గాలి పాట కాదు ఘంటసాలది, శాస్త్ర
మును శ్రమించి నేర్చుకొనె నతండు;
శ్రావ్య కంఠరవము శాస్త్రశోభిత మయ్యె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారి కంఠ మాధుర్యము
వనుభవించవచ్చు నాలకించి;
కాని, తగు పదాలు కనరావు పొగడంగ!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల మధుర గాయకు డగుటచే
మరవలేదు ప్రజలు; మధుర ఫణితి
పాటలకును వారు బాణీలు కట్టిరి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారి కమనీయ గీతాలు
మెప్పు పొందుచుండె నిప్పటికిని;
ఆలకించు కొలది ఆపాతమధురాలె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కూర్చినాడు తాను గొప్ప సంగీతము,
నిలిచియుండె చిత్రములు చిరముగ;
లవకుశాది చిత్రరాజము లతనివే!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఆంధ్రుడై జనించి, ఆపాత మధుర గా
నామృతమ్ము ప్రజల కందజేసి,
చన్న ఘంటసాల సార్థక జన్ముడు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కలరు పెక్కుమంది గాయకుల్, మధురాతి
మధుర గతుల పాడి, మానసముల
దోచగలరు వారు; రోచిష్ణు వీతడు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

అందె తిరుమలేశు ఆస్థాన విద్వాంస
గౌరవమ్ము, స్వామివారి మ్రోల;
వీరి కమిత భక్తి వేంకటేశ్వరునిపై!
ఘంటసాల మేటి! కలరె సాటి?
అంతరాలయమున అన్నమ య్యానాడు,
ఘంటసాల నేటి కాలమందు
తిరుమలేశు సన్నిధిని పాడగల్గిరి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పరవశించి వీరు పాడుచో భక్తి గీ
తాలు, నాస్తికులును తలల నూచి,
'అస్తి-నాస్తి' మరచి, 'ఆహా!' అనకపోరు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

'ఘంటసాల గీత' కడు ప్రచారము పొందె,
పడిన శ్రమకు తగిన ఫలము దక్కె;
దాని వినని వారు కానరా రొక్కరు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వీరి 'గీత' తరచు వినబడు శవముల
చెంత, చూడ నదొక వింత; గీత
గూర్చి తెలియనట్టి 'కొంచెపు' పను లివ్వి!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాడినారు చివరి పాట ఆస్పత్రిలో
మరణశయ్య నుండి, మరుసటి దిన
ముననె వారు కన్నుమూసిరి, ధన్యులు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వారి పాట విననివారు తెలుగు నాట
లేరు నాడు, నేడు లేరు, ముందు
నుండ రనిన నతిశయోక్తి కాబో దది!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పుట్టినట్టి ప్రాణి గిట్టక తప్పు, దీ
జన్మ చేయవలదె సార్థకమ్ము?
ఘంటసాల చనియె కారణజన్ముడై!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కలసె కాలరుగురిని నలువదేడేడులు
వారు కన్నుమూసి; వారి మధుర
గళము నేడు తరచు కర్ణాల సోకదా?
ఘంటసాల మేటి! కలరె సాటి?

చెప్పుకొనగ నొప్పు గొప్ప వ్యక్తుల చరి
త్రములు తరచు, నవ్వి తరతరాల
స్ఫూర్తి నొసగు మానవులకు నెంతేనియు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

పాట కొరకు పుట్టె, పాటకై జీవించె,
గడపె పాటతోనె కాల మెల్ల;
ఘంటసాలవారు కారణజన్ములు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

మధుర గాయకులకు మరణ ముండదు, వారి
పాట లుండునంత వరకు, వారు
కనుల బడరు గాని, వినిపించుచుందరా?
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఎంత చెప్పుకొన్న నిట్టివారి గురించి
మిగిలియుండు చెప్పదగిన అంశ
ములు మరెన్నియేని, ముగియక కనరాదు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

జరుగుచుండె ఘంటసాల జయంతి, వ
ర్ధంతి సభలు క్రమము తప్పకుండ;
అట్టి దౌర ప్రజల అభిమాన మతనిపై!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ప్రజల తలపులందు పదికాలములు నుండ
గలుగు వారు కీర్తిగన్న వారె;
ఘంటసాల కీర్తి గన్నారు, మన్నారు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాల పేర గణనీయమౌ పుర
స్కారములును కొన్ని గలవు; యోగ్యు
లైన వారి కవ్వి అందింపబడుచుండె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

కష్ట గతులు గడచి, గానగంధర్వుడై,
ఘంటసాల హిమశిఖరము నంటి,
కీర్తనీయు డయ్యె, కీర్తికాయుం డయ్యె!
ఘంటసాల మేటి! కలరె సాటి?

వీరి కీయలేదు 'భారతరత్న' ఈ
నాటి వరకు, కారణము తెలియదు;
ఇచ్చి గౌరవించవచ్చు నిప్పటికైన!
ఘంటసాల మేటి! కలరె సాటి?

శతక మొకటి ఘంటసాలవారి గురించి
సులభశైలి నాటవెలదులందు
వ్రాసి తిటుల తెలుగు పఠితల కొర కేను!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఘంటసాలవారి ఘనకీర్తి గూర్చి యెం
తైన చెప్పవచ్చు, గాని, శతక
మగుట దీని నింక ఆపక తప్పదు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

శతక మగుట పద్యసంఖ్యా నియమ ముండె,
కుదుర దన్ని చెప్పుకొనుట యిచట;
ముఖ్యమైన విషయములకె ప్రాధాన్యత!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ముఖ్యమైన విషయములు కొన్ని మాత్రమే
ఇచట చెప్పుకొంటి, మింక నెన్నొ
కలవు; స్వస్తి పాఠకులకు! నాకు సెలవు!
ఘంటసాల మేటి! కలరె సాటి?

మిత్రు 'లాంజనేయ మేస్టారి' ప్రోత్సాహ
ఫలిత మీ శతకము! వారి కేను
వందన శతకముల నందించుచున్నాను!
ఘంటసాల మేటి! కలరె సాటి?

ఇంతకీ వీరు ఎవరు ?

నీతో వుంటూ రహస్యం
నీతో సంభాషిస్తూ విషయాలు దాచడం
మొక్కుబడి మాటలు చెప్పడం
పై పై పలకరింపులు కురిపించడం
మననుండే ఆశించడం
మనవెనుకేమో దూషించడం
ఇవన్నీ చూస్తుంటే మనకే ఆశ్చర్యం కలగడం
మనపర చూరులో చెక్కడం
నేను నాది అని గిరిగీసుకోవడం
"నా కేంటి ..ఐతే నాకేంటీ ?"అనే సంకుచితభావం
చరవాణి చేతుల్లో ఉండికూడా మాట్లాడలేని తత్వం
మనం పలకరిస్తే మాట్లాడటానికి
"ఊరికి ఉపకారం చేస్తున్నట్లు భావించడం "

మంచితనం ముసుగులో కపటత్వం
చిన్ననుండి పెద్దదాకా ఒకటే బాట
చెప్పే శ్రీరంగనీతులు వింటుంటే
దేవునిపై కురిపించే భక్తి చూస్తుంటే
వీరినిమించిన భక్తులుండరు
వీరికి సాటైనా సమాజసేవకులుండరు
వీరిదంతా ఒకటే ఎదురుచూపు
నువ్వుకిందపడితే పక్కున నవ్వడానికి
అవకాశం కోసం నిరీక్షణ
సందుదొరికితే కాలులాగడానికి
చాటైతే నీపై చాడీలు చెప్పడానికి
"నువ్వేంగొప్ప " అని ప్రశ్నించడానికి
నీ ఎదుగుదలతో ఈర్ష్య
నీ ప్రగతి తో అసూయ
ఇది వీరి అసలురంగు ...

-రామడుగు వేణుగోపాల్
97455930441

..నా హీరో...

రంగులు పూసుకునే వాడు కాదుర హీరో
రక్తం చిందించిన అల్లూరి నా హీరో
బరితెగించే వాడు కాదుర హీరో
భారతి కొరకు బాంబులువేసిన భగతు నా హీరో
నీతి లేనివాడు కాదుర హీరో
నిజామునెదిరించిన కొమురంభీము నా హీరో
డూపు ఫైట్లు చేసేవాడు కాదుర హీరో
గెరిల్లాయుద్ధంతో గుబులురేపిన శివాజీ నాహీరో
ప్రేమంటూ వెకిలిచేష్టలు చేసేవాడు కాదుర హీరో
అమ్మను ప్రేమించి ఉరిచుంబించిన అశ్ఫాకుల్లా నాహీరో
కాసులకోసం కామకలాపాలు చూయించేవాడు కాదుర హీరో
దేశం కోసం గడ్డిరొట్టెలు తిన్న రాణాప్రతాపు నాహీరో
చరిత్ర హీనుడు కాదుర హీరో
చరిత్ర సృష్టించిన సావర్కర్ నాహీరో

సొల్లు కబుర్లు చెప్పేవాడు కాదుర హీరో
సేవా నిరతిని చాటిన వారే నా హీరో
విదేశీఉత్పత్తుల చాటేవాడు కాదుర హీరో
మన కడుపులు నింపే అన్నదాత నాహీరో
తుపాకితోటి అడవులకెల్లమనెవాడు కాదురహీరో
సరిహద్దుల పహారా కాసే జవాను నాహీరో
నా హీరో ఒక ఆదర్శం
నా హీరో ఒక ఉత్తేజం
నా హీరో ఒక ఉల్లాసం
నా హీరో ఒక ఉద్గ్రంథం
నా హీరో ఒక యుగద్రష్ట
నా హీరో నా సర్వస్వం

-రాంనరేష్ కుమార్
9492682285

హైమంత తుషారాల గజళ్ళ కవయిత్రి డా॥శ్యామల

పుస్తక సమీక్ష





తెలుగు భాష లాలిత్యం, భావ సౌందర్యానికి ప్రతీక 'హేమంత తుషారాలు' గజల్ సాహిత్య ఆకాశంలో, మనోహరంగా స్వేచ్ఛా విహంగంగా ఈ సంపుటి రసహృదయాలను విహరింప చేస్తుంది. భావ కవిత్వ ధోరణిలో గజళ్ళు, ఊహాప్రేయసి ప్రణయాన్ని ఆశ్రయించినా, ప్రణయేతర మౌలిక రూపాలతో డా॥గడ్డం శ్యామల, ప్రణయ సౌకుమార్య సన్నిహిత భావాలతో చదువరుల హృదయాలను స్పృశించారు. 'గజల్ కలహంస' పురస్కార గ్రహీత శ్రీమతి శ్యామల, వాసంత సమీరాలతో మనస్సును ఆహ్లాదపరిచి హేమంత తుషారాలతో పూలవాన ఆవిష్కరించారు. ప్రణయ వ్యక్తీకరణలో మార్మిక సంకేతాలను మార్మిక సంకేతాలను కళ్లు, 'చెలి కన్నులు వెలుగులతో స్వాగతించె ప్రేమ మీర' అంటూ కనురెప్పల శబ్దమాలతో వలపుగీతి వర్షింప చేస్తారు. కన్నులతో భావాలను తెలిపానే నీ కోసం- వెన్నెలతో వెలుగులను పరిచానే నీ కోసం' అంటూ ప్రణయ రంజితంగా పులకరింప చేస్తారు. సున్నిత తహృదయ స్పందనలను, భావుకతను పదాల కూర్పుతో వైవిధ్య ఇతివృత్తాలతో డా॥ శ్యామల ఈ సంపుటిలో 81 గజల్స్ ప్రచురించారు. "కన్నుల ముందు నీలాలన కదలాడుతు ఉండగా- మాయమ్మైన నీ చేతిని తడమాలని ఉన్నది.." అంటూ నాశ్రీనష్టు గురించి, "అమ్మా మాట విన్నంతనె వేడిలాగ గెంతు మనసు.. శ్యామ చెంత నిలుచునుగా కైమోడ్పుల దైవతమే " అంటారు. కొన్ని గజల్స్‌లో 'శ్యామ' ప్రస్తావిస్తూ "శ్యామ మనసు వెన్నెనని గుర్తించే వారేరి- నా ఊహల చిత్రాన్నే గీయలేదు ఎక్కడా.." అంటారు స్వకీయంగా. ప్రకృతి, ప్రణయం, అనుభవాలు, అనుబంధాలు, మానవీ యత కలబోసిన పూదోటగా హేమంత తుషారాల కవయిత్రి, ప్రతిభా భావుకత, పదలాలిత్య చతుకతతో "తరతరాల తెలుగు వెలుగు నిలవాలీ కలకాలం" అభిలషించటం అభినందనీయం. "పెదవిపైన దరహాసము చెదరుతోంది ఎందుకనో, అనుమానపు నీడ వెంట కదలుతోంది ఎందుకనో" అంటూ "ఆడదాన్ని అగ్గి చేయు కఠినమైన లోకమిది. రాతిని నాతిగ చేసిన చరితము కద మిగిలేది" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తారు. "మానవాళే కరోనాతో.. భీతి చెందగ నగచెనేమో! అశ్రువులతో సంద్రమాయెను.. బాధ చినుకుల పరిగ తులతో! అంటారు సామాజిక స్పృహతో కవయిత్రి. ముగ్ధ మనోహరంగా హృదయాలను పరవశింప చేస్తున్న ఈ గజళ్ళు శ్రీమతి శ్యామల సృజనాత్మక పరిణితికి ఆనవాళ్ళు.

ప్రతులకు: జ్యోతి వలబోజు
సెల్: 80963 10140

-జయసూర్య
సెల్: 9440664610

అభిలష

అగ్గి రాజేయాలె
ఇదే సరైన సమయమని
జనం నిద్రమబ్బు వదిలించాలె
లోపల మరుగుతున్న లావాను
గురితప్పకుండ చిమ్మాలె
శత్రుదుర్భేద్యమన్న గడిని
మిగల్చకుండ కాల్చాలె.

సహనం గొంతు పిసకాలని చూస్తే
పిల్లైనా పులౌతుందని నిరూపించాలె
పెరుగుతున్న ధనదాహానికి
అధికార నీళ్ళు అందకుండ చేయాలె.

అగ్గి రాజేయాలె

మౌనం పాటిస్తున్న మేధావులు
జనంతో కలిసి నడవాలె
దోపిడి దొంగలను
శ్రీకృష్ణ జన్మస్థానానికి సాగనంపాలె
చిన్నపామైనా
పెద్దకర్ర సూత్రాన్ని పాటించాలె.

నిరంతరం అగ్గి రాజేస్తూనే ఉండాలి
సిగ్గూ లజ్జా వీడినోళ్లకు
చావుభయమొక్కటే సరిజేసే మంత్రం
అగ్గి రాజేయాలె
పందికొక్కు లెక్క
కిందికి తోడుకునుడే కాదు
ప్రజా సంక్షేమం మరవకుండ
వాతలు పెట్టాలె

అగ్గి రాజేయాలె
అధికారం లేనప్పటికి
అధికారం వచ్చినాక
తేడెందుకచ్చిందో తెలుసుకునేటట్టు చేయాలె
అగ్గి రాజేయాలె
విశ్వాసం కోల్పోయిన నాయకులకు
దుంపిడిగళ్ళం ఆశలు లేకుండ చేయాలె
అందరికి సమానత్వానిచ్చేటి
రాజ్యాన్ని నిలబెట్టాలె

- దామరకుంట శంకరయ్య
9440876788

అక్షర సేద్యం!

ఆకాశం మబ్బు కమ్మినప్పుడు
నిరశజనితమై మనసుక్రుంగి
నయనాలు జల జల రాలినప్పుడు
ఓ ఓదార్పు తోడయ్యేనిప్పుడు!

చూరుకింద పక్షులపలుకిన్నప్పుడు
మల్లెచెట్టుపై తుమ్మెదవాలుతుంటే
జాబిలమ్మలో ముసలమ్మనుచూసినప్పుడు
మనసు ఎందుకోఉప్పొంగెనిప్పుడు!

అక్షరలతో కుస్తి పడుతున్నప్పుడు
తెల్లకాగితాలెన్నో జాలిగాచూసి
నా మనో నేత్రంపై దృశ్యమైనప్పుడు
ఎన్నెన్ని భావాలు ఒలికాయో ఇప్పుడు!

శ్రీశ్రీ మహాప్రస్థానం చదివినప్పుడు
గోరటి వెంకన్న గీతాల ఉద్వేగం
కాళోజి నాగొడవ నా ఊపిరైనప్పుడు
సిరివెన్నెల సాహిత్యం నేస్తమైందిప్పుడు!

మనసు మధించబడిందిప్పుడు
అందులోఎన్నెన్నిసాహితి కల్పతరువులో
ప్రకృతిని చదువుతు కలం కదిపానిప్పుడు
ఆ అక్షరం మమకారంతోపుస్తకమైందిప్పుడు!

-వజ్జీరు ప్రదీప్
9989562991

నేటి కాలంలో....

సెల్ ఫోన్ లే స్నేహితులు
వాట్సప్ ఫేస్ బుక్లే ఆత్మీయులు
చాటింగ్ ట్విట్టర్లో కాలక్షేపాలు
వీడియో గేమ్లే వ్యాయామాలు
పబ్జి ఫయర్లే నేటి క్రీడలు
వీడియో, వాయిస్ కాలింగ్ లు
ఇరవై గంటలు ఆన్ లైన్ లు

ఉదయాన్నే ఫీలింగ్స్ స్టేటస్ లు
అందమైన దృశ్యాలతో సెల్ఫీలు
ప్రమాదపు అంచులతో
చెలగాటాలు
కరోనా పుణ్యమా ఆన్లైన్ పాఠాలు
చంటి బిడ్డ చంకలో ఉన్నట్టు సెల్ ఫోన్లు

పస్తున్న పర్వాలేదు ఫోన్ ఉంటే చాలు
ఆన్ లైన్ ఫుడ్ ఆర్డర్ లు
సైబర్ నేరగాళ్ల హాకింగ్ లు
బ్యాంకు ఖాతాలన్ని లూటీలు
ఇదే నేటి కాలపు ప్రపంచం

-యాదవరం చంద్ర కాంత్ గౌడ్
9441762105

శైలాంగనలు

శ్రమ హవనఫలాన్ని
బుట్టలలోభద్రపరచి
మనకు పంచడానికి ఏకమైన
వన గంధర్వతరుణులు
కొండకోనల గుండెలో దాగి
కానల హృదయంలో వసిస్తూ
విషకన్యల కాటును తట్టుకుంటూ
గంభీర గర్జనల బుసలకు
భయపడకుండా గిరిసంపదను
పంచడానికి ప్రమాదకరమైన
జనారణ్యంలో
ప్రవేశించిన శైలాంగనలు!.

విషరసాయనాల స్పర్శ ఇసుమంతైనా
లేని స్వచ్ఛకౌముదీఫలాలు
వర్షాధారాలై సలిలధారల
అభిషేకంతో పునీతమైన
ఫలపూర్ణకుంభాలు ఆ బుట్టలలో
అలంకరించబడిన సేద్యామృతాలు!.

నిర్మలమైన మనసుతో
ధర్మ భరితమైన వాక్యసుధలతో
న్యాయదేవతకు మారురూపాలతో
అచలామృతాన్ని పంచడానికి
జనకూడలికేతెంచిన
అటవీ మోహినీ అవతారాలు!
మోసం ఎరుగని వనితలు!.

దాతృత్వం తెలిసిన ధర్మాంగనలు!
అమాయకత్వమే ఆభరణంగా
అలంకరించుకొన్న అతివలు!

-శేషం సుప్రసన్నాచార్యులు
9000245963

బాల గేయం

బడి అంటే మాకిష్టం,
గురువులంటే మాకిష్టం,
చదవడమంటే మాకిష్టం,
పరీక్షలంటే మరీ మరీ ఇష్టం.

ఆటలు అంటే మాకిష్టం,
పాటలు అంటే మాకిష్టం,
బాలసభ అంటే మాకిష్టం,
ఉపన్యాసమంటే మరీ మరీ ఇష్టం.

గురువుల మాటలు మాకిష్టం,
మధ్యాహ్న భోజనం మాకిష్టం,
స్నేహితులంటే మాకిష్టం,
బడికి వెళ్లడమంటే మరీ మరీ ఇష్టం.

కలిసి చదవడమంటే మాకిష్టం,
కలిసి తినడమంటే మాకిష్టం,
కలిసి ఆడటమంటే మాకిష్టం,
గురువులతో గడపటమంటే
మరీ మరీ ఇష్టం..

-పాత్లావత్ పురందాస్
9వ తరగతి, నేరళ్లపల్లి
బాలానగర్ మండలం
మహబూబ్ నగర్ జిల్లా
7013264464

నెర్ర బారిన నేల

వాళ్ళు సుక్క పొద్దునే లేచి
సూర్యుని నిద్ర లేపుతారు
అవని పై అడుగులు వేస్తూ
పూట కోసం వేటను మొదలెడతారు.
కాళ్ళకు చక్రాలను కట్టుకొని
ముంతలో ముద్ద నెట్టుకొని
అంచుకు తొక్కును రాసుకొని
అరిగిన పాదాలతో
అడ్డ మీది కొచ్చిసంతలో
ఎద్దో లే నిలబడతారు
పొయ్యి వెలిగించే సూర్యుల కోసం
దిగులు పక్షి లా దిగాలుగా చూస్తారు
వాళ్ళకు కండల నిండా ఆత్మాభిమానం
ఆకాశమంతుంటది కానీ
పేదరికం కాలనాగై కాటేస్తుంది
వాళ్ళకు గుండె ల నిండా
విశ్వాసం సాగరమంతుంటది కానీ
అవసరాల తోరణాలు వెక్కిరిస్తుంది
వాళ్ళ మనసంతా మల్లె పువ్వు కానీ
గతమంతా నెర్రబారిన నేలవంటిది .
చెమట చుక్కలను చిందించడమే కానీ
జేబులకు చిల్లులు పెట్టడం తెలియదు
పనిలో సరిగమలను పాడించడమే కానీ
మోసపు కట్టెలు పేర్చడం తెలియదు
వాళ్ళని చులకనగా చూడకండి
పరుషపు మాటలతో
వాళ్ళ పెయ్యి ని జల్లెడ చేయకండి

-తాటిపాముల రమేష్
7981566031

జ్ఞాన వారధి

అక్షర జ్ఞానం
మనిషి వివేచన..
విచక్షణ..
వివేకానికి వనరు?
సమయ స్ఫూర్తికి సంకేతంగా..
వినయ భావానికి ప్రతి రూపంగా?
వికాసానికి అంతఃశక్తిగా
వెల్లివిరిసే సారస్వత కళ...
అనంత మేధో వారధి అక్షరం?
విశ్వ రహస్య ఛేదనానికి
అక్షరమే ప్రేరణ..
పరిశోధనా పాటవానికి
విద్యే మూల కారణం..
మనిషి మనుగడ పరిణామ క్రమంలో
పరివర్తనం అక్షరం సొంతం?
అవని గర్భాన్వేషణమైనా...?
అంతరిక్ష ఆవిర్భావమైనా..
అక్షరాస్యుని
అనంత ఆలోచనా పర్యసానమే?
ఆధునిక జీవన వైవిధ్యం?
శాస్త్ర సాంకేతిక నైపుణ్యం..
అక్షర జ్ఞాననేత్ర సాదృశ్యం..
అక్షరాస్యత గల పరిసరాలు
అవని మండలంపై
జ్ఞానరహిత ప్రదేశాలు..
విచక్షణ లేని చదువరి..
మానవాతీత వింత మహమ్మారి..
అక్షరాస్యత విశాల ఆలోచనా చిహ్నంగా
ప్రపంచం పరిఢవిల్లాలి..!
నిజానికి?.
అమ్మ ఆయువు సృష్టిస్తుంది?!
అక్షరం ఆలోచననిస్తుంది..!!



-అనంతవరం శ్రీనివాస్

పర్యావరణం

పచ్చని చెట్లను పెంచి,
పర్యావరణాన్ని రక్షిద్దాం.
కాలుష్యాన్ని తగ్గించి,
ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.
ఏపుగా తరువుల పెంచి,
భూగర్భజలాన్ని పునరిద్దాం.
ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి,
ప్రకృతి మాతను రక్షిద్దాం.
సంఘటితంగా ఉండి,
సహజ వనరుల సంరక్షిద్దాం.
నీటి విలువ తెలుసుకొనీ,
జలకాలుష్యాన్ని అరికడదాం.
చెట్లున్న పుడమి చూడ,
చెట్లే మానవ ప్రగతి మేడా..
అవి లేకున్నా మనకు,
లేదు నిలువ నీడా..
చెట్లే సర్వం.. చెట్లే శాశ్వతం..
విరివిగా పెంచుతూ..
సుఖంగా జీవిద్దాం..

-విస్లావత్ సావిత్రి
10వ తరగతి
జిఖఉబా నేరళ్లపల్లి
బాలానగర్ మండలం
మహబూబ్ నగర్ జిల్లా
7013264464

మనసున్న మనిషికే...



హృదయ మైదానాల దండేల మీద
నమ్మకాలు ఆర వేసుకోవాలి గాని
నాగ జేముళ్ళు వేలాడ దీసుకోకూడదు
నమ్మకాలు జారిపోయిన వేళ
గుండెలు సుడి గుండాలలో పడి
గిరగిర తిరుగుతూ
గిలగిల కొట్టుకుంటాయి
చిక్కని రక్త సంబంధాలు
నీరుగారి పోతాయి
ఆరని అనురాగ దీపాలు
కొడిగట్టిపోతాయి
చల్లని ప్రేమాంతరంగాలు
సెగలు పొగలు కక్కుతాయి
కత్తిరించడం కాదు
కలిపి కుట్టడం తెలియాలి
నీట ముంచడం కాదు
చేదుకోవడం తెలియాలి
కడుపు కొట్టడం కాదు
బ్రతుకు నివ్వడం తెలియాలి
తిరస్కరించడం కాదు
పరిష్కరించడం తెలియాలి
మాట పడ్డవారికే తెలుస్తుంది
గాయంలోతు
మమత పంచిన వాడికే తెలుస్తుంది
మంచితనం విలువ
మనసున్న మనిషికే తెలుస్తుంది
గుండె గాయాలకు మందు.

– జి. నీలకంఠం

నిశ్శబ్దంలో సంగీతం

పుస్తక సమీక్ష



Heard melodies are sweet/ but those unheard are sweeter (జాన్ కీట్స్). అవును. అంతేకాదు, రాగాలకు రంగులుంటాయి. రంగుల్లో రాగాల్ని బంధించాలని పుట్టు బధిరురాలైన లాస్యకల. లాస్య అందరిలాంటి అమ్మాయికాదు. వినికిడి లోపమున్న వ్యక్తి. వీరు మాట్లాడలేరు కూడా!

స్నేహిత అవినాష్ దంపతులకు లాస్య ఒక్కగానొక్క కూతురు. లాస్య కడుపులో ఉన్నపుడు స్నేహితకు 'జర్మన్ మీజిల్స్' కావటం వల్ల కూతురు లాస్య మూగదై పుడుతుంది. స్నేహిత అందరిలా 'ఢీలా' పడలేదు. పట్టుపట్టి కూతురికి మాటలు వచ్చేలా చేస్తుంది. వినికిడి శక్తి లోపించిన లాస్యకు, శబ్దతంత్రుల్ని గ్రహించి మెదడు సంకేతాలు చేరవేయగలిగే 'కోచ్లర్ ఇంప్లాంట్' అనే పరికరం అమర్చి, వినికిడి శక్తిని తిరిగి తెప్పిస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా, లాస్య హెలెన్ కెల్లర్ బెథోవిన్ డొరోతి మైల్స్ లాంటి వికలాంగుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుంటుంది. బ్యాంకు ఉద్యోగి వినీత్ అను యువకుడు ఆమెలోని దృఢ నిశ్చయం పట్టుదలకు అచ్చెరువందుతాడు. ఆమెతో పరిచయం పెంచుకుని, ఇంట్లో వాళ్ళ నెదిరించి లాస్యను పెళ్ళాడుతాడు. జీవితం మీద ఆసక్తి పెరిగిన లాస్య పబ్లిక్ సర్వీస్ పరీక్షలు పాసయి, ఐఆర్ఎస్‌లో సెలెర్టు అయి, ఇన్కంటాక్సు ఉద్యోగిగా కెరీరు ప్రారంభించి, ఆ ఉద్యోగంలో ఉండే సాధక బాధకాలనధిగమించి అసిస్టెంట్ కమీషనర్‌గా పదోన్నతి సాధిస్తుంది.

తలిదండ్రులతో గడుపుతున్నా, వినీత్‌తో సంసార జీవితం సాగిస్తోన్నా, లాస్యలో ఏదో సాధించాలి, తనలాంటి బధిరులుగా జన్మించినవారిని ఆదుకోవాలి అన్న Burning Desire తో వేగిపోయేది. మైకెల్, అను చిత్రకారుడి వద్ద తాను నేర్చుకున్న రంగులు, అవి సృష్టించే, సృష్టించగలిగే భావాలపై లోతైన అధ్యయనంతో, ఒకో రాగానికి ఒకో రంగు ఉంటుందని, ఒకో సన్నివేశం ఉంటుందని తెలుసుకున్న లాస్య చిత్రలేఖనంలో తన ప్రతిభ చూపగలుగుతుంది. Hearing Impaired కు ఓ స్వచ్ఛంద సేవా సంస్థ, మరియు తన కలల ప్రాజక్టు అయిన రంగులతో రాగాలు వినిపింపచేయటం ఈ రెంటినీ సాధించి, అవకరంతో జన్మించినా అసాధారణమైన ప్రజ్ఞ చూపించగల వ్యక్తిగా లాస్య తన జీవితం ధన్యం చేసుకుంటుంది.

'మౌన రాగాలు' రచయిత సలీం (సయ్యద్ సలీం) సమాజాన్ని జాగృత పరచే రచయిత. ఇంతవరకు వీరు 3 కవితా సంపుటాలు 10 కథా సంపుటాలు, 25కు పైగా నవలలు తెలుగు పాఠక లోకానికి అందించారు.

బాధ్యతాయుతమైన ఆదాయపు పన్నుల శాఖలో ఉద్యోగం నిర్వహిస్తు కూడా, రచనలకు కాలం వెచ్చిస్తూ, సమాజ రుగ్మతలను ప్రక్షాళనం చేస్తున్నారు. 4 దశాబ్దాలుగా వ్రాస్తూ పలు ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలను కైవసం చేసుకున్న రచయిత సలీం. లోతైన అధ్యయనంలోంచి వెలువడిన నవలలు, కథలు ప్రజాదరణ పొందటంలో ఆశ్చర్యం లేదు.

మీదు మిక్కిలి వీరు మాత్రమే వ్రాయగలిగిన మెహర్ ఖురఖా, తలాఖ్, ఆరో అల్లుడు లాంటి కథల్లో ముస్లిం సాంప్రదాయాలపై నిరసనను సున్నితంగా ప్రకటిస్తారు. ఈ మధ్యే వెలువడిన వీరి 'అరణ్య పర్వం' నవలలో, అరణ్యం, పులులు, అక్కడి గిరిజన సంతతిపై ఎంతో అధ్యయనం చేస్తే కాని, వ్రాయలేని ఇతివృత్తం.

ప్రస్తుత నవల 'మౌన రాగాలు'లో కూడా సంగీతం, చిత్రలేఖనానికి గల సంబంధం అత్యద్భుతంగా వివరించబడింది. పెయింటింగ్స్‌లో సంగీతమేమిటే? అన్న తల్లి ప్రశ్నకు లాస్య జవాబు. 'రాగాన్ని రంగుల్లో చూపించాలనుకుంటున్నా. నా పెయింటింగ్ చూడగానే ఆ రాగం కనిపించాలి (పే.71) అంటుంది లాస్యం. మొక్కవోని దీక్షతో చిత్రకళలో ప్రావీణ్యం సంపాదించి రంగులతో నాట్యం చేయించి, కనుల కింపుగా వీనులకు విందుగా సంగీత స్వరాల్ని (చిత్రలేఖనం ద్వారా) రసజ్ఞల హృదయాలకు వినిపించాబు (పే.145) అని కొనియాడబడుతుంది కథానాయకి లాస్య.

తన అవసర జీవితాన్ని ఓ "ఛాలెంజ్"గా స్వీకరించి, మామూలు మనుషులకంటే ఎన్నోరెట్లు గొప్పగా, ప్రశంసనీయంగా దిద్దుకోవచ్చునని తెలియచేసిన ఉదంతం ఇది. బధిరత్వం ఎలా వస్తుంది? అధితమించాలంటే ఏం చేయాలి? లాంటి ప్రశ్నలకు రచయిత వైద్య శాస్త్రంలో లోతైన అధ్యయనమే చేసి, విజ్ఞానం ఉత్కంఠ పేజి పేజినా నింపి అందించారు. ఒక నిస్సారమైన సబ్జెక్ట్ చేయితిరిగిన రచయిత చేతిలో ఎంత అందంగా రూపుదిద్దు కోగలుగుతుందో చూపారు.

ప్రతులకు:
జ్యోతివలబోజు
సెల్: 8096310140



– కూర చిదంబరం
సెల్:8639335675

పూల ముత్యాలహారాలు

భూమాత ఒడిన అమ్మలు,
మీరు విరిసిన కొమ్మలు.
పూసెను రంగుల పూలు,
పులకించే బతుకమ్మలు.

వీచె మలయసమీరాలు,
కదిలే వయ్యారాలు.
లతల యొక్క అందాలు,
వర్ణించలేవు మనసులు.

పూలతోని మనబంధము,
ఋణపడెను సంబంధము.
తలుచుకున్న నా హృదయము,
ఉప్పొంగెను అనుక్షణము.

పవనాలు తెచ్చు కబురులు,
వింటూ ఆడించు తలలు.
ప్రియసఖునికి బహుమతులు,
తిరిగి పంపు పరిమళాలు.

వయ్యారమొలకకే సుమ,
మా హృదయ మనోరమ.
పెనవేసుకున్న బంధమ,
ఎదలో నుండిపో మిత్రమ.

అలంకారమై నీవు,
మాలలల్ల ఒదిగేవు.
తలలోన సుమ నీవు,
అగ్రస్థానమే నీవు.

దైవ సన్నిధానము,
గౌరవ సన్మానము,
అలంకార తోరణము,
అంతటా సుమ శోభము.

తీర్చు ముద్దుముచ్చటలు,
రంగురంగుల పూవులు.
గుండెలో వసంతాలు,
విరిసెనే అందాలు.

సుకుమార సుమలతలు,
సుతిమెత్తని నడకలు.
మోగు లాళ్యాణ ఘడియలు,
నరునికి నవ్య బాటలు.

ఇంద్రధనుస్సు రంగులు,
పరిమళించు సుమాలు.
పరుచుకున్న అందాలు,
మనసు దోచే విరులు.

-చైతన్య భారతి పోతుల
7013264464

అమ్మలగన్న అమ్మ

అమ్మను అర్థం చేసుకుంటే
ప్రకృతిని అర్థం చేసుకున్నట్టే..
ప్రకృతిని అర్థం చేసుకుంటే
సకల సృష్టిని అర్థం చేసుకున్నట్టే...
సకల సృష్టిని అర్థం చేసుకుంటే
మనల్ని మనం అర్థం చేసుకున్నట్టే...
ఎందుకంటే....
స్థూల సృష్టికి సూక్ష్మ రూపమే మనం..
ఆ సాధనకు.. దసరా.. ఒక ఆసరా...!



– వి. మంగతాయారు
సెల్: 9949278483

దీపం !

చీకట్లో చిరు దీపం లా
వచ్చింది నాయింట
నా కలల పంటై
కనువిందు చేసింది
కలల రాణి విరిబోణి యై
వెలుగుతోంది...
వెలుగుల పంచుతోంది.
చిరు నవ్వులు చిందించినా
నిప్పు రవ్వ లెగిసినా
రెండూ దీపపు వెలుగులే
ఎగసిన నిప్పు రవ్వలెంత
కాలముంటాయి!
ప్రతి యింటా
వెలిగేదీ పడుచు హృదయమే
పతిదేవుని కూతమిచ్చి
ప్రణతులందుకొంటుంది
అందుకే అంటారు
ఇంటికి దీపం ఇల్లాలనీ..!!

-యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్ 9866447234

శాశ్వత పరిష్కారం

అవంతి రాజ్యాన్ని చంద్రసేనుడు అనేరాజు పరిపాలిస్తుండేవాడు. ఇతను గొప్ప సాహసవంతుడు, వీరుడు కత్తి పట్టిననాటినుండి ఓటమి ఎరుగనివాడు. ఇతనిమంత్రి పేరు సుబుద్ధి. అవంతికి సంవృద్ధిగా నదులనీరు ఉండటంతో పంటలు బాగా పండేవి. ప్రజలందరూ సుఖంగా ఉండేవారు. అవంతికి సరిహద్దు రాజ్యం ఉత్కళ దీనిపాలకుడు వక్రకేతు అనేరాజు. ఇతను యుద్ధ పిపాసి. పలు మార్లు అవంతిపై దండెత్తి ధన, జననష్టంతో ఓటమి చవిచూసాడు. ఏనాటికైనా అవంతిని జయించి తీరాలని పట్టుదలతో ఉన్నాడు.

వరుసగా రెండేళ్ళు వర్షం సకాలంలో పడకపోవడంతో ఉత్కళరాజ్యంలో కరువు సంభవించింది. ఉత్కళ రాజ్యప్రజల ఆదుకునేందుకు తన ధాన్యాగారంలోని ధాన్యాన్ని ఉత్కళప్రజలకు ఉచితంగా తరలించడం తోపాటు తనరాజ్యలో ఎప్పుడూ నీటితో కళకళలాడే జీవనది ఐన గంగానది నీటిపాయను ఉత్కళరాజ్యానికి కాలువగా తరలించాడు. ఉత్కళ ప్రజలు తాము శత్రుదేశమైనప్పటికి మానవతా దృష్టితో ఆదుకున్నచంద్రసేనుడిని అతని దయార్ధ హృదయాన్ని మెచ్చుకున్నారు.

గురు కులంలో విద్య పూర్తిచేసి సంవత్సరకాలం వివిధ దేశాలలో పర్యటించి లోకానుభవం పొందిన తనకుమారుని పుట్టినరోజు వేడుకలు జరుగుతున్న సమయంలో యువరాజు పట్టాభిషేకం ఘనంగా నిర్వహించిన చంద్రసేనుడు "చిరంజీవి ఈరోజు చాలా సంతోషంగా ఉంది. త్వరలో మహారాజుగా పట్టాభిషేకం,మరియు వివాహం నీకు జరిపించాలి అనుకుంటున్నాను. ఈ ఆనంద సమయంలో నీకు ఏంకావాలో కోరుకో" అన్నాడు చంద్రసేనుడు.

తన మనసులోని కోరికను వెల్లడించాడు యువరాజైన విజయుడు. యువరాజు కోరికవింటూనే చంద్రసేనుడు, అతని మంత్రి సుబుద్ధి ఆశ్చర్యపోయారు.

అనంతరం మంత్రితో సమావేశమైన చంద్రసేనుడు "మంత్రివర్యా నా కుమారుడు ఇలాంటి కోరిక కోరతాడు అనుకోలేదు. ఇచ్చినమాట తప్పలేను అతని కొరిక మనం తీర్చవలసిందే!" అన్నాడు చంద్రసేనుడు.

"ప్రభు మన యువరాజు గారు ఉత్కళ దేశపు రాజకుమారితో వివాహం జరిపించమని కోరాడు అంటే ఆమెతో మన విజయునికి గతపరిచయం ఉండి ఉండాలి"అన్నాడు మంత్రి. "నిజమే ఉత్కళ రాజకుమారి నగరపొలిమేరలలోని ఆలయానికి కొద్దిమంది సైనికుల రక్షణలో, తనచెలికత్తెలతో వచ్చిందట అప్పుడు బంధిపోటు దొంగలు కొందరు ఆమెవంటిపై నగల కొరకు దాడిచేయగా ,అలయంలో ఉన్న మన యువరాజు బంధిపోటు దొంగలను తరిమి కొట్టాడట, అక్కడ వారి మనసులు కలిసాయి అని చెప్పాడు"అన్నాడు చంద్రసేనుడు." ప్రభూ మీరు ఉత్కళదేశ ప్రజలను ఆపదకాలంలో ఆదుకుని వాళ్ళకు వ్యవసాయానికి నిరంతరంగా నీరుఇచ్చి వారి అభిమానా నికి పాత్రులైనారు.

తమరు మన యువరాజుకు ఉత్కళ రాజకుమారితో వివాహంజరిపించాలి అనుకుంటున్నామని ఉత్కళ పాలకుడు వక్రకేతుకు సందేశం పంపితే ఎంతో సంతోషంగా అంగీకరిస్తాడు. పైగా ఆదేశపు రాజకుమారికూడా మన యువరాజును ప్రేమిస్తుంది. మనకు శత్రువుల బాధ ఉండదు. ఈవివాహంతో శాశ్వత పరిష్కారం లభిస్తుంది" అన్నాడు.

-డా.బెల్లంకొండ నాగేశ్వరరావు.
9884429899

దైవ జీవులు!

నోరులేని ప్రాణులు
వన్య ప్రాణులు!
దేవుని సృష్టిలో భాగాలు
స్వార్థమెరుగని జీవాలు!.

వనాలను ఆసరా చేసుకుని
స్వేచ్ఛగా సంచరిస్తూ
తమ జీవనం సాగిస్తూ
ప్రశాంత జీవితం గడుపే
అమాయక జీవులు!.

చెట్టూ-చేమలను నమ్ముకొని
గడ్డి పరకల దాణాతో తృప్తిపడి
రేపటి కోసం దిగులు చెందని
పచ్చని అరణ్యంలో
కనువిందు చేసే నిస్వార్థ జీవులు!.

చెట్ల నీడలో సేదతీరుతూ
సహజ తటాకంలో గొంతు తడుపుకుని
చెంగు చెంగున గెంతుతూ
కోనకు ఆభరణాలై
కనులు మిరుమిట్లు గొలిపే
కాంతి చిహ్నాలు!.

జీవ సమతౌల్యం కోసం
మాంసాపేక్షగల జీవులుగా
శాఖపాకములు భుజించు ప్రాణులుగా
తమ తమ ధర్మాలను నిర్వర్తించే
నోరు లేని జీవులు!

మాటకు దూరమైనా
కంటి చూపుతో సమస్తం గ్రహించే
పరిణితి చెందిన ప్రాణులు!
విశ్వాసానికి ప్రతిరూపాలు!

వేటాడుట విసర్జించు
జీవ వధను వర్జించు!
ప్రాణులను హింసించడం మాని
వాటి మనుగడకు నీవంతు
సాయం అందించు!

అందుకే...
వనాలను రక్షించు
వన్య ప్రాణులను కాపాడు!
మూగ జీవులను ప్రేమించు
ప్రకృతి ధర్మానికి సహకరించు!

-వంగర. పరమేశ్వరరావు
9491400534

నలిగే క్షణాలు

గూడు విడిచిన పక్షి మాదిరి
తపనపడ్డ క్షణాలు నలిగిపోతున్నాయి .
తుఫాను వీచినట్లు
ఎడారులు ఎత్తిపోసినట్లు
ఇంటికి దూరమైన పిల్లలు
హాస్టల్ లో వేలాడుతున్నారు.

గుండెను తడిపే పలకరింపు కోసం
దూర భారాన్ని దింపుకోవటం కోసం
కన్నీటి తీగలు చెవిలో మోగుతున్నాయి .
కొన్ని చేరువ కావలసినపుడు
కన్నీటి చినుకులూ కురుస్తాయి .
ఈ కాసింత కాలాన్ని
ఓపిక మీదే ఆరేయాలి
కన్నవారి కలలు పిల్లల్లో
పిల్లల కలలు ఆప్యాయతల్లో
వాలుతుంటాయి .
రాత్రులు కన్నీటి నదుల్లో తడిపేస్తే
మీ జ్ఞాపకాలు కలవరపెడతాయి.
మళ్ళీ తెల్లవారు కోసం
రాత్రుల్ని చించుకోవాలి .
పేగుబంధమంటే ఏమని చెప్పాలి
తీగలు లేకుండానే
దూరాల్ని సైతం కుదిపేది
మనసుని సైతం కూల్చేదీ ....
అయినా చిట్టి తల్లీ
కాస్తా చదువుకో వచ్చేస్తా ....
సమయాల్ని నిద్రలేపి
అనురాగపు తీరాల్ని మీ దరికే
తీసుకొచ్చేస్తా ...

-గవిడి శ్రీనివాస్
08886174458

మానవత్వపు జన్మగుణం

అనుబంధాలకు తిలోదాకాలు ఇచ్చి
ధనదాహంతో, ఆస్తులను ఆరగించ
మనసుకు స్వార్థం ముసుగులు వేసి
ముఖానికి డిసైన్ మాస్కులు ధరించి
లోన రాబందుల గీతాలు ఆలపిస్తూ....
మాటల గుర్రాల ఎక్కించి
కష్టాల కడలిని దాటిస్తున్నట్లు....
మానవతా మహాకావ్యాన్ని
పైకి వల్లేవేస్తూ....
పగటి వేషగాళ్లను మరిపిస్తుంటే...

మంచిని వంచించి
సమాజాన్ని సజీవ సమాధిచేసి
రంగులద్ది ప్రగతి పథమంటూ...
మాటల తేనెల జల్లులు కురిపించే
నాయకులంతా నేడు...
అచ్చం పగటి వేషగాళ్లను మరిపిస్తుంటే..

భక్తి ప్రపత్తులతో కీర్తిస్తూ..
ముక్తి కోసం భజనలు చేస్తూ..
శక్తి కోసం చాటుగా భుజిస్తూ..
శార్దూలపు లక్షణాలున్నా
సాదువోలే నటిస్తూ...
పగటి వేషగాళ్లను మరిపిస్తుంటే..

దేశం కోసం పోరించిన అమరుల
రక్తాన్ని తాగిన నేతలు
నేడు ఉపాధి లేని యువతను
స్వాతంత్ర్య,
గణతంత్ర దినోత్సవ సంబరాల్లో
తేలియాడేలా,తాగి ఊగేలా చేస్తూ...
గారడి మాటలతో
పగటి వేషగాళ్ళను మరిపిస్తుంటే....

ఉన్న ముఖాన్ని దాచుకుని
మనసులో లేని మాటలతో
పెదాల పలకరింపులతో
ఏ క్షణాన ఏ ముఖం ఎవరిదో
ఎలా ఉండబోతోందో తెలియక
ప్రతి ఒక్కరు నటనలో ఆరితేరితే
అసలు మనిషివ్వరో ....?
పగటి వేషమేవరిదో.....?
తెలియని స్థితిలో ఉన్నామిపుడు..

మనిషిని మనిషిగా చూడకుండా
మధనపడుతూ మంచాన చేరినపుడు
పలకరించి పరిచారం చేయ కావాలిసింది
తోటి మనుషులే ..!
మానవత్వపు జన్మ గుణం
మట్టిలో కలిసే వరకు
మెరుగుపెట్టుచు మసులుకుంటే
మమతానురాగలు
ప్రతి ఇంటిలో పూయవా..?



-దుప్పటి మొగిలి
8466827118

సమాజ సేవలో సాగాలి

కలమును చేపట్టి..
కవితలెన్నో రాశాను..!
సమస్యలపై ఎక్కుపెట్టి..
అస్త్రాలు సంధించాను..!!
మనుగడ సాగుటకు..
మార్పును కోరుకున్న.!
మలినం కాకుండుటకు..
పోరును ఎంచుకున్న..!!
జీవమున్నంత వరకు..
న్యాయముకై పోరాడుతాను.!
ఊపిరున్నంత వరకు..
ఉద్యమపంతా మార్చుకోను..!!
సకల జీవరాశులను..
కాపాడుటకు పూనుకోవాలి..!
సమన్యాయం పంచుటకును..
కంకణబద్దులం కావాలి..!!
ప్రకృతిని కాపాడుటలో..
భాగస్వాములం కావాలి.!
కాలుష్యాన్ని నివారించుటలో..
ముందంజలో వుండాలి..!!

-పసుల.శంకర్
9542181301

తెలుగు భారతికి ! నా అక్షర హారతి!!

నా తెలుగు భాష నా జాతి ఆత్మ ఘోష
నా తెలుగు యాస నా జాతి జీవనశ్వాస

నేను తెలుగువాన్ని నా భాష తెలుగు భాష
యాభైఆరు అక్షరాలే నాతెలుగుజాతికి వరాలు

ఆ అక్షరాలే...
నా తెలుగునేలపై కురిసిన విరిజల్లులు

ఆ అక్షరాలే...
నా తెలుగుజాతి గుండెల్లో విరిసిన హరివిల్లులు

ఆ అక్షరాలే...
నా తెలుగుతల్లి సిగలో మురిసే ముద్దమందారాలు

నా కవులు వ్రాసిన పద్యాలే...
నా తెలుగుతల్లికి సమర్పించే పారిజాతపుష్పాలు

నా తెలుగు పండితుల కావ్యాలే బృహత్ గ్రంథాలే...
నా తెలుగుతల్లికి అలంకరించే పట్టుపీతాంబరాలు

నా తెలుగు సంస్కృతే...
నా తెలుగుతల్లి నుదుట దిద్దిన కుంకుమతిలకం

నా తెలుగు సాంప్రదాయాలే...
నా తెలుగుతల్లికి వెలకట్టలేని బంగరు ఆభరణాలు

నా తెలుగు గాయకులు ఆలపించే మధురగీతాలే...
నా తెలుగుతల్లి మెడలో మెరిసేటి పూలహారాలు

ఏమని వర్ణింతు తెలుగుభాష వైభవం తెలుగువాడిపౌరుషం
తెలుగుతల్లి కడుపున పుట్టడం మన పూర్వజన్మ సుకృతం

ఎక్కడ తెలుగు వుంటుందో! అక్కడ వెలుగు వుంటుంది
ఎక్కడ వెలుగు వుంటుందో! అక్కడ వికాస ముంటుంది

అందుకే ఆ తల్లికి ప్రణామం !..ప్రణామం!... ప్రణామం...
నా తెలుగుతల్లికి వందనం! అభివందనం!పాదాభివందనం

-పోలయ్య కవి
కూకట్లపల్లి
9110784502

ఎన్నికల చిత్తు బొత్తులాట !!

ఎన్నికల భేరి మ్రోగింది
ఆట మొదలవుతుంది
ఎత్తు లాట......
ఇది పొత్తు లాట.....
ఇది రాజకీయమైన
చిత్తు బొత్తు లాట
కీచులాట.......
పాత పాచికలాట
రాజు రాణి జోకర్ లెక్క
పత్తాలాట.....
రాజకీయమైన రంగు లాట
గొప్ప అంకులాట.......
బైకులతో, మైకులతో
ఆటో రిక్షాల తోడ
హోరెత్తే ప్రచారాల
జోరేత్తే ప్రసంగాలు
మీ ఓట్లు మా గుర్తుకే
మా హామీ మీ మార్పుకే
పలు రకాల ప్రమాణాలు
బహుమతులతో ప్రమోదాలు
జయ జయ జయహో ! అని
పల్లెల నిండా.........
పట్టణ – వీధుల గుండా
హోళ్ల నిండా –– జనాళి
నోళ్ల నిండా.......
ఎత్తు లాట చిత్తులాట
శివసత్తుల చిందులాట
డప్పు దరవ్వు సయ్యాట
డోలు సన్నాయి పాట
పార్టీలతో స్టెప్పు లాట
బుడబుక్కల వేషమేసి
బురిడీ కొట్టించుటకే
గంగిరెద్దుల గంతులేస్తూ
గారడీలు చేయుటకే
రాజకీయ తంత్రాలతో
మలయాళీ మంత్రాలతో
ఎత్తులాట చిత్తుబొత్తులాట
ఈ ఆటలో...........
గుండాగిరి ఉంటుంది
గులాంగిరి ఉంటుంది
గులాములు,గుండాలు
శత్రువులు.....
శని గ్రహాలు....
శకుని మామలుంటారు
విజ్ఞులు ఉంటారు
విష పురుగులుంటారు
వివేకవంతులుంటారు
దొంగలు , లంగాలు
లఫంగలు రకరకాల వాళ్ళు
అందరూ ఉంటారు
ఈ చిత్తబొత్తుల ఆటలో...
పల్లెలల్లో.....వాడలల్లో...
పట్టణాల....వీధుల్లో
ఓటరుల్లారా.......
గ్రహచారం మారుస్తామని
గ్రామాలకు కొత్త రూపు
తెస్తామని నమ్మించి
కల్లబొల్లి మాటలతో
కొత్త కొత్త పాటలతో
ప్రచారము గావిస్తూ
మేక వన్నె పులులు
తిరుగుతుంటాయి
తోకచుక్కలు మెరుస్తుంటవి
ఓటరులారా !
ఈ ఆటలో జాగ్రత్త సుమా !
ఒక్క రోజు ఓట్ల పండుగకు
లెక్కలేనన్ని కోట్ల ఖర్చు
పార్టీలకు పట్టం కట్టాలని
పక్క దారుల్లో పల్టీలు కొడ్తారు
చిత్తుబొత్తులాట
ఈ చిత్తుబొత్తు ఆటలో...
పదవి కొరకు పైసా కొరకు
దిగజారే నేతలతో....
సిగ్గు శరము నెరుగనట్టి
శిఖండి సహా జాతులతో
బానిసలై బ్రతక కండి !
ఇతరుల మాటలు నమ్మి
ఇరుకుల్లో పడకండి !
వెన్నుపోటు పొడిచే టోన్ని
పొలిమేర దాటి చండి !!
దగుల్బాజీ నాయకులను
దరికి చేర నీయకండి
ఎవ్వరికీ తలవంచక
డబ్బులకు లొంగిపోక
తోడుగా మీ వెంట నిలిచే
నీడగా మీ వెంట నడిచే
నిజాయితీకి పాటుపడే
నాయకున్ని ఎన్నుకోండి!
ఐదేళ్లు దాటిన పిదప
మీ వెంటే ఉండేటోన్ని
కష్టాన్నీ పంచుకొని
కన్నీళ్లను తుడిచేటోన్ని
ఓటు వేసి గెలిపించండి
అన్నల్లారా ! అక్కల్లారా !!
తెలంగాణ కన్న తల్లి
కలత బాప కదలి రండి!
నిజాయితీగా పాలించే
నాయకులను ఎన్నుకోండి!
స్వార్థపరుల సాగనంపక
స్వయం పాలనమ్ముచేయ
సామాన్యుల కష్టాలలో
సాయపడే నాయకుల్ని
ఎన్ను కొనగా... మీరంతా
కదలి రండి ! కదలి రండి!!
కలియుగ నరకేసరులై..
కవన విజయ శేఖరులై
కదలి రండి! కదలి రండి !!
ఈ చిత్తుబొత్తు ఆటలో
చివరికి గెలుపెవరిదో !?
నల్ల వస్త్రం కళ్ళకు కట్టిన
న్యాయదేవతకు వదిలేద్దాం!!
నిజాయితీపరునికి పట్టం కట్టండి

-రసస్రవంతి 7075505464
-కావ్యసుధ 9247313488

మట్టి-మనీషి

మట్టి.. మట్టి.. మట్టి
ఇది సమస్త విశ్వానికి మూలం

మట్టి కొత్త రూపంలో
బండలా జన్మిస్తుంది
కొండలా ఉదయిస్తుంది
గోడలా పెరుగుతుంది
మేడలా ఎదుగుతుంది.

మట్టి విలువ పెంచుకొని
మణిరాజమవుతుంది
మరతాను అవుతుంది
ముకురమ్ము అవుతుంది
ముకులమ్ము అవుతుంది.

మట్టి ప్రాణం పోసుకొని
చెట్టులా ఎదుగుతుంది
చేపలా ఈదుతుంది
గువ్వలా ఎగురుతుంది
గుర్రమై ఉరుకుతుంది.

మట్టి ఊపిరి నింపుకొని
మనిషిలా నడుస్తుంది
మాట మాటలో మధువు చేరిన
మనీషిలా నిలుస్తుంది
మహిత బిరుదు పొందుతుంది.

– రేగులపాటి కిషన్‌రావు
సెల్:

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు. నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ప్రథమ బహుమతి విజేత

చేదు ముద్రలు

నిద్రలోకి జారుకున్నా
నిద్రాణమైయున్న చేదు ముద్రలు
పీడకలల్లే పీక్కుతింటున్నాయి
వేధించి వెంటిస్తున్నాయి.
మనిషిగా బతుకుతున్నా
మనసులో మసలుతున్న
గతం తాలూకు ఆలోచనలు
హాలాహలమై బాధిస్తూ
జీవత్వాన్ని చేస్తున్నాయి.
దిగమింగిన దుఃఖం
అధిగమించిన అటుపోట్లు
సమ్మించి పొడిచిన వెన్నుపోట్లు
నానారకాల ప్రతిఘటనలు
నరనరాన జీర్ణించుకుపోయి
అంతులేని ఆత్మవిశ్వాసాన్ని
అణువణువునా నింపి
ప్రస్తుతం ముందుకు నడిపిస్తున్నాయి
గతం వెంటాడి వెంబడిస్తున్నప్పటికీ...

-బస్వ రాజ్ కుమార్
సిద్దిపేట

ద్వితీయ బహుమతి విజేత

వెంటాడుతున్న గతం

మనసు మహా చిత్రమైంది
ఆనందించే ఘటనలు అనంతంగా ఉన్నా..
అవమానాల సంఘటనలను
అంతరంగ చూరుకు తగిలించి
పదే పదే గుర్తుచేసి
ఆవేదనల అశ్రువులతో ఆరని చిత్తడి చేస్తుంది..
ఎంతకూ మరువనీయక వెంటాడుతున్న గతమై
పట్టి పీడిస్తుంది..
అందుకే వెంటాడే
గతాన్ని మరిపించేందుకు
అంతరాత్మకు ఆధ్యాత్మికత
తాయిలం ఇవ్వాలి..
ధ్యానంతో మనసుకు
మరిచే శక్తిని ఇవ్వాలి..
అన్నింటినీ ఆమోదించే
సమత్వ భావన పెంపొందించాలి..
పొందిన గౌరవ మర్యాదలు
అందిన అపురూపమైన
సత్కారాలను త్రోసిరాజని
చాటెడు సంతోషంలో నాలుగు మట్టిపెడ్డల్లాంటి
బాధలను పట్టుకుని
గబ్బిలంలా వేలాడుతుంది...

-పురిమళ్ల సునంద,
ఖమ్మం

ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ
శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రముఖ కవి
ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన
మనసు తొడుక్కున్న మనిషి
(దీర్ఘ కావ్యం) గ్రంథావిష్కరణ
తేది: 02-12-2021 గురువారం
సాయంత్రం 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి
ముఖ్యఅతిథి ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
సభాధ్యక్షులు : ఆచార్య తంగెడ కిషన్ రావు, ప్రముఖ కవి ఉపకులపతి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
గౌరవ అతిథులు : శ్రీ కళా జనార్ధనమూర్తి అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
ఆచార్య మసన చెన్నప్ప తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
శ్రీ దాస్యం సేనాధిపతి ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు
శ్రీ బైస దేవదాసు నేటి నిజం దినపత్రిక సంపాదకులు
డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
కళాశారద కార్యదర్శి, త్యాగరాయగానసభ

ఆహ్వానము
పురిమళ్ల ఫౌండేషన్
తృతీయ వార్షికోత్సవం
పురస్కార ప్రదానోత్సవ సభ
(జూమ్ ద్వారా)
తేది : 05-12-2021 ఆదివారం ఉదయం 10 గంటలకు.
బహుమతి పొందిన కథల, కవితల సంకలనం - 2021 ఆవిష్కరణ
ప్రముఖ సాహితీవేత్త బహుముఖ ప్రజ్ఞాశీలి డా॥ దిలావర్ గారికి "భోగోజు పురుషోత్తం - సముద్రమ్మ" స్మారక పురస్కార ప్రదానం
అతిథులు : శ్రీ ఏనుగు నరసింహారెడ్డి, శ్రీ మువ్వా శ్రీనివాసరావు, శ్రీ దాస్యం సేనాధిపతి, శ్రీ శ్రీకంఠస్ఫూర్తి, శ్రీ దాట్ల దేవదానం రాజు, శ్రీ కె. ఆనందాచారి, శ్రీ సీతారాం, శ్రీమతి దాసోజు పద్మావతి, శ్రీ శ్రీ దాస్యం లక్ష్మయ్య, శ్రీ పోతగాని సత్యనారాయణ, శ్రీ కొత్తూరు సత్యనారాయణ గుప్త, శ్రీమతి రమాదేవి కులకర్ణి, శ్రీ లెనిన్ శ్రీనివాస్, శ్రీ సంటి అనిల్‌కుమార్, శ్రీమతి మూర్తి శ్రీదేవి
పురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ, ఖమ్మం.
పురస్కార ఫౌండేషన్ వ్యవస్థాపకులు & పురస్కార ప్రదాతలు: పురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు
కార్యక్రమ సమన్వయ కర్తలు: నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ళ ఉపేందర్

అక్షరాల తోవ 4వ వార్షికోత్సవం సందర్భంగా....
అక్షరాల తోవ పురస్కారం - 2022
మూడు ఉత్తమ కథలకు సమాన బహుమతులు :
ఒక్కో కథకు 2000/- నగదు మరియు అక్షరాల తోవ పురస్కారం
ప్రతి సం॥ము జరిగే ఈ కథల పోటీల్లో....
నిబంధనలు :
మనసును తాకాలి, మధురానుభూతిని కలిగించాలి, నాలుగు కాలాల పాటు పాఠకుల హృదయాల్లో నిలిచే సరికొత్త కథలకు మాత్రమే ప్రాధాన్యత.
- నవ్యత, సృజనాత్మక కలిగిన కథలు మాత్రమే ఈ పోటీకి తీసుకోబడును.
- సామాజిక అంశమేదైనా వస్తువుగా స్వీకరించవచ్చు.
- కథలను డి.టి.పి. చేసి పంపించాలి. (ఎ4 సైజులో 5 పేజీలు దాటరాదు) (చేతి రాత కథలు తిరస్కరించబడును.)
- ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం అయిన కథలు కాకుండా ఈ పోటీ కోసం ప్రత్యేకంగా రాసినదై ఉండాలి.
- ఒక రచయిత ఒక్క కథ మాత్రమే పంపించాలి.
- రచన దేనికి అనుకరణ, అనుసరణ కాదని హామీపత్రం జత చేయాలి. రచయిత వివరాలు హామీపత్రంలోనే పేర్కొనాలి.
- ఈ పోటీకి సంబంధించి న్యాయ నిర్ణేతదే తుది నిర్ణయం. ఎటువంటి ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- మీ కథలను 20 డిసెంబర్ 2021వ తేదీ లోపు క్రింద తెలిపిన చిరునామాకు పోస్ట్ / కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలి.
సదా సాహిత్య సేవలో...
అక్షరాల తోవ ఖమ్మం రి.నెం. 339/2018
నామా పురుషోత్తం - 9866645218
దాసరోజు శ్రీనివాస్ - 9010972169
రాచమళ్ళ ఉపేందర్ - 9849277968
మీ కథలను పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతిలాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001.
సెల్ : 9849277968

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 383వ రోజు 'చీమల దండు- క్రమశిక్షణ ఉన్న సైనిక పటాలం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంపుకున్నారు. 'చీమల దండు- క్రమశిక్షణ ఉన్న సైనిక పటాలం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. - సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, *9441046839*

అలుపెరుగని బాటసారులు

ఎవరు నేర్పారమ్మా
బతుకు పాఠం
ఓ పటాలమై నడిచేను
నిరంతరం ఆగని నడక
కదిలేను క్రమశిక్షణగా కవాతు చేస్తూ.
పాఠశాల లేదు
శిక్షణాలయాల్లో బోధనా లేదు
తలకు మించిన భారం మోస్తూ
శ్రమను ప్రేమించే తాత్విక జీవితం.
గూడు గుమ్మడిపూల పుట్టగౌరమ్మ
ఆహార భద్రతకు ప్రకృతి ఒడిలో గిడ్డంగులు
మల్లన్నపట్నాల్లో పుట్టమట్టికే తొలి పూజ.
పాపం
పనిచేస్తేనే గండాలుంటాయనే
సోమరిపోతులకు గొంతులో
పచ్చి వెలక్కాయే
ఆపసోపాలు పడే
అందాల బుట్టబొమ్మలకు మాటలు కరువే.
ఐకమత్యాన్ని చాటే సైనిక పటాలం
పరోపకారం సమిష్టి సహకారం
అందించే సామర్థ్యం
చీమలకే సొంతం.
సహాయ నిరాకరణులకు
స్వార్థం గూడు కట్టుకున్నవారికి
తెలుసుకుంటే ప్రేరణా పాఠం
మసలుకుంటే వెలుగు దీపం.

- ఏడెల్లి రాములు

క్రమశిక్షణ!

శిక్షణతో పనిలేని క్రమశిక్షణ
ప్రకృతి దత్తం!
బారులు బారులు సాగుచీమలు
పిపీలికం మొదలు గండుచీమలు
శ్రమైకజీవులు!
చీమలు పెట్టిన పుట్టలు
పాములకిరువైతే
దండుదండు కదిలి
పాము పనిపట్టు!
పుట్టలోనివాటి పొట్టనింపుటకై
నోటగింజపట్టి ఎండనక
వాననక దండుతోకదిలి
బండలేదాటు!
కొన ఊపిరి ప్రాణి చుట్టుముట్టి
ఉసురుతీయు !
చీమేకదాఅని చేయకు అలుసు.
శిక్షణ పొంది క్రమశిక్షణ తో
దేశరక్షణ కై కదులు సైనిక పటాలం!
వీపున ఆయుధాల బరువు
శత్రుతూటాలకి
తనవారు చెల్లాచెదురైనా
పైవారి ఆజ్ఞమీరని
మడమతిప్పని పటాలం!
కులమతజాతి
వివక్షత లేని సైన్యం!
ఐకమత్యం చతురతతో
దేశం కోసం పోరాటం!
అందుకే చీమలబారులా
కొండలుగుట్టలు ఎక్కేరు!
ఉడుములా పట్టుసాధించేరు
ఛేదించేరు లక్ష్యాన్ని!.
చీమలదండు ఆదర్శం కావాలి
సైనిక పటాలం ఆచరణలో పెట్టాలి!.

-ఎ.రాజ్యశ్రీ

క్రమశిక్షణ సజీవరూపాలు

చీమ చిన్నదే
ఆలోచన పెద్దది
చిట్టి బుర్ర
బుర్రనిండా భవిష్యత్ ప్రణాళికే..
సుఖ జీవనానికి ప్రణాళికే.
ఐకమత్య చిహ్నం
క్రమ శిక్షణకి మారుపేరు
మానవుడికి ఆదర్శం
తనిఖీ అవసరంలేని
అంతర్గత శిక్షణ...
పుట్టల్లో నివాసం
పనివిభజన
ఎవరి పని వారిదే...
అదిలింపులు
అజమాయిషీలు
లేని జీవితం
ఈనాటి మన ఇంటి నమూనాలు
చీమలు నేర్పినవేమో...
మనకే కాదు వాటికీ
విశ్రాంతి గది
ఆహార నిల్వ గదులు
పిల్లలపెంపకం గదులు
వేటికవే వేరు
అన్నిగదులని కలుపుతూ దారి
విచిత్రమే మరి..
చీమల దండు
సైనిక పటాలం
క్రమశిక్షణ గా కదులు
రెంటికి ఎంతో సామ్యం
దేశ ప్రగతికి
క్రమ శిక్షణ పునాది
సంఘ సౌభాగ్యం
క్రమశిక్షణలోనే
ఆ కారంలో చిన్నదైనా
అనువైనవి నేర్పే గురువు కదా!.

- మోటూరి శాంతకుమారి

బ్రతుకు పథం

జీవన పయనం
తెలువని చీమ జాతి జీవం
సమైక్యతే వాటి బలం
దొరికిన ఆహారం
దాచుకోవడమే వాటికి
తెలిసిన జ్ఞానం
గుట్టల ఆహారమైన
హరించి వేసే తత్వం
గుమి కూడి
గుంపుగా చేరి
ఉమ్మడిగా ఉన్నా
మూగ సైగల బంధుత్వం
పోట్లాటలు
ఆరాటాలు
పైశాచికాలు
లేనేలేకుండా
దేవుడు నేర్పిన బ్రతుకు
సమరం సాగిస్తూ
చీమల దండు
నాగరిక బ్రతుకులకన్నా
వాటి బ్రతుకే మెండు
విజ్ఞాన జాతి
నేర్చుకోవాల్సిన బ్రతుకు పాఠం
ఇల్లు ఒకటే
దారి ఒక్కటే
అది సైనిక పటాలమే
కానీ...వినాశన
యుద్ధము చేయలేని
ఒక బ్రతుకు సమర పటాలం.

-జె.నరసింహారావు

ఆదర్శం

ఐక్యతకు మారు పేరు
సమైక్యతకు ఒక చిరునామా
చిన్న చీమ
పెద్దబరువును మోస్తూ
మానవజాతికి
విశ్వసనీయత ప్రోది చేస్తుంది
ఆహారపొదుపులో ముందు చూపు
నాకే కావాలి అని స్వార్థం లేక
కలిపి ఆహారం సేకరించడం
లోకకళ్యాణాన్ని ఆశించే
చీమ నుంచి అయినా గ్రహిద్దాం
చలి చీమలు సైతం
బలవంతమైన సర్పాన్ని
కూడా చంపగలవు
అనే స్ఫూర్తి
కుటుంబం అయిన
వ్యవస్థ అయిన
దేశం అయిన కావాలి
ఐక్యత
విజ్ఞానం విచక్షణ గల
నాగరికత ముసుగులో
స్వార్థం పెట్రేగి
సమస్యలకు
కారణం అవుతున్న మనం
ఒక్కసారి
చీమల దండును చూడు
నేర్చుకో
ప్రగతివైపు సాగు.

-వి.శేషారావు

నల్ల పూసలదండు

అల్లరి ఆరాటాన్ని
వక్ర వక్రంగా తిప్పి
గింజ గింజ
మోసి మోసి పోగేసి
చక్కదనపు సొగసును అద్ది
అలుపెరుగని పట్టుదల యిక్కడ
బ్రతుకు దెరువు ఆరాటం ఆరిపోని జాగ్రత్త
పొట్టను భూమి మీద రాస్తున్న శోష.
దేశంకోసం యిదే చీమ చిటుక్కు మంటే
పక్కనే ట్రిగ్గర్ మీద వేలు బిగుసుకుంది
శత్రువు గుండెల్లో గుండు దిగి పోతుంది
అక్కడ ఈ చీమ జాగృతిని గుర్తు చేస్తుంది
దేశం కోసం కడుపుపై దేకుతు పడే గోస.
ఎన్నిరోజులు ఎక్కడెక్కడో తిరిగి
చలిచీమ శ్రమను చలికాల మంత చూపించి
తెగి పోని దారానికి నల్లపూసల నల్లినట్లు
బియ్యం చెక్కర ముక్కలను మోసి మోసి
వానాకాలమంతా నక్కి నక్కి దాక్కొంటు
రంధ్రాల గుడిసెల్లో దాచి గుడ్లుపెట్టి పొదగాలి.
పుట్టినగడ్డను
వావి వరుసలను మరిచిపోయి
కన్న తల్లిగా నడిపించిన క్రమ శిక్షణతో
భుజాలపై గన్నులను
మోర్టార్లను మోస్తూ
సాగిపోయే చీమలదండు ప్రయాణంలో
వరుస తప్పితే
కాలు జారితే
లోయలో అంతే
దేశం కోసం ఎంత కఠోరమైన క్రమ శిక్షణ
చీమల దండును మరిపించే సుశిక్షణ.

- కందుకూరి మనోహర్

చీమా... ఏమని పొగడుదు!

అల్ప జీవి చీమ అని
చులకనగా చూడకు !
అది చేసే ప్రతి పనిని
ఆదర్శంగా తీసికో !
క్రమ శిక్షణ దాని తీరు
ప్రణాళికకు మారు పేరు !
శ్రమ తత్వం, సంఘటితం
చీమల జీవన విధానం !.
జాతి వృద్ధి చేయడం
రాణి చీమ వ్యాపకం !
నిరంతర పనుల సాధనకే
శ్రామిక చీమలు పరిమితం !
కాపలా చీమలకు
కంటి కునుకు మృగ్యం !
శత్రువులను అడ్డుకొనుట
సిపాయి చీమల లక్ష్యం !.
మానవాళికి చీమ ఎపుడు
మార్గదర్శని తెలుసుకో !
అల్ప జీవి చీమ అని
చులకన మానుకో !
అది చేసే ప్రతి పనిని
ఆదర్శంగా తీసికో !.

- రామకృష్ణ చంద్రమౌళి

అనితర సాధ్యం

రామయ్య లాంటోడే చీమయ్య
రాజువలే కడవరకు బ్రతుకయ్యా
సంగతి ఏంటో ముందు చూస్తాడయా
పది రెట్లు బరువైనా మోస్తాడయా.
పక్కాగా పని విభజన చేస్తాడయా
రాణి చీమ హుకుంతో నడుస్తాడయా
హడావుడిగా పోతున్నా
మొహం చాటువేయడు
జరంత సేపు పలకరించేనయా.
వానా కాలం కోసమే దాస్తాడయా
శ్రమలో ఒరిగిన దోస్తును మోస్తాడయా
పుట్టల్లో బృందావని చూస్తాడయ
గుట్టల్లో గుడ్లెన్నో దాస్తాడయా.
ఆహారం ఆచూకీ చెప్తారయా
తలోచేయి వేసి తరలిస్తారయా
ఉచిత ఫథకాలకాశ పడనే పడడోయ్
శ్రమ జీవన సౌందర్యం మన చీమలదోయ్!
కుట్టడమే ఆత్మ రక్షణ ఆయుధంగా
అప్రయత్నమే అసువులు బాసే కర్మ
చీమల గొప్పతనం చిత్రమే కదా
ఆరడుగుల మనిషిని
హింసపెట్టగలదుగా !!.

- ఎం. వి. ఉమాదేవి

పిపీలికం

శ్రమైక జీవన సౌందర్యానికి పిపీలికం
శ్రమను నమ్ముకునే జీవులకు ఆదర్శం
క్రమశిక్షణకు మారు పేరు
సంఘీభావనకు
సమిష్టి కృషికి ఆదరువు
తనువెంతన్నది కాదు
పని ఎంతన్నది ముఖ్యం
సోమరితనానికి
వీడ్కోలంటున్నది పిపీలికం
తొందరపాటు ఆందోళన
కలవరాలు బహుదూరం
ఆదర్శవంత జీవనశైలికి చిరునామా
ఆహారపు నిల్వలు
సేకరించడం వాటికే చెల్లు
సమీకృత గృహంగా నిర్మితమైన ఆవాసం
ఆవాసానికి రక్షణవ్యవస్థ ఆదర్శం
చీమలు పెట్టినపుట్టలు
పాముల నెలవు
భవిష్యత్ గూర్చి
మనిషి నేర్వాల్సిన పాఠం
కాలితో అపూర్వ సృష్టి
భూ ఉపరితలం
ప్రతికూలతలో
స్వీయరక్షణకు ఆదర్శం
గతి తప్పిన వాహనచోదకులు
నేర్వాల్సిన పాఠం
మనమెంత అనేదికాదు
కార్యమెంతనేది ప్రధానం
క్రమశిక్షణలో
సైన్యం సైతం నేర్చుకోవాలి
ముందుకు సాగేటప్పుడు
దండులా కదులు
రేఖామాత్ర చలనం
దండుకు ఆదర్శం
మనిషీ !
నేర్చుకో జీవిత పాఠం
నవీన రక్షణ వ్యవస్థను
ఏర్పరుచుకో !.

- లక్ష్మారెడ్డి పసుల

క్రమశిక్షణకు మారు పేరు

క్రమశిక్షణకు మారుపేరు
సైనిక పటాలంలా
ఒకే వరుసలో బారులు తీరి
క్రమశిక్షణగా
గమ్యం వైపు సాగే చీమలు
అందరికీ స్ఫూర్తి.
శరీర బరువు కంటే
ఎక్కువ బరువున్న ఆహారాన్ని
నోటితో లాక్కుంటూ
తీసుకెళ్లే చీమలు
శ్రమైక్య జీవితానికి చిరునామాలు
సోమరి బతుకులకు చెంప దెబ్బలు.
ఆహారాన్ని సరైన పద్ధతిలో
కాలానుగుణంగా కాపాడుకోవడంలో
మనుషుల ఆలోచనలకంటే మెరుగు
వాటిని చూసి నిర్దేశించుకోవాలి
మంచి లక్ష్యాలు
ఆకారంలో అతి చిన్నవి
ఆత్మాభిమానంలో పెద్దవి.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

విజయవంతంగా జరిగిన మల్లీశ్వరి గజల్స్ సమాలోచన

'అతిథులను సత్కరించి సభలో ప్రసంగిస్తున్న రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి

గజళ్ళ సమాలోచన నవంబర్ 23న మంగళవారం సాయంత్రం రవీంద్రభారతిలో రాజావాసిరెడ్డి ఫౌండేషన్ సంస్థాపకురాలు, గజల్ కవయిత్రి, రచయిత్రి, సమీక్షకురాలు, సుప్రసిద్ధ భాషావేత్త, సాహితీవేత్త రాజావాసిరెడ్డి మల్లీశ్వరి గజల్స్ పుస్తకాలు **'మోహన, మల్లియలు, నిరాతప'** లపై గజల్స్ సమాలోచన విజయవంతంగా జరిగింది.

రచయిత, అనువాదకులు, ప్రచురణకర్త, సామాజిక కార్యకర్త మురళీధర్ ఇసనాక కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మురళీధర్ మాట్లాడుతూ గుండెగాయం కాకపోతే గజల్స్ పుట్టవు అంటూ గజల్స్ గురించి మాట్లాడుతూ ఎన్నో విషయాలు తెలియచేశారు.

ముఖ్యఅతిథిగా వచ్చిన తెలంగాణా సాంస్కృతిక శాఖ సంచాలకులు, కవి, రచయిత - మామిడి హరికృష్ణ గజల్ ను గురించి మాట్లాడుతు గజల్ తోటలోకి వచ్చాక గజల్ వెళ్ళనివ్వదు అంతటి మహత్తరశక్తి గజల్‌కి వుంది అన్నారు. గజల్‌ని తెలుగు వాకిళ్ళలో విస్తరింపచెయ్యాలనుకుంటున్నారని విజలక్ష్మి పండిట్ గారిని ప్రశంసించారు. భిన్నంగా ఆలోచించే కాల్పనిక సాహిత్యానికి పెట్టనికోట వల్లూరి రాఘవ గారని చెప్పారు. తెలుగు భాషకి, తెలుగు జీవనశైలికి అనుకూలంగా మనం గజల్స్ రాస్తున్నాం. గజల్స్ దాశరది గారు మొదలు పెట్టారు. దాదాపు ఒక దశాబ్దపు కాలం నుంచీ చాలామంది గజల్స్ రాస్తున్నారు. ఎందుకు ఇంత మంది గజల్ లో ఓదార్పు పొందుతున్నారు. 100 మంది పైన గజల్ రచయిత లు ఉన్నారు. గజల్ గుండెల్ని గుచ్చి శరీరంలో ప్రతి అణువుని స్పృశిస్తుంది. గజల్లో సహజంగా ఉన్న శక్తి అది. ప్రతి మనిషిలో బ్రైన్ అండ్ మైండ్ మధ్య సంఘర్షణ జరుగుతుంది. మైండ్ ప్రతివిషయాన్ని క్యాలుక్యులేషన్ చేస్తుంది, స్పందింపచేస్తుంది. మనసు కవితని హార్ట్ తన భావనలని వ్యక్తీకరించడం. గుండె చే ఇలా స్పందించినప్పుడు విశ్వంలో ఉన్న ప్రతి విషయం కవిత రూపంలోనో, గజల్ రూపంలోనో ఆవిర్భవిస్తుంది.

మల్లీశ్వరిగారు రాసిన గజల్స్ తన లోపల జరుగుతున్న అంతర్లయ అన్వేషణ ఆవిడలో ఉన్న సంపూర్ణమూర్తిమత్వం ఆవిష్కరింపచేస్తున్నాయన్నారు. మల్లీశ్వరి గారు రాసిన మూడు పుస్తకాలు చదివానన్నారు. ఆ భాష, లయ అన్నీ చాలా అద్భుతంగా వున్నాయన్నారు. ఈ వయసులో భాషకి చాలా న్యాయం చేస్తున్నారు. సమయాన్ని సద్వినియోగం చేస్తున్నారు. మల్లీశ్వరిగారు పాడిన గజల్స్ విన్నాను. చాలా బాగా పాడారు. సాహిత్యంలో ఉన్న చాలా ప్రక్రియలలో గజల్ ముఖ్యమైనది. ఈ గజల్ సమాలోచనకి మల్లీశ్వరిగారు నాంది పలికారని అభినందించారు. ఇలాంటి మరిన్ని చేయాలని ఆహ్వానం పలికారు. సుప్రసిద్ధ గజల్ కవి, గజల్ విమర్శకులు, సీనియల్ పాత్రికేయులు, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు గౌరవ అతిథిగా బిక్కి కృష్ణ మాట్లాడుతు... మల్లీశ్వరిగారిని మల్లెపూవు వంటి సున్నితమైన పుష్పంలాంటివారు. ఆ పువ్వు పరిమళం దశదిశలా వ్యాపిస్తుంది. అలాగే మల్లీశ్వరి గారి కవిత్వం అంతగొప్పది. ఆవిడ గజల్స్ కూడా మల్లెలలాగే పరిమళిస్తాయన్నారు. నుడిగుడి పుస్తకాన్ని విశ్లేషిస్తూ... సాహిత్య ప్రపంచం ఆవిడ భాషా పటుత్వాన్ని చూసి ఉలిక్కిపడిందన్నారు. నిరాతప అంటే రాత్రి. ఆవిడ వాడే పదాలు చాలా గొప్పగా వుంటాయి. ఆవిడ కొన్ని పదాలనైనా పాఠకులకి నేర్పించాలనుకున్నారు. ఉపాధ్యాయురాలిగా ఎలా నేర్పించారో.... ఒక కవయిత్రిగా రచయిత్రిగా అలా నేర్పించాలనుకుంటున్నారు.

2000 మందితో సాహితీ వనం గ్రూపుని నిర్వహిస్తూ ఎంతోమంది కవులని, రచయితలని ప్రోత్సహిస్తున్న శాంతికృష్ణ మాట్లాడుతు... మల్లియలులో భావుకత సౌందర్యాత్మకత ఉట్టిపడేట్టు శీర్షికలు పెట్టారు అంటూ "పవలో రేయో తెలియక నీ జత లాస్యమే చేశానేమో... " అంటూ పుస్తకంలో గజల్స్ లో ఉన్న సౌందర్యాల్ని వర్ణించారు. మల్లీశ్వరిగారు భాషా ప్రేమకురాలు, భాషా సేవకురాలు, పరిశోధకురాలు. పెద్ద పెద్ద కాఫియాలు వీరి గజళ్ళలో జలపాతంగా దూకుతుం టాయి. భాష పైన గొప్ప పట్టు వున్న రచయిత్రి. తెలుగు భాష మీద రాసిన నుడి గుడి, ఒక్కపదం అర్థాలెన్నో మల్లీశ్వరి గారి పుస్తకాలు తెలుగుభాషలో చిరస్థాయిగా నిలిచిపోతాయి అని ప్రశంసించారు. మల్లీశ్వరిగారి మోహన గజల్ పుస్తకం కవర్ పేజీ గురించి, పుస్తకంలో గజళ్ళని సౌందర్యవంతంగా వర్ణిస్తూ... మల్లీశ్వరిగారి కలంనుంచీ సుతారంగా జారిన ఆణిముత్యాలు అని కొనియడారు.

కవి, రచయిత, సీనియర్ పాత్రికేయులు ఏబిఎన్ వల్లూరి రాఘవగారు మాట్లాడుతు... లలిత గీతాలు రాసి గజల్స్ అని చప్పట్లు కొట్టించుకుంటారు. గ్రామర్ ప్రకారం కాదు గ్లామర్ ప్రకారం చూస్తే అద్భుతమైన పుస్తకం మల్లియలు. మల్లియలలో ఎన్నో ప్రయోగాలు చేశారు. పూలతోటలో తప్పిపోవడం అనేది చాలా అద్భుతంగా వుంది అన్నారు. మా తెలుగ తల్లికి మల్లెపూదండ ఆవిడకే వర్తిస్తుందేమో. నుడి గుడితో భాషా ప్రయోగాలు చేశారు. గజళ్ళలో మరో అడుగు ముందుకు వేసి ఒక అద్భుతమైన సాహితీ ప్రపంచంలోకి తీసుకుని వెళ్ళారు అన్నారు. మహోన్నత గజల్ ప్రపంచానికి కొత్త వాకిలి తెరిచిన గజల్ రచన మల్లీశ్వరి గారిది అని అభినందించారు. విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పలవలి విజయలక్ష్మీ పండిట్ గజళ్ళ గురించి ఒక సమాలోచన అంటే గజల్ ఆత్మసౌందర్యదర్శనం. ఉర్దూ వరకు, హిందీ వరకు వచ్చి ఆగిపోయిన గజల్ ని మొదట దాశరథిగారు, సి. నారాయణరెడ్డి గారు తెలుగులో ప్రారంభించారని తెలిపారు. సమాజంలో వచ్చిన కవులందరికీ గజల్ సౌందర్యాన్ని నేర్పించడానికి ప్రోత్సాహం చాలా తక్కువగా వుంది. ఇది హృదయ భాష.. హృదయంలోంచి వస్తుంది. భావ వ్యక్తీకరణని బట్టి, జీవితానుభవం, వాళ్ళు పొందే ఆశనిరాశలు, నిరీక్షణ, వేదన ఇవన్నీ గజళ్ళని సృష్టిస్తాయి. మల్లీశ్వరి చక్కటి గజల్ రచయిత్రి కావడానికి అదనపు సౌకర్యం భాషావేత్త, తెలుగు టీచర్ గా చేస్తూ పాఠశాలని ఒక పరిశోధనా శాలగా చేసుకున్నారు. ఆవిడ రాసిన గజళ్ళలో ఎన్నో కొత్తపదాలు నేను నేర్చుకున్నాను. ఆమె భావగాంభీర్యం, గాఢత కూడా చాలా బావుంటుంది. చదివేటప్పుడు మనం కూడా అవన్నీ పొందుతాం అన్నారు. బహు సాహితీ ప్రక్రియల రచయిత, విశ్రాంత ఉపాధ్యాయులు, చక్రవర్తి మాట్లాడుతూ - ఉత్పలమాలని ఇంగ్లీషులో రాయలేం. కానీ గజల్ అనే ప్రాచీన విదేశీ ప్రక్రియని తెలుగులోకి తెచ్చుకున్న సాహసాన్ని చూస్తే... మల్లీశ్వరిగారు 400 దాకా రాయడం చాలా గొప్పవిషయం. మల్లీశ్వరిగారు పద్యాలు రాశారు, కథలు రాశారు, బాలసాహిత్యాన్ని రాశారు, పదాలపరిమళాలు అని పదాలమీద పరిశోధన చేశారు. తెలుగు సాహిత్యం గురించి భాష గురించి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. నిరాతప గురించి మాట్లాడుతూ కొన్ని ఉదాహరణలతో ఆయన అభిప్రాయాన్ని చక్కగా వ్యక్తీకరించారు.

చివర గజల్ రచయిత్రి, కవయిత్రి, భాషావేత్త, సాహితీ వేత్త మల్లీశ్వరి మాట్లాడుతూ... తాను గజల్స్ ని రాయడానికి బిక్కి కృష్ణగారు ప్రోత్సహించారని చెప్పారు. మాట్లాడిన వారందరూ మనస్ఫూర్తిగా మెచ్చుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది గజల్స్ సమాలోచనకి నాంది అయ్యిందన్నారు. మా వారు జానకిరాం గారు కార్యక్రమ నిర్వహణలో నాకు బాగా సహకరించారని తెలిపారు.

హరికథను ముందుతరాలకు అందించాలి- డా॥కేవీ. రమణాచారి

పద్మాలయ ఆచార్యకు జ్ఞాపికను అందజేస్తున్న డా॥ కేవీ. రమణాచారి

హరికథ కళను ముందుతరాలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కేవీ. రమణాచారి అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్మాలయ ఆచార్య చేసిన పార్వతి కల్యాణం హరికథ గానం నవరస భరితంగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో డా॥ రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హరికథలు ప్రతి గ్రామంలో దేవాలయాల్లో ఏర్పాటు చేస్తే ఆ కళ నిలుస్తుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో చిమ్మపూడి శ్రీరామమూర్తి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమతి పాతూరి మాణిక్యమ్మ సాహిత్య పురస్కారం-2021

మా అమ్మగారైన శ్రీమతి పాతూరి మాణిక్యమ్మ సాహిత్య పురస్కారం-2021 కోసం వచన కవితా సంపుటలను ఆహ్వానించాము. వచ్చిన 45 కవితా సంపుటులలో అత్యుత్తమ కవితా సంపుటిగా పల్లెపట్టు నాగరాజు (చిత్తూరు జిల్లా)గారి **'యాలై పూడ్సింది'** ఎంపిక అయింది. న్యాయ నిర్ణేతగా ప్రముఖ సాహితీ విశ్లేషకులు ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్‌గారు వ్యవహరించారు. పురస్కార గ్రహితకు 5వేల రూపాయల నగదు బహుమతి త్వరలోనే అందించబడుతుందని తెలియజేస్తున్నాము.

- డా॥ పాతూరి అన్నపూర్ణ.
వ్యవస్థాపక అధ్యక్షురాలు మరియు అవార్డు కమిటీ.

సభ్యత

సంకల్పాన్ని-సానుకూలత చేసుకునేలా చేసే మాన్యత - సభ్యత
సంకోచాలకు -సానపట్టక - ముందడుగువేయించే - మృదులత - సభ్యత
సంగతులను దాచిపెట్టి-నంగనాచి పన్లు చేయనివ్వని - నిర్మలత - సభ్యత
సదా - ఎద - ఎదకూ - ఏరువాక సంబరాన్నందించే - ఏకలవ్యత - సభ్యత

సరే - సరేనంటూ - దొంగపన్లు చేయనివ్వని - చేత - సభ్యత
సంకుచిత మనసుతో - ఏమీ సాధించుకోలేమని తెలిపే - సంగీత - సభ్యత
సంఘీభావంతోనే- హాయినందుకునేలా చేసే సౌమ్యత - సభ్యత
సదా - సగౌరవంతో మసలి - సంతోషాన్ని అందుకునేలా చేసే - అమృత- సభ్యత

సంప్రదింపుల -సాంప్రదాయాన్ని-స్వాగతించేలా చేసే - సుప్రభాత - సభ్యత
సకల - కష్ట నష్టాలను - ఇష్టతగా మలచుకునే మమత - సభ్యత
సగం - సగం-సమాచారంతో-అగచాట్లపాలవ వద్దని తెలిపే-దివ్యత-సభ్యత
సందేహాలున్న స్థితి నుండి - సందేశాలను అందించే స్థితికి చేర్చే-రూపలత-సభ్యత

సంయమనంతో - సంతోషాన్ని అందుకునేలా చేసే - సంహిత - సభ్యత
సమున్నత - సహకారంతో - సమస్యలను తీర్చుకునేలా చేసే యోగ్యత - సభ్యత
సరదాగానే వుంటూ - సాకులు చెప్పేలా వుండనివ్వని - విజ్ఞత - సభ్యత
సర్వవేళల్లోనూ - నీకు - నేనున్నానుగా - అనే " స్నేహరేఖ "ల
పారవశ్యాన్ని ప్రోది చేసే - ఆత్మీయత - సభ్యత

-లంకా వెంకట సుబ్రహ్మణ్యం
సెల్: 94404 48650

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.